బుధవారం
18•12•2019
కరీంనగర్

• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 173
• పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM | KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD









## ఇతర కమిషన్లకు దిక్సూచి టీఎస్‌పీఎస్సీ

- 13 పీఎస్సీల్లో మన విధానాల అమలు
- టెక్నాలజీ వినియోగంలో దేశంలోనే టాప్
- ఐదేండ్ల వ్యవధిలో 30 వేల పోస్టుల భర్తీ
- ఉమ్మడి ఏపీ చివరి పదేండ్లలో 24 వేలే
- ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే గ్రూప్ 1, గ్రూప్3 నోటిఫికేషన్ల విడుదల
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో చైర్మన్ ఘంటా చక్రపాణి
- నేటితో ఐదు వసంతాలు పూర్తిచేసుకుంటున్న టీఎస్‌పీఎస్సీ

3

## ముషారఫ్‌కు మరణశిక్ష



- దేశద్రోహం కేసులో పాక్ ప్రత్యేక కోర్టు తీర్పు
- రాజ్యాంగాన్ని రద్దు చేయడం నిబంధనలకు విరుద్ధమని వెల్లడి
- తీర్పు విచారకరమన్న ముషారఫ్

5

# దివ్యక్షేత్రంగా యాదాద్రి

### ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతుంది ▪ చరిత్రలో నిలిచిపోతుంది



మంగళవారం యాదాద్రిలో ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- ఆలయ పనులు డెడ్‌లైన్ పెట్టుకొని చేసేవికావు
- తొందరపాటు, ఆతృత అవసరంలేదు
- ఆలయ ప్రాశస్త్యం చెక్కుచెదరొద్దు
- ఆగమశాస్త్ర, నాణ్యత ప్రమాణాలతో అన్ని నిర్మాణాలు జరుగాలి
- కోనేరు పనులను వెంటనే ప్రారంభించాలి
- ఆలయ నిర్మాణంలో వందశాతం శిలలనే ఉపయోగించాలి
- మైలార్‌గూడెం చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలి
- యాదాద్రి ఆలయ పనుల పరిశీలనలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లబోతున్న యాదాద్రి ఆలయ పునరుద్ధరణ పనులు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేవి కాబట్టి ఎలాంటి తొందరపాటు, ఆతృత అవసరంలేదని, ఆగమశాస్త్ర నియమాల ప్రకారం పూర్తి నాణ్యతాప్రమాణాలతో, అత్యంత పకడ్బందీగా నిర్మాణాలు జరుగాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. గర్భగుడి ఆకారం, ప్రాశస్త్యం చెక్కుచెదరకుండా నిర్మాణాలు ఉండాలని చెప్పారు. పనులు పూర్తయ్యాక యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అద్భుతమైన దివ్యక్షేత్రంగా భక్తులకు సాక్షాత్కారం అవుతుందని అన్నారు. వివిధశాఖల అధికారులతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఆరున్నరగంటలపాటు యాదాద్రిలో పర్యటించారు. మొదట శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బాలాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారి గర్భగుడికి ముఖ్యమంత్రిని తీసుకెళ్లారు. స్వామివారిని దర్శించుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

**అడుగడుగున ఆనందంగా..**

అనంతరం రెండుగంటలపాటు ప్రధానాలయ నిర్మాణప్రాంతంలో ముఖ్యమంత్రి కలియతిరిగారు. గోపురాలు, మాడవీధులు, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజస్తంభం, శివాలయం, క్యూలైన్లు, ప్రసాద వంటశాల, పుష్కరిణి, యాగశాల తదితర నిర్మాణాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అడుగడుగున ఆనందంగా.. నూతన ఉత్సాహంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయంలో ప్రతి ప్రాంతాన్ని కలియతిరిగారు. ఆలయ స్తపతులు, వైటీడీఏ అధికారులను వివరాలు అడుగుతూ ముందుకుసాగారు. శిల్పులతో ముచ్చటిస్తూ.. ఆరా తీస్తూ పరిశీలనచేశారు. యాదాద్రి ప్రధానాలయంలో జరుగుతున్న నిర్మాణాలన్నీ ఆధ్యాత్మికత, ధార్మికత ఉట్టిపడేలా ఉన్నాయని సీఎం సంతృప్తి వ్యక్తంచేశారు. 'ఆలయ నిర్మాణపనులు ఒక డెడ్‌లైన్ పెట్టుకొని చేసేవి కావు. శాశ్వతంగా ఉండాల్సిన నిర్మాణాలు కాబట్టి ప్రతి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భగుడి ఆకారం, ప్రాశస్త్యం చెక్కుచెదరకుండా నిర్మాణాలు సాగాలి. ఏమాత్రం తొందరపాటు అవసరంలేదు. జాగ్రత్త, నాణ్యత పాటించాలి. నిర్మాణాలు పటిష్ఠంగా ఉండాలి. ప్రతిదీ నియమాలను

మిగతా 2వ పేజీలో



మంగళవారం యాదాద్రిలో సీఎం కేసీఆర్‌తో మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్ తదితరులు

# ఆగని పౌరసత్వ రణం



మంగళవారం ఢిల్లీలోని సీలంపూర్‌లో పోలీసులపైకి రాళ్లురువ్వుతున్న ఆందోళనకారులు. (ఇన్‌సెట్) బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసు

### మళ్లీ భగ్గుమన్న ఢిల్లీ!

- సీలంపూర్ వద్ద హింసాత్మకంగా మారిన ఆందోళన
- పలు వాహనాలకు నిప్పు.. పోలీస్ బూత్ ధ్వంసం
- పలువురు పోలీస్ సిబ్బందికి గాయాలు
- బెంగాల్, అసోంలో శాంతియుత నిరసనలు
- 21న హైదరాబాద్‌లో ఎంఐఎం భారీ బహిరంగసభ

5

**పౌరసత్వ** సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశ రాజధాని మరోసారి భగ్గుమన్నది. ఈశాన్య ఢిల్లీలోని సీలంపూర్ ప్రాంతంలో మంగళవారం భారీ హింసాకాండ చోటుచేసుకుంది. ఆందోళనకారులు పలు బైక్‌లకు నిప్పంటించారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. పోలీస్ బూత్‌ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు నిరసనకారులపై లాఠీచార్జి జరిపారు. బాష్పవాయువు ప్రయోగించారు. ఘర్షణలో పలువురు పోలీస్ సిబ్బంది గాయపడ్డారు. మరోవైపు, అసోంలో 'సామూహిక సత్యాగ్రహం'లో భాగంగా ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్లో శాంతియుత నిరసనలు జరిగాయి. చెన్నై, హైదరాబాద్‌లలో విద్యార్థులు ఆందోళన చేశారు. పౌరసత్వ ఆందోళనలు ఒడిశాకూ విస్తరించాయి. సీఏఏపై వైఖరి తెలియజేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆందోళనకారులు డిమాండ్ చేశారు. కాగా, పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 21న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఎంఐఎం నిర్ణయించింది.

### దమ్ముంటే ప్రతి పాక్ పౌరుడికి భారత పౌరసత్వం ఇవ్వాలి

- జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 మళ్లీ అమలుచేస్తామని చెప్పాలి
- కాంగ్రెస్‌కు ప్రధాని మోదీ సవాలు
- ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం ఇచ్చితీరుతాం: అమిత్‌షా

5

### రాజ్యాంగ పరిరక్షణకు జోక్యం చేసుకోండి

- ప్రజలు అంగీకరించకపోయినా బలవంతంగా చట్టాల అమలు
- మోదీ ప్రభుత్వంపై రాష్ట్రపతి కోవింద్‌కు ప్రతిపక్షాల ఫిర్యాదు
- సీఏఏ వాపసుకు విజ్ఞప్తి

## ఒకటి కాదు.. 9 హత్యలు!

### దిశ హంతకుల దారుణ మారణకాండ!

- హైవేల పక్కనే అన్ని హత్యలు
- నేరాలన్నీ ఒకే తరహాలో
- దిశ కేసు దర్యాప్తులో వెలుగుచూస్తున్న కొత్తకోణాలు
- నిందితుల డీఎన్‌ఏతో మిస్టరీ ఛేదించే ప్రయత్నం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దిశ హత్యాచారం కేసులో భయంకరమైన కోణాలు వెలుగుచూస్తున్నాయి. దిశపై కిరాతకంగా లైంగికదాడి జరిపి.. దహనంచేసిన నలుగురు నిందితులు.. ఎదురుకాల్పుల్లో మరణించడానికి ముందు పోలీసుల ఎదుట వెల్లడించిన వివరాలు అధికారులను విస్మయానికి గురిచేశాయి. హంతకుల నేరాల చిట్టా భయం పుట్టిస్తున్నది. వారు చంపింది ఒక దిశను మాత్రమేకాదు.. దిశ మాదిరిగానే మరో తొమ్మిది మందిని హత్యచేసి దహనంచేసినట్లు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. దిశ కేసులో ప్రధాన నిందితుడు ఆరిఫ్ అలీ ఆరు హత్యలు, చెన్నకేశవులు మూడు హత్యలు చేసినట్లు ఒప్పుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ హత్యలన్నీ మహబూబ్‌నగర్, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల్లోని హైవే ప్రాంతాల వద్ద చేసినట్లు నిందితులు అంగీకరించారని తెలిసింది. ప్రతి

మిగతా 6వ పేజీలో



### రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు తెచ్చేందుకు యత్నాలు

- టీఎస్‌ఐపాస్ ద్వారా 11,569 కంపెనీలకు అనుమతులు
- సుమారు ఆరు లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి
- ఐటీ, పరిశ్రమలశాఖల అధికారులతో సమీక్షలో మంత్రి కే తారకరామారావు

# ఉపాధికల్పన లక్ష్యంగా పెట్టుబడులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. టీఎస్ ఐపాస్ ద్వారా ఇప్పటికే 11,569 కంపెనీలకు అనుమతులిచ్చామని, ఇందులో సుమారు 80 శాతం కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయని చెప్పారు. పరిశ్రమలు, ఐటీ శాఖాధికారులతో మంగళవారం ప్రగతిభవన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, పాలసీల కారణంగా గత ఐదేండ్లుగా పెద్దఎత్తున పెట్టుబడులు తరలివచ్చాయని తెలిపారు. సుమారు 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. భవిష్యత్తులోనూ యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పించేందుకు టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ పరిశ్రమకు అనుకూలమైన పరిస్థితులున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రాధాన్యరంగ పరిశ్రమ గుర్తింపు ఇచ్చిందని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. దేశంలోని అతిపెద్ద మెగా టెక్స్‌టైల్ పార్కును వరంగల్‌లో ప్రారంభించామని.. కొరియా దిగ్గజ కంపెనీ యంగ్వాన్ ఇక్కడ భారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. వేలమందికి ఉపాధి కల్పించే ఎలక్ట్రానిక్స్ పరికాల తయారీ రంగం గురించి ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఇటీవల బెంగళూరులో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగ ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని, ఇతర నగరాల్లోనూ మరిన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇప్పటికే వన్ ప్లస్, స్కై వర్త్ వంటి కంపెనీలు

మిగతా 2వ పేజీలో






| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 90.00 | రిటైల్ లైవ్ | 112.00 |
| డ్రెస్‌డ్ | 162.00 | స్కిన్‌లెస్ | 185.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 433.00 | రంగారెడ్డి | 433.00 |
| మెదక్ | 433.00 | కరీంనగర్ | 436.00 |
| వరంగల్ | 436.00 | డజన్ ధర | 65.00 |

## ఏపీకి రాజధానులు మూడు!

### అధికారం, అభివృద్ధి వికేంద్రీకరణే అభిమతం

### అసెంబ్లీలో కీలక ప్రకటన చేసిన ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

**అమరావతి, నమస్తే తెలంగాణ:**

ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం శాసనసభలో కీలక వ్యాఖ్యలుచేశారు. రాజధాని ఒక చోట ఉండాలన్న ఆలోచనాధోరణి మారాలని.. అధికార వికేంద్రీకరణ జరుగాలని అభిప్రాయపడ్డారు. రాజధాని వల్ల భవిష్యత్ తరాలకు మంచి జరిగేవిధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రాజధాని ప్రాంతంలో గత ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు రుజువైందని చెప్పారు. ఏపీలో మూడు రాజధానులు రావాల్సిన అవసరం ఉన్నదన్న సీఎం జగన్.. కర్నూలులో హైకోర్టు పెట్టొచ్చని, అమరావతిని లెజిస్లేటివ్ క్యాపిటల్‌గా, విశాఖపట్టణాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చేయవచ్చని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరుగకపోతే భవిష్యత్ తరాలు నష్టపోతాయని.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి అడుగు ఆలోచించి వేయాలన్నారు. దక్షిణాఫ్రికాలాంటి దేశాలకు మూడు రాజధానులు ఉన్నాయని

మిగతా 6వ పేజీలో



ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా విశాఖ



అమరావతిలో చట్టసభలు



కర్నూలులో హైకోర్టు

# ఎన్‌కౌంటర్ సీఎం!

### యూపీలో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 'తోకో' పాలసీ

గత రెండేండ్ల కాలంలో 3,896 ఎన్‌కౌంటర్లు • 76 మంది నిందితులు హతం

• అబ్ తక్ చెయ్యత్తర్!



**'అగర్** అపరాధ్ కరేంగేతో తోక్ దియే జాయేంగే (ఎవరైనా నేరానికి పాల్పడితే, వాళ్లు హతమవుతారు)', 'బుల్లెట్లకు బుల్లెట్లతోనే సమాధానం ఇస్తాం'! ఇది ఎన్‌కౌంటర్లలో ఆరితేరిన పోలీసు అధికారి వార్నింగ్ కాదు! రాగద్వేషాలు.. రక్తపాతాలకు దూరంగా ఉండే ఒక యోగి.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నెల వ్యవధిలోనే చేసిన తీవ్ర హెచ్చరిక! ఆ రాష్ట్రం ఉత్తరప్రదేశ్.. ఆ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్! కరడుగట్టిన నేరస్థుల ఎన్‌కౌంటర్లపై దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. తోకో పాలసీ పేరుతో నేరస్థుల ఏరివేతకు ఏకంగా ఒక విధానాన్నే ఆదిత్యనాథ్ తీసుకురావడం యూపీలో నేరగాళ్లకు డెత్ కౌంటర్‌గా మారింది! మార్చి 2017 నుంచి మే 27, 2019 మధ్య రాష్ట్రంలో అడ్డూఅదుపు లేకుండా సాగిన 3,896 ఎన్‌కౌంటర్లలో ఏకంగా 76 మంది నేరగాళ్లు హతమయ్యారు. మరో 1154 మంది బుల్లెట్లు దిగి.. కాళ్లు, చేతులు విరిగి.. దవాఖానలకు చేరారు! విశేషం ఏమిటంటే.. ఈ 'డెత్' కౌంటర్ల వివరాలన్నీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినవే!!



5



మంగళవారం యాదాద్రిలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ అనిత రామచంద్రన్, రాచకొండ సీపీ మహేశ్ భగవత్ ఉన్నారు.



సీఎం కేసీఆర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న ఆలయ అర్చకుడు. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్, ఎమ్మెల్యేలు శేఖర్‌రెడ్డి, కిశోర్, ఎమ్మెల్సీలు కృష్ణారెడ్డి, సుభాష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి



యాదాద్రిలో ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్, ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## 22న రాజ్‌భవన్‌లో రాష్ట్రపతికి విందు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణాది రాష్ట్రాల పర్యటన సందర్భంగా హైదరాబాద్‌కు విచ్చేస్తున్న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు ఈ నెల 22 సాయంత్రం ఏడున్నర గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ విందు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ యాప్‌ను రాష్ట్రపతి ఆవిష్కరించనున్నారు. విందు ఏర్పాట్లపై గవర్నర్ మంగళవారం అధికారులతో సమీక్షించారు. భద్రతా ఏర్పాట్లతోపాటు అతిథ్యానికి సంబంధించిన అన్ని అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, ప్రొటోకాల్ అదనపు కార్యదర్శి అరవిందర్‌సింగ్, జాయింట్ సెక్రటరీ జె భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జీఎస్టీ కౌన్సిల్ భేటీ

- రాష్ట్రం తరఫున మంత్రి హరీశ్‌రావు హాజరు
- ఇప్పటికే ఢిల్లీకి చేరిన తెలంగాణ ఆర్థిక మంత్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలో బుధవారం జరుగనున్న జీఎస్టీ కౌన్సిల్ 38వ సమావేశానికి రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ హాజరుకానున్నారు. మంగళవారం అధికారుల సమావేశానికి సోమేశ్‌కుమార్, రాష్ట్ర వాణిజ్య పన్నుల విభాగం అదనపు కమిషనర్ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. బుధవారం జరిగే సమావేశంలో తెలంగాణకు జీఎస్టీలో రావాల్సిన నష్టపరిహారాన్ని, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ నిధుల మళ్లింపు అంశాన్ని మంత్రి హరీశ్‌రావు లేవనెత్తనున్నారు. జీఎస్టీ నష్టపరిహారం కింద తెలంగాణకు కేంద్రం రూ.1030 కోట్లను విడుదలచేసి, మరో రెండునెలల బకాయి 800 కోట్లు పెండింగ్‌లో ఉంచింది. ఐజీఎస్టీ కింద మళ్లించిన రూ.2,800 కోట్లను వెంటనే విడుదలచేయాలని కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేయనున్నారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.43 గంటలకు

సూర్యాస్తమయం: 5.37 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం సప్తమి రాత్రి 11.31 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: పుబ్బ గురువారం అర్ధరాత్రి 12.01 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: సాయంత్రం 6.00 నుంచి 7.30 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.10 నుంచి 1.31 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.48 నుంచి మధ్యాహ్నం 12.32 వరకు, వర్జ్యం: ఉదయం 8.58 నుంచి 10.28 వరకు.

### లోకం పోకడ




ఈ చలికాలంలో భగభగమంటున్న ఉష్ణోగ్రతల వివరాలు తెలుసుకుందాం!

# దివ్యక్షేత్రంగా యాదాద్రి

మొదటిపేజీ తరువాయి...

అనుసరించి సాగాలి. ఇది సనాతన ఆలయం. ఇక్కడ పూజలుచేయడం చాలామందికి వారసత్వంగా వస్తున్న సంప్రదాయం. దేశవిదేశాల్లో లక్ష్మీనరసింహస్వామికి భక్తులు ఉన్నారు. రాబోయేకాలంలో యాదాద్రికి లక్షలమంది భక్తులు తరలివస్తారు. ఆ భక్తులకు దైవదర్శనం, వసతిసౌకర్యం, పుణ్యస్నానాలు, తలనీలాల సమర్పణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడమే లక్ష్యంకావాలి' అని సీఎం అన్నారు. జరుగుతున్న పనుల నాణ్యత విషయంలో సంతృప్తి వ్యక్తంచేశారు.

### శిల్పుల కష్టం ఫలించింది

రాతిశిలలను అద్భుత కళాఖండాలుగా మలిచారని, ఆలయ ప్రాంగణమంతా దేవతామూర్తుల విగ్రహాలతో నిండే విధంగా రూపకల్పన చేశారని శిల్పులను సీఎం కేసీఆర్ అభినందించారు. 560 మంది శిల్పులు నాలుగేండ్లుగా పడుతున్న కష్టం ఫలించి, అద్భుత ఆకారాలతో కూడిన ప్రాకారాలు సిద్ధమయ్యాయని అన్నారు. వందకు వందశాతం శిలలనే ఉపయోగించి దేవాలయాన్ని తీర్చిదిద్దడం యాదాద్రిలోనే సాధ్యమైందని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా, ఆహ్లాదం పంచేలా ఉద్యానవనాలు పెంచాలని సీఎం సూచించారు. ఆలయ ప్రాంగణంలో దేవాలయ ప్రాశస్త్యం, లక్ష్మీనరసింహస్వామి చరిత్ర, స్థలపురాణం ప్రస్ఫుటించేలా తైలవర్ణ చిత్రాలను వేయించాలని ఆదేశించారు. అనంతరం యాదాద్రిలో జరుగుతున్న రింగురోడ్డు పనులను సీఎం పరిశీలించారు. సకల సౌకర్యాలతో కూడిన 15 వీవీఐపీ కాటేజీలతో నిర్మిస్తున్న ప్రెసిడెన్షియల్ సూట్‌ను పరిశీలించి, కొన్ని మార్పులను సూచించారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి తదితర ముఖ్యులు వచ్చినప్పటికీ వారికి సౌకర్యవంతంగా ఉండేలా ప్రెసిడెన్షియల్ సూట్ రూపుదిద్దుకోవాలని చెప్పారు.



యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### మైలార్‌గూడెం చెరువును సుందరీకరించాలి

బస్వాపురం రిజర్వాయర్‌ను పర్యాటకప్రాంతంగా మారుస్తున్న విధంగానే ప్రెసిడెన్షియల్‌సూట్‌కు ఎదురుగా ఉన్న మైలార్‌గూడెం చెరువును సుందరీకరించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రధాన దేవాలయంలో ఉండే గుట్ట నుంచి రింగురోడ్డు మధ్యభాగంలో గతంలో అనుకున్న ప్రకారం నిర్మాణాలన్నీ సాగాలన్నారు. గండిచెరువులో కోనేరు నిర్మాణపనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. 6.30 గంటలవరకు అధికారులతో సమీక్షించిన సీఎం.. హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఈ పర్యటనలో మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, వివేకానంద, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, ఎలిమినేటి కృష్ణారెడ్డి, శంభీపూర్ రాజు, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, వైటీడీఏ స్పెషల్ ఆఫీసర్ జీ కిషన్‌రావు, కలెక్టర్ అనితారామచంద్రన్, ఆలయ ఈవో గీత, ఆలయ నిర్మాణ శిల్పి ఆనందసాయి, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ప్రధాన స్థపతి డాక్టర్ ఆనందాచారి వేలు, సుధాకర్‌తేజ, రాచకొండ సీపీ మహేశ్‌భగవత్, రాచకొండ డీసీపీ కే నారాయణరెడ్డి, ఏసీపీ కోట్ల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉల్లాసంగా పరిశీలనలు

అద్భుత పుణ్యక్షేత్రంగా యాదాద్రిని తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్న సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఆరున్నరగంటలపాటు ఆలయ పునరుద్ధరణ పనులను ఉత్సాహంగా, ఉల్లాసంతో పరిశీలించారు. ప్రధానాలయంలో బలిపీఠం, ధ్వజస్తంభాలను క్షుణ్నంగా పరిశీలించారు. ఆర్కిటెక్ట్ ఆనందసాయి, ఆలయ ఈవో గీత పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని పనులు పూర్తికావడానికి రెండునెలల సమయం పడుతుందని అధికారులు సీఎంకు నివేదించారు. భక్తులకు దర్శనం కలిగించడం ఎంత ముఖ్యమైన విషయమో.. వారికి వసతులు కల్పించడం కూడా అంతే ముఖ్యమని సీఎం అన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించతలపెట్టిన సుదర్శన నారసింహయాగం సమయానికి వసతులు, నిర్మాణాలు పూర్తవుతాయా? అని సీఎం ఆరాతీశారు. కొండపై దక్షిణగోపురం, వాహనశాల, సహస్రదీపాలంకరణ నిర్మాణాలను సీఎం పరిశీలించారు. దక్షిణభాగంలో కొండను ఆనుకుని చేపట్టిన ల్యాండ్‌స్కేపింగ్‌ను ఇంకా సుందరంగా తీర్చిదిద్దాలని ఆనందసాయిని ఆదేశించారు. అర్చకులను ప్రత్యేకంగా పిలిపించుకున్న సీఎం నూతన ఆలయం ఎలా ఉన్నది? భక్తులకు అనుకూలమైన వసతులు ఉన్నాయా? అంటూ వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రధానార్చకులు నల్లంతీగల్ లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు సీఎంతో పలు విషయాలను చర్చించారు. ఆలయ క్యూలైన్లు ఎలా ఉండాలనే విషయమై రూపొందించిన త్రీడీ నమూనాలను ఆర్కిటెక్ట్ ఆనందసాయి సీఎంకు సమర్పించారు. మధ్యాహ్నం రెండు గంటలకు భోజన విరామం తీసుకున్న సీఎం.. మూడు గంటలకు కొండ కింద ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణాలను పరిశీలించారు. యాదగిరిపల్లి వద్ద గల కుంట కట్టపైకి ఎక్కిన సీఎం నీళ్ల లోతు ఎంతవరకు ఉంటుంది? ఎక్కడి నుంచి ఇవి వస్తాయి? ఎలా ఉపయోగించుకోవాలి? భూగర్భజలాలు పెరుగుతున్న తీరు తదితర విషయాలను నీటిపారుదలశాఖ అధికారులు, ఈవో గీతను అడిగి తెలుసుకున్నారు. మొదటి, రెండో ఘాట్‌రోడ్డు, తులసీవనంలో నిర్మాణాలను, రోడ్డు పనులను పరిశీలించారు.

### శివాలయం పనులు ఎప్పుడు పూర్తవుతాయి?

శివాలయం పనులు ఎప్పుడు పూర్తవుతాయో సీఎం కేసీఆర్ ఆరాతీశారు. ముఖమండపాన్ని, ఉత్తరం వైపు నిర్మిస్తున్న గోడలను పరిశీలించారు. కాకతీయశైలిలో నిర్మాణం జరుపుకొంటున్న శివాలయం ఎన్నోతరాలవరకు ఆదర్శంగా నిలిచేలా ఉన్నదని ప్రశంసించారు. యాదాద్రిని అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దాలని భావిస్తున్న సీఎం కేసీఆర్.. దానికి అనుగుణమైన కార్యాచరణను ఖరారుచేసి దిశానిర్దేశం చేసిన తీరు తమలోని నిర్లక్ష్యాన్ని తరిమేసేంత స్ఫూర్తిని ఇచ్చిందని సమీక్షలో పాల్గొన్న పలువురు అధికారులు వ్యాఖ్యానించారు.

### నాణ్యత, నవ్యతల మేలు కలయికగా..

ఆలయ విస్తరణ పనులు నాణ్యత, నవ్యతల మేలు కలయికగా జరగాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం చెప్పారు. మండపాలు, గోపురాలు, పురవీధుల పనులు అద్భుతంగా ఉన్నాయన్నారు. గాలిగోపురం పూర్తిగా శిలలతోనే నిర్మిస్తున్నామని, శివాలయం, గర్భాలయం, మండపాల నిర్మాణంతోపాటు అన్నింటికీ కృష్ణశిలలను వాడుతున్నామని చెప్పారు. ఉత్తరభాగంలో ఆలయ కిందవైపు 30 ఎకరాలు గండి చెరువు కింద ఉన్నదని, ఈ చెరువును స్వామివారి తెప్పోత్సవానికి ఉపయోగిస్తామని వెల్లడించారు. కాళేశ్వరం నుంచి యాదాద్రి కొండ కింద యాదగిరిపల్లిలో ఉన్న గండిచెరువులోకి స్వచ్ఛమైన నీళ్లు వస్తాయని చెప్పారు. చెరువుల చుట్టు చెట్లు, లైట్లతోపాటు రోడ్డుతో అందంగా తీర్చిదిద్దుతామని వివరించారు. మైసూర్ బృందావన్ గార్డెన్‌లాగా తీర్చిదిద్దబోతున్న బస్వాపూర్ చెరువు ప్రాంతంలో అధునాతన హరిత రెస్టారెంట్, కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని సీఎం చెప్పారు.

### రింగ్‌రోడ్డు పనుల పరిశీలన

యాదాద్రి కొండచుట్టూ సుమారు రూ.142 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న రింగ్‌రోడ్డు పనులను, రింగ్‌రోడ్డులో భాగంగా ఏర్పాటుచేయనున్న సర్కిళ్లు, సర్కిల్ పార్కులను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలించారు. 143 ఎకరాల్లో భక్తులకు నిత్యాన్నదాన సత్రం, బస్‌స్టేషన్, వాహన పార్కింగ్, మార్కెట్, క్యూకాంప్లెక్స్ వంటివి నిర్మిస్తామని చెప్పారు. ఇందుకు విరాళాలు ఇచ్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మిగిలిన భూమిలో 50 నుంచి 60 ఎకరాల్లో ప్రవచన మండపాలు నిర్మిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో కొండపైన కల్యాణోత్సవానికి స్థలం సరిపోకపోతే కింద నిర్వహించే ప్రవచన మండపాలు ఉపయోగిస్తామని చెప్పారు. త్వరలోనే డిజైన్ పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

### నేడు ప్రగతిభవన్‌లో సమావేశం

**యాదాద్రిలో** పర్యటన సందర్భంగా పరిశీలించిన అంశాలపై బుధవారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి వైటీడీఏ అధికారులు, ఆలయ ఈవో, ప్రత్యేక కార్యదర్శులు హాజరుకానున్నట్టు వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు వెల్లడించారు.



యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖద్వారం | ఫొటో: ఎంపీ జే సంతోష్‌కుమార్



టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడాది పూర్తిచేసుకున్న కేటీఆర్‌కు మంగళవారం అభినందనలు తెలియజేస్తున్న రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, రాష్ట్ర రైతు సమన్వయసమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, మాలోతు కవిత, మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి

## కలిసి పరిష్కరించుకున్నారు!

అగ్నిమాపకశాఖ శిక్షణకేంద్రం ఉద్యోగుల విభజన పూర్తి

తెలంగాణకు 21, ఏపీకి 29 పోస్టులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండు రాష్ట్రాల అధికారుల అంగీకారంమేరకు అగ్నిమాపకశాఖ శిక్షణకేంద్రంలో ఉద్యోగుల విభజన పూర్తయింది. పదోషెడ్యూల్ సంస్థల జాబితాలో ఉన్న రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని అగ్నిమాపకశాఖ శిక్షణకేంద్రంలో 50మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాష్ట్ర విభజన నాటి నుంచి ఏపీ అధికారవర్గాలు విభజనను అడ్డుకోవడంతో సీనియార్టీ జాబితా, పదోన్నతుల కల్పనకు తీవ్ర అడ్డంకి ఏర్పడింది. ఇటీవల రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఇటీవల సమావేశమై ఉద్యోగులు విభజనపై నిర్ణయం తీసుకున్నారు. ఇందులో ఆయా క్యాటగిరిల అధికారులు, ఉద్యోగులు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారంగా విభజించినట్టు తెలిసింది. తెలంగాణకు 21మందిని, ఏపీ 29మందిని కేటాయించారు. ఈ మేరకు అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ ఏపీ ప్రభుత్వానికి డిసెంబర్ పదిన లేఖరాశారు.

**ఉద్యోగుల విభజన పట్టిక**

| పోస్టు | మొత్తం | ఏపీ | తెలంగాణ |
|---|---|---|---|
| డైరెక్టర్ | 1 | 0 | 1 |
| డిప్యూటీ డైరెక్టర్ (రీజినల్ ఫైర్ ఆఫీసర్) | 1 | 1 | 0 |
| సివిల్ అసిస్టెంట్ సర్జన్ | 1 | 1 | 0 |
| అసిస్టెంట్ డైరెక్టర్ (డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్) | 5 | 0 | 5 |
| సీనియర్ డెమానిస్ట్రేటర్ | 3 | 3 | 0 |
| జూనియర్ డెమానిస్ట్రేటర్ | 12 | 7 | 5 |
| స్టోర్‌కీపర్ | 5 | 3 | 2 |
| డ్రైవర్ ఆపరేటర్ | 6 | 4 | 2 |
| ఫైర్‌మెన్ | 6 | 4 | 2 |
| లైబ్రరీ/ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ | 1 | 1 | 0 |
| స్టాఫ్ నర్సులు | 2 | 1 | 1 |
| సూపరింటెండెంట్ | 1 | 0 | 1 |
| సీనియర్ అసిస్టెంట్ | 1 | 1 | 0 |
| జూనియర్ అసిస్టెంట్ | 3 | 2 | 1 |
| జూనియర్ స్టెనో | 1 | 1 | 0 |
| టైపిస్ట్ | 1 | 0 | 1 |
| **మొత్తం** | **50** | **29** | **21** |

## మంత్రి కేటీఆర్‌కు అభినందనల వెల్లువ

### టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడాది పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాదికాలం పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావుకు మంగళవారం పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎస్సీ అభివృద్ధి, మైనార్టీశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీలు మాలోతు కవిత, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చల్లాధర్మారెడ్డి, రాథోడ్ బాపూరావు, రేఖానాయక్, నన్నపనేని నరేందర్, డాక్టర్ ఆనంద్, క్రాంతి కుమార్, సోలిపేట రామలింగారెడ్డి, మాగంటి గోపీనాథ్, జీవన్‌రెడ్డి, సుంకర రవికుమార్, చెన్నమనేని రమేశ్, ఆరూరి రమేశ్, పైలట్ రోహిత్‌రెడ్డి, మాజీమంత్రులు జూపల్లి కృష్ణారావు, జోగు రామన్న, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు మంత్రి కేటీఆర్‌కు మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా నడుస్తూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతున్నారని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ అభినందనలు తెలిపారు. ఏడాదికాలంలోనే కేటీఆర్ నేతృత్వంలో పార్టీ అనేక విజయాలు సాధించిందన్నా రు. పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ఆయన ఎంతో కృషిచేశారని కొనియాడారు. కేటీఆర్ నేతృత్వంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కేటీఆర్ నేతృత్వంలో టీఆర్‌ఎస్ పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదిగిందని, దేశానికి దిశా నిర్దేశం చేసే విధానంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌చెప్పారు. తెలంగాణ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### యాదాద్రిలో ప్రత్యేక పూజలు

**పేట్‌బషీరాబాద్:** మంత్రి కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ తదితరులు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి కేటీఆర్‌ను కలిసి తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఉపాధికల్పన లక్ష్యంగా పెట్టుబడులు

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని చెప్పారు.

#### గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయరంగానికి ప్రాధాన్యమిస్తుండటంతో వ్యవసాయ ఉత్పత్తులు మరింత పెరిగే అవకాశం ఉన్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలోని పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించామన్నారు. ఈ రంగంలో పెట్టుబడుల ద్వారా వ్యవసాయరంగానికి భరోసాతోపాటు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ మూడురంగాల్లో నూతనంగా దేశంలోకి వచ్చే అంతర్జాతీయ కంపెనీలు, విస్తరణకు సిద్ధంగా ఉన్న దేశీయ కంపెనీలను లక్ష్యంగా చేసుకుని పెట్టుబడుల ఆకర్షణ కార్యక్రమాన్ని చేపట్టాలని పరిశ్రమలు, ఐటీ శాఖల డైరెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో ఆయారంగాల కోసం అందుబాటులో ఉన్న ల్యాండ్‌బ్యాంక్, ఇండస్ట్రియల్ పార్కుల వివరాలతో కూడిన సమగ్ర సమాచారాన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారి కోసం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీంతోపాటు ఇక్కడ కార్యకలాపాలకు సిద్ధమవుతున్న కంపెనీలకు అవసరమైన రీతిలో టాస్క్ వంటి సంస్థలతో శిక్షణనివ్వాలని సూచించారు. సమావేశంలో టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనరసింహారెడ్డి, ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భగవదనుగ్రహంతోనే భక్తి

భాగవత సప్తాహంలో
బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

**కవాడిగూడ:** భగవంతుని అనుగ్రహం ఉన్నవారికి భక్తి ప్రాప్తిస్తుందని, ఒకరు చెబితే వచ్చేది కాదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. భక్తిలేకపోతే ఎన్ని ఉన్నా ఆ జీవితం వ్యర్థమేనని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న భాగవత సప్తాహంలో నాలుగోరోజు మంగళవారం తన ప్రవచనామృతధారతో శ్రోతలను భక్తి పారవశ్యంలో ఓలలాడించారు. వామనమూర్తి, బలిచక్రవర్తి ఘట్టాలను, నృసింహమూర్తి వైభవాన్ని, ప్రహ్లాదుని భక్తిని వివరించారు. వేదాలు, తపస్సు, గోవు, యజ్ఞం, నిష్ఠ, ధర్మం, శ్రద్ధ, కాంతి ఉండేచోట విష్ణువు కొలువై ఉంటాడని, నిజమైన భక్తి, ప్రేమ, ధర్మ నిష్ఠ ఆచరించేవారిని భగవంతుడు కాపాడుతారని చెప్పారు. మనిషి చేసుకున్న పుణ్యాన్నిబట్టే పునర్జన్మను పొందుతారన్నారు. కార్యక్రమంలో సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీఎంపీ కల్వకుంట్ల కవిత, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ, సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు, బంధువులు, తెలంగాణ జాగృతి నాయకురాలు వరలక్ష్మి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను వింటున్న సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ, కుటుంబసభ్యులు



# ఇతర కమిషన్లకు దిక్సూచి టీఎస్‌పీఎస్సీ

- 13 పీఎస్సీల్లో మన విధానాల అమలు
- పరిమిత వనరులతో అద్భుతాలు సృష్టించాం
- ఐదేండ్ల వ్యవధిలో 30 వేల పోస్టుల భర్తీ
- ఉమ్మడి ఏపీ చివరి పదేండ్లలో 24 వేలే
- ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే గ్రూప్ 1, గ్రూప్ 3 నోటిఫికేషన్ల విడుదల
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో చైర్మన్ ఘంటా చక్రపాణి
- నేటితో ఐదు వసంతాలు పూర్తిచేసుకుంటున్న టీఎస్‌పీఎస్సీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ, పూర్తి పారదర్శకంగా భర్తీ ప్రక్రియ నిర్వహిస్తూ దేశంలోని ఇతర పీఎస్సీలకు టీఎస్‌పీఎస్సీ దిక్సూచిగా నిలిచిందని కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం ప్రాముఖ్య రంగాలపై ప్రత్యేకంగా దృష్టిసారించిందని, ఈ క్రమంలోనే గతంలో ఎన్నడూ రిక్రూట్‌చేయని పోస్టులను సైతం టీఎస్‌పీఎస్సీ భర్తీచేసిందన్నారు. వివిధ ముఖ్యమైన విభాగాల్లో 30వేల దాకా కొత్త ఉద్యోగులు చేరారని, వీరంతా 35-40 ఏండ్లపాటు తెలంగాణకు సేవలందించనున్నారని చెప్పారు. 'ఉద్యోగం సాధించలేకపోయినందుకు బాధగా ఉన్నా.. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించినందుకు టీఎస్‌పీఎస్సీకి కృతజ్ఞతలు' అని పలువురు అభ్యర్థులు చెప్పడమే తనకు గొప్ప ప్రశంస అన్నారు. బుధవారంతో టీఎస్‌పీఎస్సీ ఐదు వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చైర్మన్ ఘంటా చక్రపాణి 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివిధ అంశాలపై చక్రపాణి ఏమన్నారో ఆయన మాటల్లోనే..

### ఐదేండ్లు ఏటికి ఎదురీదాం..

కొత్త రాష్ట్రం. కొత్త సర్వీస్ కమిషన్.. మా ముందు ఎన్నో సవాళ్లు. ఉద్యోగాల భర్తీ విషయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించి, రాష్ట్రం ఏర్పడ్డ ఆరునెలల్లోనే టీఎస్‌పీఎస్సీని ఏర్పాటుచేశారు. సరైన సిబ్బందిలేరు. ప్రామాణిక సిలబస్‌లేదు. పరిమిత వనరులు. తొలి ఆరునెలలు ఒక కొత్త వ్యవస్థను నిర్మించేందుకు ఎంతో కృషిచేశాం. సమస్యలు ఎదుర్కొన్నాం. సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. అన్ని విభాగాలతో సమన్వయం చేసుకున్నాం. ఎంతో శ్రమించి ఎనిమిదినెలల్లో తొలి నోటిఫికేషన్ జారీచేశాం.

### 50 ఏండ్లకు సరిపోయే సిలబస్

రాష్ట్ర పునర్నిర్మాణంలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సంస్కృతి, ఉద్యమం, భౌగోళిక పరిస్థితుల గురించి తెలియకుంటే వారు పరిపాలనలో ఎలా భాగంకాగలరు? యూపీఎస్సీ సిలబస్‌లో దేశ స్వాతంత్ర్యోద్యమం గురించి ఉంటుంది. అలాగే తెలంగాణ సంస్కృతి, ఉద్యమం గురించి ప్రభుత్వ ఉద్యోగులు కాబోయేవారు తెలుసుకోవాలని సిలబస్‌ను సమూలంగా మార్చాం. కమిటీ ఏర్పాటుచేసి, 50 ఏండ్లకు సరిపోయే సిలబస్ రూపొందించాం.

### ఉద్యోగాల భర్తీలో రికార్డ్

ఇప్పటికి 139 (101 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 38 డిపార్ట్‌మెంటల్) నోటిఫికేషన్లు ఇచ్చాం. ఐదేండ్లలో ఇన్ని నోటిఫికేషన్లు ఇవ్వడం.. 30 వేల ఉద్యోగాలు భర్తీచేయడం రికార్డు. ఉమ్మడి ఏపీలో ఎన్నడూ ఈ తరహా రిక్రూట్‌మెంట్ జరుగలేదు. 2004నుంచి 14 వరకు 23 జిల్లాలవ్యాప్తంగా భర్తీ అయినవి కేవలం 24,086. అందులో చివరి రెండేండ్లలో తెలంగాణ ఉద్యమ తీవ్రత నేపథ్యంలో 11వేల దాకా ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డాక 10 జిల్లాల అభ్యర్థుల కోసం ఐదేండ్లలో 30వేల ఉద్యోగాల భర్తీ జరిగింది. టీఎస్‌పీఎస్సీతోపాటు ఏర్పడ్డ ఏపీపీఎస్సీలో ఐదేండ్లకాలానికి 67 నోటిఫికేషన్లు విడుదల కాగా, 2,575 పోస్టులే భర్తీ అయ్యాయి.

### అవరోధంగా కోర్టు కేసులు

మొత్తం 1,500 కోర్టు కేసులు ఉన్నాయి. వీటిలో ఎంపిక ప్రక్రియను తప్పుపడుతూ ఒక్క కేసు కూడా లేదు. 4207 పోస్టులు కేవలం పారామెడికల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినవి ఉన్నాయి. అసలు జరిగిందేమిటంటే.. కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయంచేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది సర్వీసుకు 1 నుంచి 3 మార్కుల చొప్పున 30 మార్కులకు వరకు వెయిటేజ్ ఇవ్వాలని జీవో వచ్చింది. దాని ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చాం. నిజానికి 30 మార్కులు వచ్చేసరికి క్వాలిఫై మార్కుల దాకా చేరుతున్నది. దీంతో దాదాపు ఇప్పటికే పనిచేస్తున్నవాళ్లకే ఉద్యోగాలు వస్తున్నాయి. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లారు. హైకోర్టు స్పష్టత ఇస్తే మా ప్రక్రియ చేపడుతాం. గ్రూప్-2పై పడిన ఎన్నో కేసులు అధిగమించి.. భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశాం.

### మారిషస్ నుంచి ఆహ్వానం...

మారిషస్ పబ్లిక్ సర్వీస్ కమిషన్- డిసిప్లిన్డ్ ఫోర్సెస్ కమిషన్ నుంచి ఆహ్వానం అందింది. టీఎస్‌పీఎస్సీలో ఉన్న విధానాన్ని అక్కడా అమలుచేయాలనే ఆలోచనతో ఉన్నారు. జనవరి 6న మారిషస్ వెళ్తున్నాం. డిజిటలైజేషన్, డాటాబేస్, సిలబస్ రూపకల్పన తదితరాలపై వారికి వివరించబోతున్నాం.

### పకడ్బందీగా ఇంటర్వ్యూలు

చరిత్రలోనే తొలిసారి 1032 గ్రూప్-2 పోస్టులను భర్తీచేశాం. పకడ్బందీగా ప్రక్రియ ముగించాం. దేశంలో ఎవరూ నిర్వహించని విధంగా, అద్భుతమైన టెక్నాలజీతో ఇంటర్వ్యూలను పూర్తిచేశాం. కొద్దినిమిషాల్లోనే అభ్యర్థిని పూర్తిస్థాయిలో అంచనావేసేలా చూశాం. ఇంటర్వ్యూ చేసేవారికి సైతం అభ్యర్థి పేరు, ఊరు, హాల్ టికెట్ నంబర్, ప్రాంతం తెలియకుండా నిర్వహించాం. అంత పక్కాగా చేశాం కాబట్టే ఈరోజు ప్రతి ఒక్కరూ టీఎస్‌పీఎస్సీని ప్రశంసిస్తున్నారు.



### సమిష్టి కృషితోనే సాధ్యమైంది

ఐదేండ్లు ఒడిదొడుకులు లేకుండా భర్తీప్రక్రియ చేపట్టడంలో ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. నియమించే సమయంలోనే నిజాయితీగా పనిచేయాలని, ప్రభుత్వంనుంచి ఒత్తిడి ఉండబోదని సీఎం కేసీఆర్ చెప్పారు. అన్నట్టే జరిగింది. కమిషన్ విజయవంతం కావడంలో రిటైర్డ్ ఉన్నతాధికారులు తడకమల్ల వివేక్, కృష్ణారెడ్డి, ఉద్యోగసంఘాల నేత విఠల్, తెలంగాణపై అవగాహన ఉన్న మంగారి రాజేందర్, న్యాయకోవిదులు విద్యాసాగర్‌రావు, వైద్యురాలు చంద్రావతి, మన్మథరెడ్డి, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎం ఖాద్రీ, ప్రొఫెసర్ సాయి కృషి ఉన్నది. మొదటికార్యదర్శి పార్వతి సుబ్రమణ్యం, ప్రస్తుతకార్యదర్శి వాణీప్రసాద్ ఎంతో కృషి చేశారు. ఉద్యోగులు, సిబ్బందితోపాటు అందరికీ అభినందనలు. ఐటీ వినియోగంలో మంత్రి కేటీఆర్ మద్దతువల్లే ఇన్ని సంస్కరణలు సాధ్యమయ్యాయి. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

### టెక్నాలజీ వినియోగంలో టాప్..

టీఎస్‌పీఎస్సీ దేశంలోనే నూతన టెక్నాలజీని విరివిగా వినియోగిస్తున్నది. దేశంలోని 13 టీఎస్‌పీఎస్సీల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి, మన పనితీరు చూసి ప్రశంసించారు. భారత్ రిక్రూట్‌మెంట్ దశను టీఎస్‌పీఎస్సీ మార్చేసింది. ఆన్‌లైన్ వ్యవస్థలను దేశం మొత్తం మీద టీఎస్‌పీఎస్సీయే తీసుకొచ్చింది. డిజిటల్ పేమెంట్స్ కాన్సెప్ట్‌కు ఏడాదిన్నర ముందే టీఎస్‌పీఎస్సీ ప్లాట్‌ఫామ్స్ సిద్ధంచేసింది. టీఎస్‌పీఎస్సీలో అంతా కాగితం రహితమే. తొలిరోజు నుంచే ఆన్‌లైన్ అప్లికేషన్స్ మొదలుపెట్టాం. 700 వీఆర్వో పోస్టులకు 11 లక్షలమంది దరఖాస్తు చేస్తే.. సాంకేతిక సాయంతో నాలుగైదు నెలల్లోనే భర్తీ ప్రక్రియ పూర్తిచేశాం. 2015లోనే ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభించాం. మావద్ద 25 లక్షలమంది నిరుద్యోగుల వివరాలు ఉన్నాయి. ఫిర్యాదులను తీసుకోవటంలో, పరిష్కరించడంలో టెక్నాలజీని వినియోగిస్తున్నాం.

### సమైక్య రాష్ట్రంలో చివరి పదేండ్ల నోటిఫికేషన్లు (2004-14)

| | | | |
|---|---|---|---|
| 2004-05 | 1,677 | 2010-11 | 1,442 |
| 2005-06 | 145 | 2011-12 | 2,436 |
| 2006-07 | 876 | 2012-13 | 6,139 |
| 2007-08 | 2,843 | 2013-14 | 5,598 |
| 2008-09 | 1,756 | మొత్తం | 24,086 |
| 2009-10 | 1,174 | | |

### తెలంగాణ ఏర్పాటయ్యాక వచ్చిన నోటిఫికేషన్లు..

| సంవత్సరం | నోటిఫికేషన్లు | పోస్టులు |
|---|---|---|
| 2015 | 13 | 3,553 |
| 2016 | 12 | 2,379 |
| 2017 | 51 | 26,443 |
| 2018 | 25 | 4,226 |
| 2019 | 0 | 1 |
| మొత్తం | 101 | 36,602 |

### టీఎస్‌పీఎస్సీ అంటే ఓ నమ్మకం..

కొత్త పీఎస్సీ వచ్చేవరకు ఎన్నో అపోహలుండేవి. నేరుగా కమిషన్ సభ్యుల మీద రైడ్స్ జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఉద్యోగాల భర్తీల్లోనూ పారదర్శకతలేదని ఆరోపణలు వచ్చేవి. కానీ టీఎస్‌పీఎస్సీ పూర్తిస్థాయిలో పారదర్శకత పాటించింది. ఏ ఒక్కనాడూ పనితీరుపై ఆరోపణలు రాలేదు. అందుకే దేశంలోనే ఇతర పీఎస్సీలకు ఆదర్శంగా నిలిచాం. ఉద్యోగాల భర్తీ ఒక ఎత్తు అయితే, అవినీతి ఆరోపణలు రాకుండా ఐదేండ్ల ప్రయాణం సాగటం గర్వకారణం.

### గ్రూప్-1, గ్రూప్-3 నోటిఫికేషన్లు

నూతన జోనల్ విధానం కింద పునర్వ్యవస్థీకరించి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే గ్రూప్-1, గ్రూప్-3 నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఇప్పటివరకు మా వద్ద ఉన్న అన్ని పోస్టుల భర్తీప్రక్రియ దాదాపు ముగిసింది. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, పీవీ నర్సింహారావు యూనివర్సిటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగాలకు ఈ వారంలో నోటిషికేషన్ విడుదల చేయబోతున్నాం.

### ఏడాదిపాటు సెలవు పొడిగింపు

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా (మరో ఏడాది) విధులు కొనసాగించేందుకు వీలుగా చైర్మన్ ఘంటా చక్రపాణికి బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ నుంచి ఏడాదిపాటు లీవ్ ఎక్స్‌టెన్షన్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఉత్వర్వులు అందినట్టు చక్రపాణి తెలిపారు.

## టీఎస్‌పీఎస్సీలో ఎఫ్‌బీవో అభ్యర్థుల వివరాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లోకల్ ఏజెన్సీ స్టేటస్ విషయంలో జిల్లా కలెక్టర్ల నుంచి క్లియరెన్స్ రావటంతో ఆయా రిజర్వేషన్లకు చెందిన 10 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అభ్యర్థుల వివరాలు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కోసం అటవీ విభాగానికి పంపామని టీఎస్‌పీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నది.



హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ కూడా ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

వ్యవసాయ, విద్యారంగాలపై అధికారులతో సమీక్షించిన మంత్రి హరీశ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సత్వరమే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అధికారులను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గణాంకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో విద్య, వ్యవసాయ రంగాల్లో తీసుకోవాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రైతులకు సలహాలిచ్చే విషయంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారుల సేవలపై చర్చించారు. ప్రణాళికశాఖతో సీఈఐఎస్ సంస్థతో కుదిరిన ఒప్పందంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో నీతిఆయోగ్ సలహాదారు మురళీధరన్ కార్తికేయన్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గణాంకశాఖ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, ప్రణాళికశాఖ డైరెక్టర్ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల లెక్కలు తీస్తాం

- బడంగ్‌పేట తాసిల్దార్ డీ శ్రీనివాస్‌రెడ్డి
- 'కబ్జాలకు చెక్' కథనానికి స్పందన

**బడంగ్‌పేట:** ప్రభుత్వ భూముల లెక్కలు తీసి అన్యాక్రాంతమైన భూమిని చట్టప్రకారం వెనక్కి తీసుకుంటామని బడంగ్‌పేట తాసిల్దార్ డీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'కబ్జాలకు చెక్' అన్న శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. అల్మాస్‌గూడలోని సర్వే నంబర్ 84, 85, 86లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సరిహద్దులను గుర్తించి బోర్డులను ఏర్పాటుచేయిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ హరీశ్‌కుమార్ ఆదేశానుసారం ఆర్డీవో రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నామని చెప్పారు. రికార్డుల మేరకు భూమి ఎంత ఉన్నదో సర్వేచేసి అన్యాక్రాంతమైన భూమిని చట్టప్రకారం వెనక్కి తీసుకుంటామని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలనుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దశలవారీగా ప్రభుత్వ భూముల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేస్తామని.. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశామని వెల్లడించారు. రెవెన్యూ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను సర్వే నంబర్ల ప్రకారం పూర్తి నివేదిక తయారుచేయాలని సూచించామని తెలిపారు. ఈ నివేదికను పై అధికారులకు పంపిస్తామని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.



అల్మాస్‌గూడలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తాసిల్దార్ డీ శ్రీనివాస్‌రెడ్డి

## ఆయిల్ పాంపై అవగాహన యాత్ర

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తోటలను సందర్శించిన చెన్నూర్ రైతులు
- ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో పర్యటన



మంగళవారం అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్ తయారీని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బాల్కసుమన్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వెంకటేశ్ నేతకాని తదితరులు

**హైదరాబాద్/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం, నిర్మల్ జిల్లాకు చెందిన 1,268 మంది రైతులు పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో 35 బస్సుల్లో కొత్తగూడెం జిల్లాలోని పామాయిల్ తోటలను సందర్శించారు. దమ్మపేట మండలంలోని గురవాయిగూడెం, దమ్మపేట తదితర ప్రాంతాల్లో ఆయిల్‌పాం సాగును పరిశీలించారు. అనంతరం అశ్వారావుపేటలోని పామాయిల్ కర్మాగారాన్ని సందర్శించి పామాయిల్ తీసే విధానాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావుపేట పామాయిల్ కర్మాగారంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో బాల్క సుమన్ మాట్లాడుతూ.. రైతులు మూసపద్ధతిలో వరి, పత్తి, మిర్చి, వేరుశనగ వంటి పంటలనే సాగుచేస్తున్నారని.. వారికి పంటమార్పిడి విధానాన్ని తెలియజేసి పామాయిల్ సాగువైపు మరలేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి బీడువారిన భూములను సస్యశ్యామలం చేశారని ఎంపీలు నామా నాగేశ్వరరావు, వెంకటేశ్ నేతకాని, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## సమత నిందితులకు లాయర్ నియామకం

- న్యాయవాదులు ముందుకు రాకపోవడంతో నియమించిన జడ్జి
- రెండోరోజూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు నిందితుల హాజరు
- నేడు కొనసాగనున్న విచారణ



నిందితులను ఆదిలాబాద్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు.. న్యాయవాది రహీం

**ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి:** సమత కేసు విచారణలో మరింత వేగం పుంజుకొనున్నది. ఈ కేసులో నిందితులు షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ ముగ్దుం తరపున వాదించడానికి జడ్జి.. ఓ న్యాయవాదిని నియమించారు. నిందితులను రెండోరోజు మంగళవారం కూడా పోలీసులు ఆదిలాబాద్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో హాజరుపర్చారు. నిందితులు తమ న్యాయవాదిని మంగళవారంలోగా నియమించుకోవాలని కోర్టు సోమవారమే సూచించగా.. వారు రహీం అనే న్యాయవాది పేరును న్యాయమూర్తికి తెలిపారు. సమత కేసు నిందితుల తరపున ఎవరూ వాదించవద్దని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ తీర్మానం చేయడంతో రహీం ఈ కేసు తీసుకొనేందుకు ఒప్పుకోలేదు. అయితే కేసు విచారణలో భాగంగా నిందితుల తరపున వాదించడానికి న్యాయస్థానమే.. రహీంను నియమించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు కేసు వాదించేందుకు ఆయన అంగీకరించారు. స్టేట్ బ్రీఫ్ తరపున తనను నియమించినందుకు పోలీసులు దాఖలుచేసిన చార్జిషీట్‌ను పూర్తిగా చదివాక వాదనలు వినిపిస్తానని రహీం చెప్పారు. కేసు విచారణ బుధవారం కూడా కొనసాగనుండగా, ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. షెడ్యూల్‌లో రోజుకు ఎంత మంది సాక్షులను ప్రవేశపెడుతారనే వివరాలు వెల్లడికానున్నాయి. బందోబస్తు నడుమ నిందితులను కోర్టులో హాజరుపర్చిన పోలీసులు.. అనంతరం ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

## ఝురాసంగంలో 10.8 డిగ్రీలు

- సంగారెడ్డి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- హైదరాబాద్ పరిసరాలను వణికిస్తున్న చలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చలి పంజా విసురుతున్నది. రాజధాని చుట్టూ ఉన్న మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. తెలంగాణలో తూర్పుదిశ నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావం హైదరాబాద్ పరిసరాలపై అధికంగా ఉన్నది. మంగళవారం సంగారెడ్డి జిల్లా ఝురాసంగంలో 10.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్‌లో 11.5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్, జహీరాబాద్, రాయ్‌కోడె, రంగారెడ్డి జిల్లా చందనవెల్లి, ఇబ్రహీంపట్నం, వికారాబాద్ జిల్లా బంట్వారం, యాలాల్, కోటపల్లి తదితర ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువ నమోదవుతుండగా, హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 18.7 డిగ్రీలుగా రికార్డయింది. వచ్చే మూడ్రోజుల వరకు తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు.



టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణిని అభినందిస్తున్న టీజీవో నాయకులు

## ఘంటా చక్రపాణికి టీజీవో అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌పీఎస్సీ ఏర్పాటై ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణికి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) నాయకులు అభినందనలు తెలిపారు. వారు మంగళవారం చక్రపాణిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీజీవో ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ మాట్లాడుతూ.. 36 వేల పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసి 27 వేలమందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. ఘంటాను కలిసినవారిలో టీజీవో నేతలు గండూరి వెంకటేశ్వర్లు, ఎంబీ కృష్ణయాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, సయూదుద్దీన్, పవన్‌గౌడ్, వాజిద్‌ఖాన్, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్ ఉన్నారు.

## ఓటరు నమోదుకు మరో అవకాశం

- 2020 జనవరి 1 నాటికి 18 ఏండ్ల వయసు నిండి ఉండాలి
- వచ్చేనెల 15వ తేదీ వరకు గడువు: ఎన్నికల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకొనేందుకు దేశ ప్రజలకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 2020 జనవరి 1వ తేదీనాటికి 18 ఏండ్ల వయసు నిండిన యువతీయువకులు తమ పేర్లను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించింది. ఇందుకు వచ్చే ఏడాది జనవరి 15వ వరకు గడువిచ్చింది. ఓటర్ జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదులను కూడా స్వీకరించనున్నది. అనంతరం తుది జాబితా ప్రకటించడానికి ఎన్నికల సంఘం ప్రక్రియను వేగవంతం చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితాను అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాలవారీగా ఇప్పటికే ఈసీ విడుదల చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 59 అసెంబ్లీ నియోజకవర్గాలు, 19 జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. గ్రేటర్ పరిధిలోని హై దరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పురుష ఓటర్లు ఎక్కువున్నారు. యువత విద్య, ఉపాధి కోసం వలసలు రావడ మే దీనికి కారణమని విశ్లేషకులు చెప్తున్నారు.






పోలీసులు ఢిల్లీలోని క్యాంపస్‌లోకి వెళ్లి విద్యార్థులపై కాల్పులు జరిపిన తీరు నాకు జలియన్‌వాలా బాగ్ విషాదాన్ని గుర్తుకుతెచ్చింది. విద్యార్థులను భయపెట్టడానికి మనం దేశంలో జలియన్‌వాలాబాగ్ లాంటి పరిస్థితిని సృష్టిస్తున్నామా?

**ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర ముఖ్యమంత్రి**

కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలకు నేను బహిరంగ సవాల్ విసురుతున్నా. ధైర్యం ఉంటే ప్రతి పాకిస్థాన్ పౌరుడికి భారత పౌరసత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వారు బహిరంగంగా ప్రకటించాలి. అప్పుడు దేశం వారికి తగిన మూల్యం చెల్లిస్తుంది. అంతేకాదు వాళ్లకు ధైర్యం ఉంటే రద్దుచేసిన 370 ఆర్టికల్‌ను పునరుద్ధరిస్తామని చెప్పమనండి.

**నరేంద్ర మోదీ, ప్రధాని**



**చరిత్రలో నేడు**



**1271**

తన సామ్రాజ్యం పేరును యువాన్‌గా మార్చిన కుబ్లయి ఖాన్. చైనాలో యువాన్ వంశపాలన ప్రారంభం.

**1621**



విదేశీ వ్యవహారాలు చర్చించకూడదన్న రాజు వాదనకు భిన్నంగా తమ మాట్లాడే హక్కును ధ్రువీకరించుకున్న ఇంగ్లాండ్ పార్లమెంట్.



**1849**

మొదటిసారి టెలిస్కోప్ సహాయంతో చంద్రుని ఫొటో తీసిన విలియం బాండ్.

సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర గల్ఫ్ దేశాలతో పాటు మలేషియా నుంచి కొన్నేండ్లలో వేలాదిమంది కార్మికులు తిరిగివచ్చారు. లెబనాన్, ఒమన్, జోర్డాన్ దేశాల్లో కూడా బంగ్లాదేశ్ కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. విదేశాల్లో పనిచేస్తున్న దాదాపు కోటి మందికిపైగా బంగ్లాదేశీయులు స్వదేశానికి 2018లో 15 బిలియన్ డాలర్లు పంపించారు. కార్మికులను చేర్చుకోవడంలో అక్రమాలను అరికట్టినట్టయితే ఈ ఆదాయం మరింత ఎక్కువవుతుంది. ప్రభుత్వం ఈ విషయాలన్ని పరిగణనలోకి తీసుకొని ఉద్యోగావకాశాలను పెంచుతుందని ఆశిద్దాం.

**ది డైలీ స్టార్**

నేపాల్‌లోని సుంకోషి గ్రామీణ మున్సిపాలిటీలో బస్సు ప్రమాదం వల్ల 15 మంది మరణించారు. గత 28 రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రమాదాల్లో 230 మంది మరణించారు. దక్షిణాసియా దేశాల్లోకెల్లా ప్రమాదాలు నేపాల్‌లోనే ఎక్కువ. కనీసం పదేండ్ల అనుభవం ఉన్న డ్రైవర్లే కొండ ప్రాంతాల్లో వాహనాలను నడుపాలె. రహదారులు బాగా లేకపోవడం, వాహనాల మరమ్మతులు క్రమబద్ధంగా చేయకపోవడం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ప్రయాణికులను ఎక్కువగా ఎక్కించుకోవడం మొదలైన కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ అంశాలపై జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను తగ్గించవచ్చు.

**ది హిమాలయన్ టైమ్స్**



# సమానత్వ భావన

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) పౌరుల అభద్రతకు, ఆగ్రహానికి, ఆందోళనకు కారణమవుతున్నది. పౌరసత్వ సవరణ చట్టానికి నిరసనగా విద్యార్థి, ప్రజాందోళనలు దేశవ్యాప్తంగా మిన్నంటుతున్నాయి. దక్షిణాన కేరళ నుంచి ఉత్తరాన వారణాసి దాకా, పశ్చిమాన ముంబయి నుంచి తూర్పున బెంగాల్ దాకా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన హింస, దహనకాండ ప్రజాస్వామికవాదులను కలవరపెడుతున్నది. ముఖ్యంగా ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయ విద్యార్థులు చేస్తున్న శాంతియుత ఆందోళన హింసాత్మకంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు దహనమయ్యాయి. తమ శాంతియుత ఆందోళనలో అసాంఘికశక్తులు చొరబడి కావాలనే హింసాత్మకంగా మార్చాయని జామియా మిలియా విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళనలను సాకుగా తీసుకున్న పోలీసులు యూనివర్సిటీ లైబ్రరీ, వాష్ రూముల్లోని విద్యార్థులపై కూడా దాడిచేసి దారుణంగా కొట్టారు. అలాగే అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులపై కూడా పోలీసులు దాడిచేశారు. వందలాది మందిని నిర్బంధించారు. శాంతియుత నిరసనోద్యమంపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థిలోకం భగ్గుమంటున్నది. విశ్వవిద్యాలయాలు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నినదిస్తున్నాయి. మరోవైపు పోలీసులు తమ అనుమతి లేకుండానే యూనివర్సిటీలోకి చొరబడి విద్యార్థులపై అకారణంగా దాడిచేశారని జామి యా మిలియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ నజ్మా అక్తర్ ఆరోపించటమే కాదు, విద్యార్థి ఆం దోళనకు బాసటగా నిలువటం గమనార్హం.

**దేశ ప్రజలందరి జీవితాలను ప్రభావితం చేసే ఇలాంటి కీలక చట్టాన్ని తెచ్చేటప్పుడు రాజకీయపక్షాలతో చర్చించి ఏకాభిప్రాయాన్ని కూడగట్టి చట్టం చేస్తే బాగుండేది. గమనించదగినది ఏమంటే ఎన్‌డీఏ మిత్రపక్షాలుగా ఉన్న అస్సాం గణపరిషత్, జేడీయూ లాంటి పార్టీలు కూడా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్తామనడం ప్రభు త్వ ఏకపక్ష విధానానికి అద్దం పడుతున్నది. మరోవైపు అనేక రాష్ట్రాలు కూడా తమ రాష్ట్రాల్లో జాతీ య పౌరపట్టికను, పౌరసత్వ సవరణ చట్టాలను అమలు చేయబోమని ప్రకటించటం కూడా తీవ్రమైనదే.**

దేశంలో మూలమూలనా ఇంతటి ఆందోళనకు కారణమైన పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించటానికి ఎవరి కారణాలు వారికున్నాయి. ఈ పౌరసత్వ సవరణ చట్టం వివక్షాపూరితమైనదని, ముస్లింలను చొరబాటుదారులుగా, దోషులుగా చేస్తున్నదనేది ఒక ఆరోపణ. చట్టం ముందు అందరూ సమానులుగా ఉండాలని కానీ, ఈ చట్టం ముస్లింలను పౌరహక్కునుంచి దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తమవుతున్నది. శ్రీలంక తమిళ శరణార్థులకు పౌరసత్వ సవరణ చట్టంలో చోటు కల్పించలేదని తమిళ ప్రజలు నిరసిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలైతే ఈ చట్టం ద్వారా తమ ప్రత్యేక సాంస్కృతిక, ఆర్థిక జీవనానికి ముప్పు ఏర్పడుతుందని అంటున్నారు. ఈ చట్టం ద్వారా తమ రాష్ట్రాల్లో చొరబాటుదారులకు చట్టపరమైన స్థిరనివాస హక్కును కల్పిస్తున్నారని ఈశాన్య రాష్ట్రాల ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. ఇలా సమాజంలో వివిధ ప్రాంతాల ప్రజలు, సామాజిక సమూహాలు, ముఖ్యంగా విద్యార్థి లోకం ఒక చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టడం అరుదైన విషయం. ఢిల్లీ, లఖ్‌నవూ, ముంబయి, వారణాసి, గువాహటి, కోల్‌కతా, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయాలతో పాటు, హైదరాబాద్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఆందోళన బాట పట్టడం సమస్య తీవ్రతను చెబుతున్నది. సాధారణంగా ఆందోళనలకు దూరంగా ఉండే కాన్పూర్, మద్రాస్, బొంబాయి ఐఐటీ విద్యార్థులతో పాటు, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులు కూడా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించటం గమనించదగినది.

పౌరసత్వ సవరణ చట్టాన్ని రూపొందింటం, చట్టంగా తీసుకురావటంలో బీజేపీ తనదైన మెజారిటీవాద ఎజెండానే నమ్ముకున్నది. ప్రజల సున్నితమైన భావాలను పరిగణనలోకి తీసుకోకుండా సంఖ్యాబలం పైనే ఆధారపడి చట్టాన్ని చేసింది. కొంతమంది ఎంపీలు ప్రతిపాదించిన చిన్నపాటి సవరణలను కూడా కొట్టిపారేశారు. దేశ ప్రజలందరి జీవితాలను ప్రభావితం చేసే ఇలాంటి కీలక చట్టాన్ని తెచ్చేటప్పుడు రాజకీయపక్షాలతో చర్చించి ఏకాభిప్రాయాన్ని కూడగట్టి చట్టం చేస్తే బాగుండేది. గమనించదగినది ఏమంటే ఎన్‌డీఏ మిత్రపక్షాలుగా ఉన్న అస్సాం గణపరిషత్, జేడీయూ లాంటి పార్టీలు కూడా పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్తామనడం ప్రభుత్వ ఏకపక్ష విధానానికి అద్దం పడుతున్నది. మరోవైపు అనేక రాష్ట్రాలు కూడా తమ రాష్ట్రాల్లో జాతీయ పౌరపట్టికను, పౌరసత్వ సవరణ చట్టాలను అమలు చేయబోమని ప్రకటించడం కూడా తీవ్రమైనదే. దేశమంతా ఇంతటి అభద్రత, ఆందోళనతో నిరసనోద్యమాలు చేస్తుంటే, ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని ప్రధాని మోదీ అనటం భావ్యం అనిపించుకోదు. సమస్య తీవ్రతను, ప్రజల మనోభావాలను ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి. చట్టం ముందు అందరూ సమానులే అన్న భావనకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలె. తద్వారా దేశాన్ని ఆందోళనల నుంచి శాంతిబాటన నడిపించాలి.

**జనగళం**

### అప్రమత్తంగా ఉండాలె

చలికాలం మొదలైంది. స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. చికిత్స కంటే నివారణ మేలు. కాబట్టి వైద్యాధికారులు స్థానికసంస్థల అధికారులతో కలిసి ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. స్వైన్‌ఫ్లూ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నది వివరించాలి. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**- ఎ.శ్రీనివాస్, సంగారెడ్డి**

### నిబంధనల ఉల్లంఘన

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వాహనదారులు యథేచ్ఛగా ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. వీళ్లతోనే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా రోడ్లపై నడిచేవాళ్లు భయపడేలా కొందరు వాహనాలు నడుపుతున్నారు. ఇట్లా నిబంధనలు ఉల్లంఘించేవారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరించాలి.

**- ఎస్.అనిత, హైదరాబాద్**

### హాస్యాస్పద వ్యాఖ్యలు

రాష్ట్ర బీజేపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉంటున్నాయి. ఏ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. విభజన చట్టంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను గడిచిన ఆరేండ్లుగా అనేకం ఇప్పటికీ అమల్లోకి రాలేదు. ఈ అంశాలను రాష్ట్ర నేతలు ఎన్నడూ కేంద్రం దృష్టికి తీసుకుపోలేదు. ఎంతసేపు ఊకదంపుడు ఉపన్యాసాలు తప్పా రాష్ట్ర ప్రయోజనాల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయం. సంక్షేమరంగానికి తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్టు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయడం లేదు. అట్లనే రాష్ట్ర రైతాంగానికి, ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా తీర్చే ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదు. కానీ రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం హాస్యాస్పదంగా ఉన్నది.

**- కోట శంకర్, కరీంనగర్**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118


విశ్లేషణ



**సిరాజ్ హుస్సేన్**

# ఉల్లి సంక్షోభం-గుణపాఠాలు

**దేశవ్యాప్తంగా చూస్తే ప్రతి నెల ఉల్లి వినియోగం 15-16 లక్షల టన్నులు ఉంటుంది. ప్రభుత్వం వద్ద ఉండే ఉల్లి నిల్వలు 10 లక్షల టన్నులు దేశంలో ఉల్లి కొరత నుంచి ప్రజలను ఒడ్డున పడేయలేకపోవటం ఆశ్చర్యం. ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజలకు సరఫరా చేసేందుకు ఉన్న ప్రజా సరఫరాల విధానం, ఇతర సరఫరా విధానాల సాయంతో ప్రజల అవసరాలను తీర్చటానికి ప్రయత్నం జరుగలేదు.**

భారతీయ పట్టణ, మధ్యతరగతివర్గానికి 'వాతావరణ మార్పు'తో వచ్చే చేదనుభవాలను రుచి చూపిస్తున్నది. ఎవరికి ఇష్టమున్నా లేకున్నా ఉల్లిగడ్డ కొరత సమస్య రాబోయేరోజుల్లో ప్రజా జీవితం ఎలా ఉండబోతున్నదో తెలియజెప్పుతున్నది. ఈ నేపథ్యంలోంచే గతకొన్ని రోజులుగా ఒక కిలో ఉల్లిధర వంద రూపాయలకు పైగానే ఉంటున్నది. ఈ క్రమంలో ప్రభుత్వం మాత్రం చేష్టలుడిగి తమా షా చూస్తున్నది. ఉల్లి కొరతను తీర్చటానికి ఏ ప్రయత్నమూ చేయటం లేదు. గత వానకాలపు ఉల్లి పంట మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత కూడా దేశవ్యాప్తంగా ఉల్లి కొరత సమస్య తీరటం లేదు.

కేంద్ర వ్యవసాయశాఖ 2019 ఆగస్టు 29 అంచనా ప్రకారం.. దేశ వ్యాప్తంగా 2018-19 సంవత్సరంలో (జూలై నుంచి జూన్ వరకు) 23.28 మిలియన్ టన్నుల ఉల్లి పంట వచ్చింది. ఇది గత సంవత్సరం కన్నా వచ్చిన ఉల్లిపంట 23.26 మిలియన్ టన్నుల కన్నా కొంచెం ఎక్కువగానే ఉన్నది. యాసంగి (ఎండాకాలం) పంట కూడా ఎప్పుడూ వచ్చే పంటలో 65 శాతం దాకా వచ్చింది. ఇదేక్రమంలో దేశంలో అకాల వర్షాలు, అవసరమైన దానికన్నా ఎక్కువ వర్షాల కారణంగా మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, కర్ణాటకలో ఉల్లి పంట తీవ్రంగా నష్టపోయింది. పంట నష్టపోవటమే కాకుండా రైతులు, వ్యాపారుల దగ్గర నిల్వ ఉంచిన ఉల్లిగడ్డ కూడా పెద్దమొత్తంలో పాడైపోయింది. ఈ ప్రభావం వానకాలపు పంటపై కూడా తీవ్రంగా పడింది.

ఇక్కడే మరొక విషయం కూడా గమనంలోకి తీసుకోవాలి. గత కొన్నేండ్లుగా ఉల్లి ఉత్పత్తిలో మెరుగైనస్థితిలోనే దేశం ఉన్నది. దశాబ్దకాలాన్ని తీసుకుంటే ఉల్లి ఉత్పత్తిలో 40 శాతం వృద్ధి ఉన్నది. 2012-13లో 16.81 మిలియన్ టన్నుల ఉల్లి ఉత్పత్తి అయితే, 2018-19 నాటికి అది 23.48 మిలియన్ టన్నులకు చేరుకున్న ది. ఈ క్రమంలోనే మరొకవైపు ఉల్లి రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. ఎందుకంటే ఉల్లి ఉత్పత్తి పెరిగి ధరలు అమాంతం పడిపోవటం మూలంగా ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయి కన్నీటి పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మధ్యప్రదేశ్ ప్రభుత్వం రైతుల నుంచి ఉల్లిని 800 రూపాయలకు క్వింటాల్ చొప్పున కొని అతితక్కువ ధరకే ప్రజలకు అందుబాటులో ఉంచింది. దీంతో ప్రభుత్వానికి 785 కోట్ల రూపాయల నష్టం వచ్చింది. ఇదేక్రమంలో 2019 మార్చి, ఏప్రిల్ నాటికి కూడా దేశంలో ఉల్లి కొరత ఆనవాళ్లు కనిపించలేదు. అదే సమయంలో ఉల్లి పంట తీవ్రంగా నష్టపోయిన అసాధారణ పరిస్థితులేవీ కనిపించలేదు. ఉల్లి పంట ఉత్పత్తి, దిగుబడిలో అసాధారణ పరిస్థితులేవీ లేవు. ఫలితంగా ధరల్లో పెరుగుదల కూడా కనిపించలేదు. ఈ పరిస్థితుల్లోనే ప్రభుత్వం ధరల స్థిరీకరణ ఫండ్ (పీఎస్‌ఎఫ్) కింద 57,372.90 టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. సాధారణ పరిస్థితుల్లో ఈ నిల్వలు ప్రజా అవసరాలకు సరిపోతాయి. ధరలను స్థిరంగా ఉంచుతాయి. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే వానకాలపు ఉల్లి పంట మార్కెట్‌లోకి వచ్చింది. ఈ సమయంలోనే విపరీతమైన వానలతో వ్యాపారులు, ప్రభుత్వం వద్ద నిల్వ ఉంచిన ఉల్లిగడ్డ పెద్ద మొత్తంలో పాడైపోయింది. ఒక అంచనా ప్రకారం.. 30,672 టన్నుల ఉల్లి పనికి రాకుండాపోయింది.

అయితే ఈ ఏడు అతివృష్టి కారణంగా ఉల్లిపంట మాత్రమే నష్టపోలేదు. సోయాబీన్ లాంటి పంటకూడా తీవ్రంగా నష్టపోయింది. సోయాబీన్ సుమారుగా 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఉంటుంది. అయితే గత సంవత్సరాల ఉత్పత్తి 10.3 మిలియన్ టన్నులతో పోలిస్తే, ఈ ఏడు 9 మిలియన్ టన్నుల సోయా పంట వచ్చింది. ఈ పరిస్థితుల్లో అటు ప్రజలు కానీ, ప్రభుత్వం కానీ పెద్దగా గాబరా పడలేదు. ఎందుకంటే సోయానుంచి వచ్చే వంటనూనెల స్థానంలో ఇండోనేషియా, మలేషియా నుంచి తక్కువ ధరకే వచ్చే పామ్ ఆయిల్‌తో ప్రజా అవసరాలను తీర్చారు. కాబట్టి సోయా పంటలో వచ్చిన నష్టం ప్రభావం జన జీవితాలపై ఏ మాత్రం లేదు. అలాగే చెరుకు పంట ఉత్పత్తిలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. గతేడాది చెరుకు పంట 33.16 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది. అది ఈ ఏడాది 2019-20కి వచ్చేటప్పటికీ అది 26.85 మిలియన్ టన్నులకు పడిపోయింది. అయితే ప్రభుత్వం వద్ద ఇప్పటికే చెరుకు ఉత్పత్తి నిల్వలు పుష్కలంగా ఉండటంతో చెరుకు ఉత్పత్తిలో వచ్చిన తరుగుదల ప్రభావం లేకుండా చూశారు. మరోమాటలో చెప్పాలంటే చెరుకు రైతులకు గిట్టుబాటు ధర కూడా రాని పరిస్థితి ఉన్నది. దీంతో చెరుకు రైతులు నష్టపోయిన స్థితి ఏర్పడింది. ఇదే తరహాలో.. తృణ, పప్పుధాన్యాల ఉత్పత్తిలోనూ కనిపిస్తుంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశ వ్యాప్తంగా వానకాలపు పంటలో పప్పుధాన్యాల ఉత్పత్తి 82.3 లక్షల టన్నులు ఉంటుందనుకుంటే అందులో 6 లక్షల టన్నుల ఉత్పత్తి తగ్గుదల కనిపించింది. ఈ తగ్గుదల రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అతివృష్టి కారణంగా ఏర్పడింది. పప్పు, తృణధాన్యాలు పండించిన రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. అయినా దేశవ్యాప్తంగా తృణ, పప్పుధాన్యాల కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడలేదు.

**ప్రస్తుత ఉల్లికొరత దేశంలో ఉన్న సరఫరా వ్యవస్థలు, నిల్వ ఉంచే గిడ్డంగి వ్యవస్థల నైపుణ్యాల లేమిని తెలియజేస్తున్నది. దీన్ని దీర్ఘకాలిక దృష్టితో సమస్య పరిష్కారానికి కృషి జరుగాలి. ఇందులో సహజ, ప్రకృతి నష్టాల కన్నా మానవ ప్రయత్నలోపమే ఎక్కువగా కనిపించటం విషాదం. నైపుణ్యం, సామర్థ్యం విషయంలో మరింతగా శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. పంటల దిగుబడులు, నష్టాలతో తలెత్తి ఎగుడు దిగుళ్లను సమర్థంగా ఎదుర్కోవటానికి గట్టి ప్రయత్నం జరుగాలి.**

కానీ ఉల్లి విషయంలో కొరత సమస్య ఎందుకు తలెత్తింది అనేదే సమస్య. అతివృష్టి కారణంగా పంట, నిల్వల నష్టం జరిగింది వాస్తవమైనా, అది అధిగమించలేనంత పెద్ద విషయం కాదేమో. దేశవ్యాప్తంగా చూస్తే ప్రతి నెల ఉల్లి వినియోగం 15-16 లక్షల టన్నులు ఉంటుంది. ప్రభుత్వం వద్ద ఉండే ఉల్లి నిల్వలు 10 లక్షల టన్నులు దేశంలో ఉల్లి కొరత నుంచి ప్రజలను ఒడ్డున పడేయలేకపోవటం ఆశ్చర్యం. ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజలకు సరఫరా చేసేందుకు ఉన్న ప్రజా సరఫరాల విధానం, ఇతర సరఫరా విధానాల సాయంతో ప్రజల అవసరాలను తీర్చటానికి ప్రయత్నం జరుగలేదు. ప్రభుత్వం దగ్గర అత్యవసర నిల్వల నుంచి ప్రజలకు అందుబాటులోకి తేవటంలో వైఫల్యం కనిపిస్తున్నది. ప్రభుత్వం తలుచుకుంటే ఇంకా ఇతర పంపిణీ వ్యవస్థలను కూడా ఉల్లి పంపకానికి వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఢిల్లీలో మదర్ డైరీ పాల సరఫరా కేంద్రాల ద్వారా కూడా సరఫరా చేయవచ్చు. ఈ విషయంలో ప్రభుత్వం వైపు నుంచి కనీస ప్రయత్నం, నష్ట నివారణ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించటం లేదు.

ఈ సమస్య పరిష్కారానికి ఒకే ఒకటి కనిపిస్తున్నది. యాసంగి పంటలో వచ్చిన నష్టాన్ని పూడ్చటానికి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదు. అలాగే ప్రభుత్వ గిడ్డంగుల్లో 30-40 శాతం నష్టం జరిగిందనుకున్నా, ఆ నష్టాన్ని పూడ్చటానికి ఏ ప్రయత్నం జరుగలేదు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో 25 టన్నుల నిల్వ సామర్థ్యంతో గిడ్డంగులను నిర్మించింది. 2005-06 నుంచి మరో 4.3 లక్షల టన్నుల ఉల్లిని నిల్వచేసే సామర్థ్యం కలిగిన గిడ్డంగులను మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. కానీ మరోవైపు యాసంగి కాలపు ఉల్లి ఉత్పత్తి ఒకటే 15 మిలియన్ టన్నులు ఉంటుంది. మహారాష్ట్ర నుంచే 88 లక్షల టన్నుల ఉల్లి వస్తుంది. కానీ అక్కడ నిల్వ సామర్థ్యం మాత్రం 53,745 టన్నులు మాత్రమే ఉన్నది. ఈ విధమైన పరిస్థితుల్లో పంటలో తీవ్ర నష్టం వచ్చినప్పుడు, అసాధారణ పరిస్థితులు ఏర్పడి ఉల్లి పాడై పోయినప్పుడు పరిస్థితులను ఎదుర్కొనే ప్రత్యామ్నాయాలు ఏ విధమైనవీ లేకపోవటమే ఇప్పటి దుస్థితికి కారణం. మరోవైపు గిడ్డంగి నిల్వల్లో కూడా అతివృష్టి కారణంగా 50 శాతం నష్టం ఉంటున్నది.

భారత వ్యవసాయ పరిశోధన శాఖ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ ఆఫ్ ఆనియన్ అండ్ గార్లిక్ రీసెర్చ్ కోసం 25 కేంద్రాలు మాత్రమే దేశవ్యాప్తంగా ఏర్పాటుచేశారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా సరఫరా కోసం, నిల్వ కోసం ప్రత్యేక వ్యవస్థలు, నాణ్యమైన నిర్మాణాలు కూడా అందుబాటులో లేవు. మరోవైపు ఉల్లి పంటను పండించే సంప్రదాయ రాష్ట్రాలు కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఉల్లి ఉత్పత్తి ఈ మధ్యన గణనీయంగా పెరిగింది. ఈ ఉత్పత్తిని నిల్వ చేయటంలో, సరఫరా చేయటంలో వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఉల్లిని నిల్వచేయటంలో ప్రైవేటు రంగాన్ని కూడా ప్రోత్సహిస్తే పరిస్థితి మరోలా ఉండేదేమో. కానీ ఆ దిశగా ప్రయత్నాలేవీ జరిగినట్లు లేదు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో నిల్వ నైపుణ్యాలను, సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అగత్యాన్ని ఇప్పటి పరిస్థితి తెలియజేస్తున్నది.

ప్రస్తుత ఉల్లికొరత దేశంలో ఉన్న సరఫరా వ్యవస్థలు, నిల్వ ఉంచే గిడ్డంగి వ్యవస్థల నైపుణ్యాల లేమిని తెలియజేస్తున్నది. దీన్ని దీర్ఘకాలిక దృష్టితో సమస్య పరిష్కారానికి కృషి జరుగాలి. ఇందులో సహజ, ప్రకృతి నష్టాల కన్నా మానవ ప్రయత్నలోపమే ఎక్కువగా కనిపించటం విషాదం. నైపుణ్యం, సామర్థ్యం విషయంలో మరింతగా శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. పంటల దిగుబడులు, నష్టాలతో తలెత్తి ఎగుడు దిగుళ్లను సమర్థంగా ఎదుర్కోవటానికి గట్టి ప్రయత్నం జరుగాలి. ఆపత్కాల నిల్వగా ఉండే పది లక్షల టన్నుల ఉల్లిని కూడా గరిష్టంగా నష్టాలు నివారించి అతి ఎక్కువస్థాయిలో వినియోగించుకునే శక్తిని కూడగట్టుకోవాలి. ఈ దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పుడే ఆహారకొరతలను నివారించుకోవచ్చు.

**(వ్యాసకర్త: కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ సెక్రటరీ) 'ది వైర్' సౌజన్యం..**

# ట్రంప్ అభిశంసన జరిగేనా?

విశ్లేషణ

**సుసాన్ కార్న్‌వెల్**
**అర్షద్ మహమ్మద్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిశంసనకు ప్రక్రియ ప్రారంభం కానున్నది. తన ప్రత్యర్థి అయిన జో బిడెన్‌పై దర్యాప్తు జరుపవలసిందిగా ట్రంప్ ఉక్రెయిన్ దేశంపై ఒత్తిడి తెచ్చారనేది ఆయనపై ఉన్న ఆరోపణ. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీచేయడానికి ప్రయత్నిస్తున్న అభ్యర్థుల్లో బిడెన్ ప్రముఖుడు. ఆయనను పోటీనుంచి తప్పించడానికి ఆయనపై దర్యాప్తు చేయాలని ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడిని కోరినట్లుగా ఆధారాలు దొరుకడంతో అభిశంసనకు అవకాశం ఏర్పడింది. ఈ అభిశంసనకు ముందు దర్యాప్తు సాగకుండా అడ్డుకున్నారనే ఆరోపణ కూడా ట్రంప్‌పై ఉన్నది. ట్రంప్ మాత్రం తనను పదవీ నుంచి తప్పించాలనేది రాజకీయ కుట్ర అని ప్రత్యారోపణ చేస్తున్నారు. తాను ఏ తప్పూ చేయలేదని ఆయన అంటున్నారు. అమెరికా ప్రతినిధుల సభ ట్రంప్ అభిశంసన ప్రక్రియను బుధవారం చేపట్టే అవకాశాలున్నాయి. ఈ వారంలోగా దీనిపై ఓటింగ్ జరుగవచ్చు. ట్రంప్‌పై ఆరోపణలను ఆమోదించి సెనేట్‌కు పంపవలసి ఉంటుంది. ప్రతినిధుల సభలో డెమొక్రాటిక్ పార్టీకి మెజారిటీ ఉన్నది. కానీ సెనేట్‌లో రిపబ్లికన్ పార్టీ ఆధిపత్యం ఉన్నది. ప్రతినిధుల సభలో ట్రంప్ అభిశంసన తీర్మానం నెగ్గాలంటే సాధారణ మెజారిటీ సరిపోతుంది. ఈ సభలో డెమొక్రాట్లకు 36 సీట్ల మెజారిటీ ఉన్నది. సెనేట్‌లో దేశాధ్యక్షుడి అభిశంసన తీర్మానం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలి. కానీ సెనేట్‌లో మొత్తం వందమంది సభ్యులుంటే రిపబ్లికన్ పార్టీకి 53 మంది సభ్యులున్నారు.

అధ్యక్ష భవనం సిబ్బంది తాత్కాలిక అధిపతి మిక్ ముల్వనీ, ఆయన సహాయకుడు రాబర్ట్ బ్లెయిర్, జాతీయ భద్రతా మాజీ సలహాదారు జాన్ బోల్టన్, బడ్జెట్ అధికారి మైకెల్ డఫీ వచ్చి సాక్ష్యం ఇవ్వాలని సెనేట్ డెమొక్రాటిక్ నాయకుడు చుక్ స్కూమర్ పిలిచారు. ప్రతినిధుల సభ కూడా ఈ నలుగురిని విచారించాలని భావిస్తున్నది. ట్రంప్‌పై అభిశంసన ప్రక్రియ ప్రారంభించాలా అనే అంశంపై జ్యుడీషియల్ కమిటీ ఓటింగ్ జరిపింది. ఇందులో 23 మంది డెమొక్రాటిక్ సభ్యులు అభిశంసన ప్రక్రియ చేపట్టాలని ఓటు వేశారు. 17 మంది రిపబ్లికన్‌పార్టీ సభ్యులు మాత్రం వ్యతిరేకించారు. పార్టీ ప్రాతిపదికన ఓట్లు పడ్డాయి. అయితే మొత్తం సభలో ఓటింగ్ జరిగినప్పుడు డెమొక్రాటిక్‌పార్టీ సభ్యులు ఐక్యంగా ఉంటారా అనే అనుమానాలున్నాయి. కొందరు డెమొక్రాటిక్ పార్టీ సభ్యులు ట్రంప్ వైపు మొగ్గే అవకాశాలు కూడా ఉన్నాయి. న్యూజెర్సీకి చెందిన డెమొక్రాటిక్ పార్టీ సభ్యులు జెఫ్ వాన్ డ్ర్యూ రిపబ్లికన్‌ల వైపు వెళ్ళే సూచనలు కనిపిస్తున్నాయి. ట్రంప్‌నకు వ్యతిరేకంగా విడుదలైన నివేదిక హాస్యాస్పదంగా ఉందని అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి స్టీఫనీ గ్రీష్మం వ్యాఖ్యానించారు. ప్రతినిధుల సభలో విచారణ సందర్భంగా ట్రంప్‌పై డెమొక్రాటిక్ పార్టీ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. ట్రంప్ అమెరికా రాజ్యాంగానికి ప్రమాదం తెచ్చిపెట్టారని, జాతీయ భద్రతకు ముప్పుగా మారారని, 20 20లో జరిగే అధ్యక్ష ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. 2020 ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ అభిశంసన అవసరమని వారంటున్నారు. రిపబ్లికన్ పార్టీ వారు ట్రంప్‌కు దృఢంగా మద్దతు ఇస్తున్నారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించారని గుర్తుచేస్తూ, ఆ ఎన్నికల ఫలితాన్ని మార్చాలనేదే కుట్ర అని వారు ఆరోపిస్తున్నారు.

ట్రంప్‌పై అభిశంసన దర్యాప్తు సెప్టెంబర్‌లో ప్రారంభమైంది. ప్రతినిధుల సభ బుధవారం అభిశంసన ప్రక్రియ చేపట్టినప్పుడు, ఆయన చర్యలు ఇందుకు అనుగుణమైనవేనా అనేది ప్రధానంగా పరిశీలిస్తారు. ట్రంప్-ఉక్రెయిన్ సంబంధాలను మించి మరింత విస్తృతంగా తమ పరిధి ఉంటుందని ప్రతినిధుల సభ జ్యుడీషియరీ కమిటీ పేర్కొన్నది. గతంలో రష్యాతో సంబంధాల గురించి మ్యూలర్ కమిటీ జరిపిన దర్యాప్తు వివరాలను కూడా చేరుస్తామని వెల్లడించింది. ట్రంప్ చర్యలు అభిశంసనకు అర్హమైనవని ముగ్గురు న్యాయశాస్త్ర ఆచార్యులు స్పష్టం చేశారు. వీరి న్యాయ సలహాల ప్రాతిపదికగానే ప్రతినిధుల సభ అభిశంసన ప్రక్రియను చేపట్టింది. ట్రంప్ చర్యలు అభిశంసనకు అర్హమైనవి కాకపోతే ఇక మరేవీ కాదని నార్త్ కరోలినా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ మైకె గెర్హార్ట్ అభిప్రాయపడ్డారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర ప్రొఫెసర్ నోవా ఫెల్డ్‌మన్ కూడా ట్రంప్ చర్యలు అభిశంసనకు అర్హమైనవని అన్నారు. ట్రంప్‌నకు రాజు మాదిరిగా అపరిమిత అధికారాలు ఉండవని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర ఆచార్యులు పామ్ కర్లాన్ వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యలపై రిపబ్లికన్ పార్టీ వారు తీవ్రంగా స్పందించారు.

**1998లో బిల్ క్లింటన్ విషయంలోనూ ఇదే జరిగింది. ప్రతినిధుల సభ ఆయనను అభిశంసించినప్పటికీ, సెనేట్ ఆమోదించలేదు. ఇప్పుడు ట్రంప్‌ను అభిశంసించాలా లేదా అనే విషయమై క్రిస్మస్‌లోగా ప్రతినిధుల సభ నిర్ణయం తీసుకుంటుంది.**

జూలై 25వ తేదీన ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు ఒలోడైమిర్ జెలెన్స్కీతో మాట్లాడారు. ఈ సంభాషణలో బిడెన్‌పైనా, ఆయన కుమారుడిపైనా దర్యాప్తు ప్రారంభించాలని సూచించారు. బిడెన్ అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆయన కుమారుడు హంటర్ బిడెన్ ఉక్రెయి న్ ఇంధన కంపెనీ బురిస్మా బోర్డు సభ్యుడు అయ్యారు. బిడెన్‌లు అవినీతికి పాల్పడ్డారనేది ట్రంప్ ఆరోపణ. ఈ ఆరోపణలను బిడెన్‌లు ఖండిస్తున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీపై ఒత్తిడి తేవడంలో భాగంగా ట్రంప్ ఆ దేశానికి చెల్లించవలసిన 391 మిలియన్ డాలర్ల సొమ్మును నిలిపివేశారని డెమొక్రాట్స్ ఆరోపిస్తున్నారు. రష్యా దాడి ప్రమాదంలో ఉన్న ఉక్రెయిన్‌కు తక్షణం ఆర్థిక సహాయం అందించాల్సి ఉన్నది. కానీ ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని డెమొక్రాట్స్ ఆరోపిస్తున్నారు. ఈ ఉదంతంపై దర్యాప్తు సాగకుండా చేయడానికి ట్రంప్ ప్రయత్నించడం కూడా వివాదాస్పదమైంది. దీంతో దర్యాప్తును అడ్డుకున్న అంశాన్ని కూడా ప్రతినిధుల సభ పరిశీలిస్తున్నది. ప్రతినిధుల సభ పిలుపునకు స్పందించవద్దని ట్రంప్ తమ అధికారులను ఆదేశించారు. అయితే రిపబ్లికన్లు పిలిపించుకున్న జార్జి వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ జొనాథన్ టర్లీ మాత్రం ట్రంప్ చర్యల్లో చట్టవిరుద్ధమేమీ లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్‌పై దర్యాప్తు వేగంగా సాగుతున్నదనీ, తగిన ఆధారాల్లేవని అన్నారు. తాను ట్రంప్‌కు ఓటు వేయలేదని అంటూ, ట్రంప్ విధానాలను వ్యతిరేకించవచ్చు, కానీ ఈ కేసులో ఆధారాల్లేవని అన్నారు. సంఘటనలతో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న వారి సాక్ష్యాలు అవసరమని వివరించారు. ఈ వ్యాఖ్య రిపబ్లికన్‌ల వాదనకు బలం చేకూరుస్తున్నది. తగిన ఆధారాలుంటే అభిశంసన చేపట్టవచ్చని కూడా టర్లీ అన్నారు.

అమెరికా దేశాధ్యక్షుడు ఎవరూ ఇప్పటివరకు అభిశంసన ద్వారా పదవీచ్యుతులు కాలేదు. 1974లో రిపబ్లికన్ పార్టీకి చెందిన రిచర్డ్ నిక్సన్‌పై ప్రతినిధుల సభ అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. వాటర్‌గేట్ కుంభకోణంపై ఆయన రాజీనామా చేయవలసి వచ్చింది. 1868లో అండ్ర్యూ జాన్సన్‌పై ప్రతినిధుల సభ అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. కానీ సెనేట్ ఆమోదించకపోవడంతో బయటపడ్డారు. 1998లో బిల్ క్లింటన్ విషయంలోనూ ఇదే జరిగింది. ప్రతినిధుల సభ ఆయనను అభిశంసించినప్పటికీ, సెనేట్ ఆమోదించలేదు. ఇప్పుడు ట్రంప్‌ను అభిశంసించాలా లేదా అనే విషయమై క్రిస్మస్‌లోగా ప్రతినిధుల సభ నిర్ణయం తీసుకుంటుంది. ఒకవేళ అభిశంసనకే మొగ్గినట్టయితే, సెనేట్ జనవరిలో విచారణ చేపడుతుంది.

**'ది వైర్' సౌజన్యంతో...**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

# నేరగాళ్లకు డెత్ కౌంటర్



తోకో పాలసీకి శ్రీకారం చుట్టిన ఆదిత్యనాథ్ సర్కార్..
ప్రభుత్వ చర్యలకు భయపడి బెయిల్ రద్దు చేసుకున్న 15,170 మంది నిందితులు
అచ్చుగుద్దినట్టు జరిగిన 11 ఎన్‌కౌంటర్లు: నివేదికలో వెల్లడి..
నకిలీ ఎన్‌కౌంటర్లుగా విమర్శలు..




**2017లో** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించి యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ ఏడాది మార్చి 26న యూపీ సీఎంగా ఆదిత్యనాథ్ ప్రమాణం చేసింది మొదలు.. రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ల సంస్కృతి అడ్డూఅదుపూ లేకుండా కొనసాగింది. సీఎం పగ్గాలు చేపట్టిన మరుసటి నెలలోనే.. 'అగర్ అప్‌రాధ్ కరేంగే థో తోక్ దియే జాయేంగే (ఎవరైనా నేరానికి పాల్ప డితే, వాళ్లు హతమవుతారు)' అంటూ నేరస్థులను ఆదిత్యనాథ్ హెచ్చరించారు. 'నేరస్థుల ఏరివేత విధానం (తోకో పాలసీ)'కి శ్రీకారం చుట్టారు. దీనిపై హక్కుల సంఘాల నుంచి, మీడియా నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమైనప్పటికీ ఆయన తన పంథాను మార్చుకోలేదు.




**2,32,404 మంది అరెస్టు**

మార్చి 2017 నుంచి మే 27, 2019 మధ్య రాష్ట్రంలో 3,896 ఎన్‌కౌంటర్లు జరిగినట్టు ఆదిత్యనాథ్ సర్కారు ప్రకటించింది. ఈ ఘటనల్లో 76 మంది నిందితులతో పాటు మరో ఐదుగురు పోలీసులు మరణించినట్టు పేర్కొంది. 1,154 మంది నిందితులు, 642 మంది పోలీసులు గాయపడ్డారని తెలిపింది. ఈ ఘటనల్లో 8,904 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీరట్ జోన్‌లో అత్యధికంగా (449) ఎన్‌కౌంటర్లు జరగ్గా, ఆదిత్యనాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గోరఖ్‌పూర్ నియోజకవర్గంలో తక్కువగా జరిగాయి. ఈ కాలంలో 406 మందిని జాతీయ భద్రత చట్టం(ఎన్‌ఎస్‌ఏ) కింద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 2,32,404 మంది అనుమానితులను వివిధ ఘటనల్లో పోలీసులు అరెస్టు చేశారు. 1,69,837 మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 1.5 కోట్ల మందిని పెట్రోలింగ్ ద్వారా తనిఖీ చేశారు.

**రాజకీయ ఒత్తిళ్లు లేవు**

'నేరాలకు పాల్పడిన నేరస్థులను ఉపేక్షించకూడదని ప్రభుత్వ వర్గాల నుంచి మాకు ఆదేశాలు అందాయి. నేరపూరిత కేసుల దర్యాప్తులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు. హత్య జరిగిన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకునే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయి' అని డీజీపీ ఓపీ సింగ్ తెలిపారు. నేరస్థుల కేసుల దర్యాప్తు విషయంలో రాజకీయ నాయకుల జోక్యాన్ని పట్టించుకోనవసరం లేదని సీఎం ఆదిత్యనాథ్ తమకు ఆదేశాలు జారీ చేసినట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు. 'ఓ కేసులో ఓ పేరు మోసిన నేరస్థుడ్ని అరెస్టు చేశాం. అయితే, అతనిపై నమోదైన అభియోగాల తీవ్రతను తగ్గించి సదరు నిందితునికి బెయిల్ వచ్చే విధంగా చేయాలని ఓ సీనియర్ బీజేపీ నాయకుడు సంప్రదింపులు జరిపారు. ఈ విషయాన్ని సీఎం ఆదిత్యనాథ్ దృష్టికి తీసుకెళ్లాం. ఇలాంటి సంప్రదింపులు, రాయబారాల్ని పట్టించుకోనవసరం లేదని ఆయన మాకు చెప్పారు. దీంతో సదరు నేరస్థుడు ఇంకా జైల్లోనే ఊచలు లెక్కబెడుతున్నాడు. అతని బెయిల్ అభ్యర్థన ఇప్పటికి రెండుసార్లు తిరస్కరణకు గురైంది' అని ఆ అధికారి తెలిపారు.

**ఎన్‌హెచ్‌ఆర్సీకి నివేదిక పంపిస్తాం: ఏడీజీ**

'ప్రతి ఎన్‌కౌంటర్ అనంతరం న్యాయాధికారుల సమక్షంలో విచారణ జరుగుతుంది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన నివేదికలు ఎన్‌హెచ్‌ఆర్సీ, ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపిస్తాం. నేరస్థులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను కొనసాగించాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. నేరస్థులు లొంగిపోవడానికి నిరాకరించిన క్రమంలో దాడులు చేస్తాం' అని రాష్ట్ర ఏడీజీ(శాంతి భద్రతలు) ఆనంద్ కుమార్ తెలిపారు.

**పోలీసుల కథనాలపై అనుమానాలు.. విమర్శలు**

రాష్ట్రంలో శాంతి, భద్రతలు కాపాడటానికి, నేరాల్ని అరికట్టడానికి, పోలీసులు తమను తాము రక్షించుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో 'ఎన్‌కౌంటర్ ' చర్యలకు దిగుతున్నట్టు అధికారులు చెబుతున్నప్పటికీ, యూపీలో జరిగిన కొన్ని ఎన్‌కౌంటర్లు పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి. ఎన్‌కౌంటర్లలో కొన్ని నకిలీవి ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గత ఏడాది ఓ న్యూస్ పోర్టల్ ఓ కథనాన్ని ప్రచురిస్తూ.. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో జరిగిన 14 పోలీసు ఎన్‌కౌంటర్లు ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్టు పేర్కొంది. ఇందులో 11 ఎన్‌కౌంటర్లు జరిగిన విధానం ఒకే తరహాలో ఉన్నట్టు తేల్చింది. ఈ ఘటనల్లో హతమైన నిందితుల వయసు 17 నుంచి 40 ఏండ్లని, పలు కేసుల్లో వాళ్లు నిందితులుగా ఉన్నారని వార్తా సంస్థ పేర్కొంది. అలాగే, ఎన్‌కౌంటర్ జరిగే కంటే ముందే నిందితులు ఉన్న ప్రదేశానికి సంబంధించిన సమాచారం పోలీసులకు తెలిసిందని సదరు సంస్థ తెలిపింది. 'ఎన్‌కౌంటర్ జరగడానికి ముందు నిందితులు ద్విచక్ర వాహనం లేదా కారులో ప్రయాణిస్తున్నారు. పోలీసులు నిందితులను అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో.. వాళ్లు పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. దుండగుల చర్యల్ని తిప్పిగొట్టేందుకు పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో నిందితులకు బుల్లెట్ గాయాలు అయ్యాయి. సమీప దవాఖానకు నిందితులను తరలిస్తున్న క్రమంలో వాళ్లు ప్రాణాల్ని కోల్పోయారు' అని 11 ఎన్‌కౌంటర్ ఘటనల్లో ఇలాంటి ప్రక్రియే జరిగినట్టు ఆ నివేదిక పేర్కొంది. దీంతో పోలీసుల తీరును పలువురు విమర్శిస్తున్నారు.

**- నేషనల్ డెస్క్**

### 15వేల మంది స్వచ్ఛందంగా జైళ్లకు

యోగి ఆదిత్యనాథ్ 'తోకో పాలసీ'కి భయపడి బయట ఉండటం కంటే జైలులోనే సురక్షితం అని భావించి.. 15,170 మంది నేరస్థులు స్వచ్ఛందంగా కోర్టులకు లొంగిపోవడం లేదా తమకు లభించిన బెయిళ్లను రద్దు చేసుకోవడం గమనార్హం. 'మేము తీసుకున్న చర్యలతో నేరస్థులు జైళ్లలోకి లేదా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజలు సురక్షితంగా, భద్రంగా ఉన్నట్టు భావిస్తున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ నేరాలకు పాల్పడినట్టు తేలితే మా పార్టీ నేతల్ని సైతం ఉపేక్షించం. నేరాలకు పాల్పడిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామ'ని ఆదిత్యనాథ్ పేర్కొన్నారు.

# ముషారఫ్‌కు మరణశిక్ష

దేశద్రోహం కేసులో పాక్ ప్రత్యేక కోర్టు తీర్పు
రాజ్యాంగాన్ని రద్దు చేయడం, ఎమర్జెన్సీని విధించడం తీవ్ర నేరాలని వ్యాఖ్య
మూడేండ్లుగా దుబాయ్‌లోనే ఉంటున్న ముషారఫ్
తీర్పుపై పాక్ సైన్యం తీవ్ర అభ్యంతరం



**ఇస్లామాబాద్, డిసెంబర్ 17:** పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ (76)కు ఆ దేశ ప్రత్యేక కోర్టు మరణశిక్ష విధించింది. ఆయనపై నమోదైన రాజద్రోహం కేసులో ఈ శిక్షను విధిస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై పాక్ సైన్యం తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. న్యాయప్రక్రియను సరిగా అనుసరించకుండానే తీర్పు వెలువరించారని మండిపడింది. దేశం కోసం 40 ఏండ్లు సేవలందించిన ముషారఫ్ ఎప్పటికీ దేశద్రోహి కాలేరని పేర్కొంది. మరోవైపు తన న్యాయవాదులను సంప్రదించాక తీర్పుపై స్పందిస్తానని ముషారఫ్ చెప్పారు. పాకిస్థాన్ సైన్యాధిపతిగానూ విధులు నిర్వర్తించిన ముషారఫ్ 2001 నుంచి 2008 వరకు ఆ దేశ అధ్యక్షుడిగా పనిచేశారు. అయితే తన నియంతృత్వ పాలనను పదిలం చేసుకోవడానికి ఆయన 2007లో నిబంధనలకు విరుద్ధంగా రాజ్యాంగాన్ని రద్దు చేసి దేశంలో ఎమర్జెన్సీని విధించారు. పలువురు న్యాయమూర్తులను జైలుకు పంపారు. ఇలా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పలు విధానాలను పాటించిన నేపథ్యంలో ఆయనపై నవాజ్ షరీఫ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2013లో రాజద్రోహం కేసు నమోదైంది. తాను ఏ తప్పూ చేయలేదని, కేవలం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తనపై రాజద్రోహం కేసు నమోదు చేశారని ముషారఫ్ చెబుతూ వచ్చారు. ఆయన వాదనలను తోసిపుచ్చిన కోర్టు 2014లోనే దోషిగా తేల్చింది. కానీ అప్పట్లో శిక్ష ఖరారు చేయలేదు. అయితే అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ముషారఫ్ 2016లో దుబాయ్‌కి వెళ్లారు. దీంతో ఈ కేసు విచారణ కొంతకాలం నిలిచిపోయింది. దుబాయ్‌కి వెళ్లిన ముషారఫ్ ఇప్పటి వరకు తిరిగిరాలేదు. ఈ నేపథ్యంలో కేసు విచారణను తిరిగి ప్రారంభించిన పెషావర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వకార్ అహ్మద్ సేథ్ నేతృత్వంలోని ప్రత్యేక కోర్టు ముషారఫ్‌కు సమన్లు జారీ చేసింది. ఆయన హాజరుకాకపోవడంతో విచారణను ముగించి గత నెల 19న తీర్పును రిజర్వ్ చేసింది. ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రత్యేక కోర్టు మంగళవారం ముషారఫ్‌కు మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. తీర్పు వెల్లడి సందర్భంగా జస్టిస్ వకార్ అహ్మద్ సేథ్ మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని రద్దు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఆర్టికల్ 6 ప్రకారం ఇలా చేయడం రాజద్రోహం కిందకు వస్తుంది' అని పేర్కొన్నారు.

**దేశం కోసం యుద్ధం చేసిన వ్యక్తి.. దేశద్రోహా?**

ఈ తీర్పు తీవ్ర విచారకరమని, తన న్యాయవాదులను సంప్రదించిన తర్వాత పూర్తిస్థాయిలో స్పందిస్తానని ముషారఫ్ పేర్కొన్నట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. పాక్ సైన్యం స్పందిస్తూ 'ముషారఫ్ దేశం కోసం 40 ఏండ్లు సేవలందించారు. దేశ రక్షణ కోసం యుద్ధాలు కూడా చేశారు. అలాంటి వ్యక్తి ఎన్నటికీ దేశద్రోహి కాదు' అని తెలిపింది.

**దేశ చరిత్రలోనే తొలిసారి**

ముషారఫ్‌కు మరణశిక్షను విధించడాన్ని ముగ్గురు సభ్యుల ధర్మాసనంలో ఇద్దరు న్యాయమూర్తులు సమర్థించగా.. ఒకరు వ్యతిరేకించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ముషారఫ్ 30 రోజుల్లోగా కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు. కాగా, పాక్ సైన్యాధిపతిగా పనిచేసిన ఓ వ్యక్తికి మరణశిక్ష విధించడం ఆ దేశ చరిత్రలో ఇదే తొలిసారి.


సోనియాగాంధీ నేతృత్వంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి వస్తున్న ప్రతిపక్ష నేతలు

## సీఏఏను వెనకకు తీసుకోవాలి

- రాష్ట్రపతి కోవింద్‌కు ప్రతిపక్షాల వినతి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** మోదీ ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కి చట్టాలను చేస్తున్నదని, వాటిని ప్రజలు అంగీకరించకపోయినా బలవంతంగా అమలు చేస్తున్నదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ నేతృత్వంలో విపక్ష పార్టీలకు చెందిన నేతలు మంగళవారం రాష్ట్రపతి కోవింద్‌ను కలిశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా, ప్రజలను విభజించేలా ఉన్న పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా జోక్యం చేసుకోవాలని కోరారు. హింసాత్మక నిరసనలు, పోలీసుల చర్యపై విచారణకు దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిపక్ష నేతల బృందం ఈ మేరకు రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించింది. అనంతరం సోనియా గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'మోదీ ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కి చట్టాలు చేస్తున్నది. ప్రజలు వాటిని అంగీకరించం లేదు. రాష్ట్రపతి కోవింద్‌ను కలిసి జోక్యం చేసుకోవాలని కోరాం. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఈశాన్యంలో మొదలైన నిరసనలు దేశమంతటా వ్యాపించడంపై ఆందోళన తెలియజేశాం' అని చెప్పారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి, సీపీఐ నేత డీ రాజా టీఎంసీ నేత డెరెక్ ఓబ్రియన్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ తదితరులు రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉన్నారు.

## దమ్ముంటే పాకిస్థానీలకు పౌరసత్వం ఇవ్వాలి

ప్రతిపక్షాలకు మోదీ సవాలు



**బర్హెయిట్:** పౌరసత్వ సవరణ చట్టంపై కాంగ్రెస్ పార్టీ అసత్యాలను ప్రచారం చేస్తూ ముస్లింలను భయాందోళనకు గురిచేస్తున్నదని ప్రధాని మోదీ ఆరోపించారు. జార్ఖండ్‌లో మంగళవారం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ఎవరికీ నష్టం జరుగదని హామీ ఇస్తున్నానని అన్నారు. 'కాంగ్రెస్ దాని మిత్రపక్షాలను సవాలు చేస్తున్నాను. మీకు దమ్ముంటే పాకిస్థాన్‌లోని ప్రతి పౌరునికి భారత పౌరసత్వం ఇవ్వాలి. జమ్ముకశ్మీర్, లడఖ్‌లో ఆర్టికల్ 370ని మళ్లీ తెస్తామని చెప్పాలి' అని పేర్కొన్నారు. విద్యార్థులను శాంతింపజేసేందుకు ప్రధాని ప్రయత్నించారు. 'ఈ గెరిల్లా రాజకీయాలను ఆపండి. ప్రజాస్వామికంగా నిరసన తెలుపాలని యువతకు విజ్ఞప్తి చేస్తున్నాను. మీ ఆవేదనను మేము వింటాం. కొందరు అర్బన్ నక్సల్స్ మీ భుజాలపై తుపాకీ పెట్టి కాలుస్తున్నారు' అని మోదీ వ్యాఖ్యానించారు.

## దేశం తగులబడుతుంటే.. బట్టల గురించి మాట్లాడుతున్నారు: మమత


కోల్‌కతాలో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న మమత

పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారి 'వస్త్రాలను చూసి వారిని గుర్తు పట్టవచ్చు' అంటూ ప్రధాని మోదీ ఇటీవల జార్ఖండ్‌లో చేసిన వ్యాఖ్యలను పశ్చిమ బెంగాల్ సీఎం మమత తిప్పికొట్టారు. చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఓ వైపు దేశమంతా కాలిపోతుంటే వారేమో బట్టల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం కోల్‌కతాలో చేపట్టిన నిరసన ర్యాలీ రెండో రోజున మమత మాట్లాడుతూ.. 'బట్టలు చూసి ఆందోళనకారులెవరో చెప్తారట. నేను ధరించిన దుస్తులను బట్టి నేనెవరో చెప్పగలరా? ఈ దుస్తులు బాగా లేవా? చుట్టూ ఉన్నవారు ధరించినవి దుస్తులు కావా?' అని ప్రశ్నించారు.

# మళ్లీ భగ్గుమన్న ఢిల్లీ!



- పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా నిరసన జ్వాలలు
- సీలంపూర్ వద్ద హింసాత్మకంగా మారిన ఆందోళన
- పలు వాహనాలకు నిప్పు.. పోలీస్ బూత్ ధ్వంసం
- 21 మందికి గాయాలు
- అసోం, బెంగాల్‌లో శాంతియుత నిరసనలు


ఢిల్లీలోని సీలంపూర్‌లో వాహనాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

**న్యూఢిల్లీ/గువాహటి/మౌ:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశ రాజధానిలో మళ్లీ హింస చెలరేగింది. ఈశాన్య ఢిల్లీలోని సీలంపూర్ ప్రాంతం మంగళవారం అల్లర్లతో అట్టుడికింది. ఆందోళనకారులు పలు బైక్‌లకు నిప్పుపెట్టారు. పోలీస్ బూత్‌ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు ఆందోళనకారులపై లాఠీచార్జి చేశారు. భాష్పవాయువును ప్రయోగించారు. ఘర్షణలో 21 మంది గాయపడ్డారు. మరోవైపు, అసోం, పశ్చిమ బెంగాల్లో శాంతియుత నిరసనలు కొనసాగాయి. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా గత ఆదివారం ఢిల్లీలో జామియా వర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే.

**ఢిల్లీలో ఉద్రిక్తత..**

పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఈశాన్య ఢిల్లీ ఆందోళనలతో దద్దరిల్లింది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆందోళనకారులు సీలంపూర్ నుంచి జఫ్రాబాద్ వైపు ర్యాలీగా బయలుదేరారు. అయితే సీలంపూర్ చౌక్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో ఆందోళనకారులు హింసాకాండకు పాల్పడ్డారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. ట్రాఫిక్ పోలీసులకు చెందిన రెండు మోటార్ బైక్‌లకు నిప్పుపెట్టారు. పలు వాహనాలను, పోలింగ్ బూత్‌ను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జి జరిపి, భాష్పవాయువు ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఘర్షణలో 12 మంది పోలీసులు, ఆరుగురు సామాన్య పౌరులు సహా 21 మంది గాయపడ్డారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆందోళనల కారణంగా ఏడు మెట్రో స్టేషన్లను మూసివేశారు. ప్రజలు హింసకు పాల్పడవద్దని సీఎం అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తిచేశారు. మరోవైపు, జామియా విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థులు మంగళవారం శాంతియుత నిరసన చేపట్టారు. వర్సిటీలోకి ప్రవేశించేందుకు పోలీసులకు ప్రొక్టార్ అనుమతినిచ్చారన్న వార్తలను వర్సిటీ యాజమాన్యం ఖండించింది. కాగా, ఆదివారంనాటి ఘటనలో పోలీసులు ఎలాంటి కాల్పులు జరుపలేదని, అయితే ఘటనాస్థలం వద్ద ఖాళీ క్యాట్రిజ్ (తూటా) లభ్యమైందని హోం శాఖ అధికారి ఒకరు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.



బెంగళూరులో విద్యార్థుల ప్రదర్శన

**అసోంలో నిరసనల హోరు**

సీఏఏని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ అసోంలో నిరసనలు హోరెత్తాయి. 'సామూహిక సత్యాగ్రహం'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 'ఆసు' చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. పాటలు, పద్యాలు, నాటకాలతో ప్రజలు నిరసన చేపట్టారు. కాగా, గువాహటిలో అధికారులు కర్ఫ్యూను ఎత్తివేశారు.

- పశ్చిమ బెంగాల్‌లో ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టారు. పలు చోట్ల హైవేలను, రైల్వే ట్రాకులను దిగ్బంధించారు. అయితే ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు.
- ఉత్తరప్రదేశ్‌లో పలుచోట్ల ఆందోళనలు జరిగాయి. శాంతికి విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేశారన్న కారణంతో 113 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మౌ పట్టణంలో సోమవారం రాత్రి హింసాకాండకు పాల్పడిన 28 మంది కూడా ఇందులో ఉన్నట్లు తెలిపారు.
- 'పౌరసత్వ' నిరసనలు ఒడిశాకూ పాకాయి. భువనేశ్వర్‌లో ప్రజలు మంగళవారం శాంతియుత నిరసన చేపట్టారు. ఈ చట్టంపై సీఎం నవీన్ పట్నాయక్ తమ వైఖరిని స్పష్టంచేయాలని డిమాండ్‌చేశారు.
- సీఏఏపై కేరళలో నిర్వహించిన హర్తాళ్‌కు పాక్షిక స్పందన లభించింది. ముందస్తు చర్యగా 300 మందిని అరెస్ట్‌చేశారు.
- మద్రాస్ వర్సిటీలో రెండోరోజూ ఆందోళనలు కొనసాగాయి. పోలీసులు వర్సిటీలోకి ప్రవేశించి ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు.

### నిరసనకారులకు 'టీ' అందించిన సిక్కులు

జామియా వర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దమనకాండను ఖండిస్తూ సోమవారం ఢిల్లీగేట్ వద్ద వందల మంది నిరసనకు దిగారు. వీరికి సంఘీభావంగా కొందరు సిక్కులు ఆందోళనకారులకు 'టీ' అందించి తమ వంతు సాయం చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నది. సిక్కుల సాయంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వీరు అంతర్జాతీయ మానవత్వ సహాయ సంస్థ 'ఖల్సా ఎయిడ్'లో సభ్యులని తెలుస్తున్నది.

**సీఏఏని ఉపసంహరించుకోవాలి: సురవరం**

సీఏఏ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమైనదని, దానిని బేషరతుగా ఉపసంహరించుకోవాలని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూలో నిర్వహించిన సదస్సులోఆయన మాట్లాడుతూ.. దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు.

### సీఏఏకి వ్యతిరేకంగా మజ్లిస్ ఉద్యమం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఏఏకి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టేందుకు మజ్లిస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ నెల 21న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ సభలో పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రసంగిస్తారని ఆ వర్గాలు వెల్లడించాయి. దేశాన్ని మత ప్రాతిపదికన విభజించడానికి బీజేపీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టడానికి బీజేపీని వ్యతిరేకించే పార్టీలు, సంస్థలతో కలిసి పోరాడుతామని ఎంఐఎం ప్రతినిధులు చెప్పారు.


హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ధర్నా

ఆస్తుల ధ్వంసానికి పాల్పడితే

## కాల్చేయండి

అధికారులను ఆదేశించిన రైల్వే సహాయ మంత్రి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఎవరైనా రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే కాల్చిపారేయాలని సంబంధిత అధికారులను రైల్వే శాఖ సహాయ మంత్రి సురేశ్ అంగాడీ ఆదేశించారు. ఇటీవల పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో కొందరు నిరసనకారులు రైల్వేస్టేషన్‌కు నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన కాల్చివేయండని ఆదేశించారు. కేంద్ర హోంశాఖ తొలి మంత్రిగా పనిచేసిన వల్లభాయ్‌పటేల్ బతికి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకునేవారో.. అలాంటి చర్యలను తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కేంద్రమంత్రి హోదాలోనే ఈ ఆదేశాలు జారీ చేశానని ఓ మీడియా సంస్థతో సురేశ్ అంగాడీ చెప్పారు. మరోవైపు కేంద్ర మంత్రి వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుబట్టాయి.

## హైకోర్టులే సరైన వేదిక

విచారణ కమిటీల నియామకంపై అవే నిర్ణయిస్తాయి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న విద్యార్థులపై సాగుతున్న పోలీసుల దమనకాండ, పలుచోట్ల చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో ఒక కమిటీని వేసేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. పిటిషనర్లు తమ ఫిర్యాదులను సంబంధిత హైకోర్టులకు నివేదించాలని సూచించింది. ఇరు పక్షాల వాదనలు విన్న తరువాత.. హైకోర్టులు ఆయా ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు నిజనిర్ధారణ కమిటీలను వేయవచ్చని తెలిపింది. అరెస్టులు, ఆందోళనల సందర్భంగా గాయపడిన వారికి చికిత్సకు సంబంధించి కూడా హైకోర్టులే నిర్ణయిస్తాయని ప్రధాన న్యాయమూర్తి ఎస్‌ఏ బోబ్డే సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది. ఘర్షణల స్వభావం, అవి అనేక ప్రదేశాలకు విస్తరించిన తీరును బట్టి.. వాటిపై దర్యాప్తుకు ఆయా రాష్ట్రాలకు వెళ్లేందుకు ఒకే కమిటీని వేయడం సహేతుకం కాదని భావిస్తున్నట్టు తెలిపింది. పిటిషనర్లు చేసిన ప్రతి ఆరోపణను కేంద్రం తిరస్కరిస్తున్న విషయాన్ని తాము గమనించామని పేర్కొంది. యూపీలోని అలీగఢ్, ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీల్లో ఒక్క విద్యార్థిని కూడా అరెస్టు చేయలేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. ఈ వ్యాఖ్యలను పిటిషనర్ల తరపు న్యాయవాదులు తోసిపుచ్చారు. దవాఖానల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు చేతులు, కాళ్లు విరిగి చికిత్స పొందుతున్నారని చెప్పారు.

## విదేశీ వర్సిటీల్లో సంఘీభావం



హార్వర్డ్ వర్సిటీలో నిరసన

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తున్న జామియా మిలియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల విద్యార్థులపై పోలీసులు అణిచివేత అమానుషంగా ఉన్నదని ప్రపంచంలోని పలు ప్రముఖ వర్సిటీల విద్యార్థులు ఆరోపించారు.ఈ మేరకు విద్యార్థుల ఆందోళనకు సంఘీభావంగా అమెరికాలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన దాదాపు 400 మంది విద్యార్థులు సంతకం చేసిన ప్రకటనను విడుదల చేశారు. మరోవైపు, లండన్‌లో ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ విద్యార్థులు ఇండియా హౌస్ వరకు ర్యాలీ నిర్వహించారు. చట్టాన్ని ఉపసంహరించుకోవాలంటూ హార్వర్డ్ వర్సిటీ విద్యార్థులు.. భారత ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. తోటి విద్యార్థులపై పోలీసుల దాడిని చూస్తూ మౌనంగా ఉండలేకపోతున్నామంటూ కొలంబియా విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక ప్రకటన జారీచేశారు. కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) విద్యార్థులు కూడా మౌన ప్రదర్శన జరిపారు. ఫిన్‌లాండ్‌లోని భారతీయ విద్యార్థులు అక్కడ ఉన్న భారతీయ రాయబార కార్యాలయంలో తమ నిరసనను తెలియజేశారు.

## కాందిశీకులకు పౌరసత్వం ఇచ్చితీరుతాం: అమిత్‌షా



పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా పలు ప్రాంతాల్లో ఆందోళనలు ఉద్ధృతమవుతున్నప్పటికీ.. తాము మాత్రం వెనుకకు తగ్గేది లేదని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా తేల్చి చెప్పారు. 'ప్రతిపక్షాలు రాజకీయంగా ఎంత వ్యతిరేకించాలనుకుంటే.. అంత ప్రయత్నించండి. కానీ నరేంద్రమోదీ ప్రభుత్వం భయపడదు. అనేక సంవత్సరాలుగా కాందిశీకులుగా ఉన్న వారికి పౌరసత్వం ఇచ్చి తీరుతాం' అని ఆయన ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఓ వైపు తూర్పు ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన హింసాత్మకంగా మారుతుండగానే పశ్చిమ ఢిల్లీలో అమిత్‌షా ఈ ప్రకటన చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారత పౌరసత్వం ఇచ్చి, వారు దేశంలో గౌరవంగా బతికే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పౌరసత్వ చట్టం ముస్లింలకు వ్యతిరేకం కాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. ఇతరులను ద్వేషించాలని మన సంస్కృతి మనకు బోధించలేదని ఆయన పేర్కొన్నారు. న్యూయార్క్‌లో ఉన్న రాజ్‌నాథ్ అక్కడి భారత సంతతి ప్రజలు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తమిళులకు అన్నాడీఎంకే ద్రోహం: కమల్‌హాసన్



మక్కల్ నీది మయ్యం అధినేత, సినీ నటుడు కమల్‌హాసన్.. దేశవ్యాప్తంగా ఎన్నార్సీ (జాతీయ పౌరుల జాబితా)ను చేపట్టడాన్ని తమపార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అధికార అన్నాడీఎంకే పార్టీ పౌర సవరణ చట్టానికి మద్దతునివ్వడం తమిళ ప్రజలకు, దేశానికి ద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా మంగళవారం డీఎంకే ఆధ్వర్యంలో తమిళనాడు అంతటా నిరసన ప్రదర్శనలు జరిగాయి. పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఎంపీ, కనిమొళి, కేంద్ర మాజీ మంత్రి దయానిధి మారన్ తదితరులు పలు ప్రాంతాలలో ఈ ప్రదర్శనలకు సారథ్యం వహించారు.

## రాష్ట్రాలవారీగా మైనారిటీ హోదా కుదరదు

మతాలను దేశవ్యాప్తమైనవిగా పరిగణించాలి: సుప్రీంకోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలకు మైనారిటీ హోదాను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 26 ఏండ్ల క్రితం జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. మతాలను దేశవ్యాప్తమైనవిగా పరిగణించాలని పేర్కొంది. రాష్ట్రాలవారీగా ఆయా మతస్థుల జనాభాను బట్టి మైనారిటీ హోదాను కల్పించాలని కోరుతూ బీజేపీ నాయకుడు, న్యాయవాది అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధానన్యాయమూర్తి ఎస్‌ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలలో హిందువులు మైనారిటీలుగా ఉన్నారని, అయినా వారికి మైనారిటీలకు ఇచ్చే సదుపాయాలను కల్పించడం లేదని పిటిషనర్ తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'మతాలను దేశవ్యాప్తమైనవిగా పరిగణించాలి. ముస్లింలు కశ్మీర్‌లో మెజారిటీగా ఉండి.. ఇతర ప్రాంతాలలో మైనారిటీలుగా ఉంటే వచ్చిన సమస్య ఏమిటి?' అని ప్రశ్నించింది.

# తొమ్మిది రైల్వేస్టేషన్లకు ఐఎస్వో అవార్డులు

- వీటిలో రాష్ట్రానివి ఆరు స్టేషన్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** దక్షిణమధ్య రైల్వేపరిధిలో తొమ్మిది స్టేషన్లకు ప్రతిష్ఠాత్మక ఐఎస్వో సర్టిఫికేషన్ అవార్డులు లభించాయి. రైల్వేస్టేషన్లు చేపట్టిన ఉత్తమమైన పర్యావరణ నిర్వహణ పద్ధతులకుగాను ఐఎస్వో 14001:2015 సర్టిఫికేషన్ అవార్డులు దక్కాయి. రాష్ట్రంలోని ఆరు రైల్వేస్టేషన్లు.. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, బాసర, వికారాబాద్, నిజామాబాద్ స్టేషన్లతోపాటు విజయవాడ, కర్నూల్ సిటీ, పర్లి వైద్యనాథ్ స్టేషన్లు అవార్డులకు ఎంపికయ్యాయి. అతి తక్కువ వనరుల వినియోగం, పర్యావరణహితమైన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని అవార్డులకు ఎంపికచేశారు. జలసంరక్షణ, ఇంధనపరిరక్షణ, సౌరవిద్యుత్ వినియోగం, ప్లాస్టిక్‌బాటిల్ క్రషింగ్‌మెషిన్లు, చెత్త నిర్వహణ వంటి కార్యక్రమాలను అమలు చేసి.. ఈ స్టేషన్లు అవార్డులను సొంతంచేసుకున్నాయి. అవార్డులకు ఎంపికపై దక్షిణమధ్య రైల్వే జీఎం గజానన్‌మాల్యా సంతోషం వ్యక్తంచేశారు. ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్, సంబంధిత డివిజనల్ రైల్వే మేనేజర్లు, అధికార బృందానికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ).. ఎకో స్మార్ట్ స్టేషన్లుగా అభివృద్ధి చేయడానికి భారతీయ రైల్వేలోని 36 స్టేషన్లను ఎంపికచేయగా, వాటిలో దక్షిణమధ్య రైల్వేకు చెందిన తొమ్మిది స్టేషన్లు ఉన్నాయి.

# 27న జర్నలిస్టులకు చెక్కుల పంపిణీ

- ఈ నెల 24 వరకు దరఖాస్తుల దాఖలుకు అవకాశం
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి మంజూరుచేసే ఆర్థిక సాయానికి అర్హులైన జర్నలిస్టుల కుటుంబాలకు ఈ నెల 27న చెక్కుల పంపిణీ చేపట్టనున్నట్టు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సాయం పొందడానికి అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను ఈ నెల 24వ తేదీలోపు మీడియా అకాడమీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. 2014 జూన్ 2 తర్వాత మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు, వృత్తిలో ఉంటూ అనారోగ్యం బారినపడి పనిచేయలేని స్థితిలోఉన్న జర్నలిస్టులు మాత్రమే ఈ ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి లబ్ధి పొందినవారు, ఇప్పటికే మీడియా అకాడమీకి దరఖాస్తులు పంపినవారు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని తెలిపారు. పౌరసంబంధాలశాఖ ఉపసంచాలకులు, సహాయ సంచాలకులు, డీపీఆర్వోల ద్వారా ధ్రువీకరించిన దరఖాస్తులను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ, ఇంటి నంబర్ 10-2-1, సమాచార భవన్, 2వ అంతస్తు, ఏసీ గార్డ్స్, మాసాబ్‌ట్యాంక్, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కాంప్లెక్స్, హైదరాబాద్‌కు పంపవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు కార్యాలయం ఫోన్ నంబర్లు 040-23298672, 23298674 లలో సంప్రదించాలని అల్లం నారాయణ సూచించారు.





న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సింగరేణి ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్

# ప్రమాదరహితంగా ఆర్కే గని

- జాతీయస్థాయి అవార్డు కైవసం
- ఉపరాష్ట్రపతి చేతులమీదుగా ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి పరిధిలోని రామకృష్ణాపూర్ (ఆర్కే) ఓపెన్ కాస్ట్ గనికి 'ప్రమాదరహిత ఓసీ గని'గా జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన జాతీయ స్థాయి గనుల రక్షణ అవార్డు ఉత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఆర్కే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్ మధుసూదన్, పిట్ కార్యదర్శి కే రాజ్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ గని ప్రారంభమైనప్పటి నుంచి ఆరేండ్లలో ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. అత్యుత్తమ రక్షణ చర్యలు పాటించడంతోనే ప్రమాదరహిత గనిగా నిలిచిందని సేఫ్టీ జీఎం నాగభూషన్‌రెడ్డి తెలిపారు. బహుమతి ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్‌తోపాటు సింగరేణి తరపున ఆపరేషన్స్ అండ్ పా డైరెక్టర్ చంద్రశేఖర్, మందమర్రి ఏరియా జీఎంగా పనిచేసిన ఎం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# జడ్జిగా 23 ఏండ్ల స్వాతి పోట్ల

- పిన్నవయస్కురాలిగా ఎంపిక
- రెండోర్యాంకుతో సత్తాచాటిన హైదరాబాదీ



**ఎల్బీ నగర్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌కు చెందిన స్వాతి భవాని పోట్ల 23 ఏండ్ల వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. మంగళవారం ప్రకటించిన ర్యాంకుల్లో మొత్తం 350 మార్కులకుగాను 241.16 మార్కులతో 2వ ర్యాంక్ సాధించారు. తెలంగాణ హైకోర్టు 67 పోస్టులకు నిర్వహించిన పరీక్షలో 51 మంది ఎంపికవగా, వీరిలో స్వాతి భవాని పోట్ల (హాల్ టికెట్‌నెంబర్ 2019299)దే చిన్న వయసు. 2018లో న్యాయవిద్య పూర్తిచేసిన స్వాతి 2019 సెప్టెంబర్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మంగళవారం ప్రకటించిన ర్యాంకుల్లో రెండో ర్యాంకు పొందిన స్వాతి.. జడ్జి ఉద్యోగాన్ని సాధించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఎంపికైన జడ్జిలలో చిన్న వయస్కురాలిగా స్వాతి పోట్ల నిలిచారు. పీజీ లాసెట్ 2018లోనూ స్వాతి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. స్వాతి తండ్రి సత్యనారాయణ పోట్ల, తల్లి పద్మప్రియ. వీరి స్వస్థలం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డోర్నకల్ ప్రాంతం కాగా, 20 ఏండ్ల కిందటే హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. మల్కాజ్‌గిరి ఆర్కేపురంలో నివసిస్తున్నారు. స్వాతి పోట్ల విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే సాగింది.

**బాధితులకు న్యాయం చేసేందుకు కృషిచేస్తా: స్వాతి భవాని పోట్ల**

జడ్జి కావాలన్నది నా లక్ష్యం. మొదటి ప్రయత్నంలోనే ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉన్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లో టాప్‌గా నిలిచాను. జడ్జిగా ఏ భయం లేకుండా తీర్పులు ఇవ్వాలనుకుంటున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు కృషిచేస్తాను.

# హానికారకులే అసలైన వికలాంగులు

- ప్రతి ఒక్కరిలో సంతోషం చూసేందుకు సీఎం కేసీఆర్ కృషి: మంత్రి సత్యవతి
- దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నది: మంత్రి కొప్పుల
- లలిత కళాతోరణంలో మానసిక వికలాంగుల సాంస్కృతిక సంబురాలు



హైదరాబాద్ లలిత కళాతోరణంలో మానసిక వికలాంగుల సాంస్కృతిక సంబురాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అవయవాలన్నీ సక్రమంగా ఉండీ సమాజానికి హాని తలపెట్టే వారే అసలైన వికలాంగులు అని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి మోములో సంతోషం చూడాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పనిచేస్తున్నారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని లలిత కళాతోరణంలో వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మానసిక వికలాంగుల సాంస్కృతిక సంబురాల కార్యక్రమాన్ని మరో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో మానసిక వికలాంగులకు రూ.3016 చొప్పున పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని, వికలాంగుల కోసం అన్ని పథకాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారని కొనియాడారు. మానసిక వికలాంగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానన్నారు. సాంఘిక సంక్షేమం, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. వికలాంగుల కోసం హైదరాబాద్‌తోపాటు నాలుగు జిల్లాలకు ఒకటి చొప్పున సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని మంత్రి కొప్పుల ప్రకటించారు. మానసిక వికలాంగులను చేరదీసి వారి అభ్యున్నతికి కృషిచేస్తున్న స్వచ్ఛందసంస్థల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ బీ శైలజ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, వుమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంయుక్త డైరెక్టర్ సబితతోపాటు వివిధ జిల్లాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో వసతులపై నిరంతర పర్యవేక్షణ

- బాలికల వసతి గృహాల్లో పటిష్ఠ భద్రత: మంత్రి సత్యవతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గురుకుల వసతిగృహాలను నిరంతరం పర్యవేక్షించాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులకు సూచించారు. మంగళవారం సంక్షేమభవన్‌లో గురుకుల పాఠశాలల నిర్వహణపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం మెనూ కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. బాలికల గురుకులాల్లో పటిష్ఠ భద్రత ఏర్పాటుచేయాలని.. అందుకు పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టినా ఝడ్ చోంగ్తూ, గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్ దరఖాస్తులకు 23 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హజ్‌యాత్రకు వెళ్లేవారి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును 23 వరకు పొడిగించినట్టు హజ్‌కమిటీ చైర్మన్ మహ్మద్ మసిఉల్లాఖాన్ పేర్కొన్నారు. ముంబైలోని భారత హజ్‌కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నదని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనేటప్పుడు పాస్‌పోర్టు, బ్యాంకు అడ్రస్, చిరునామాల ఆధారాలు, ఫొటోలు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వివరాలకు telanganastatehaj committee.com ను సంప్రదించాలని కోరారు.

## 'క్యాట్'ను ఆశ్రయించిన శిక్షణ ఐపీఎస్ మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరకట్న వేధింపులు, ఇతర ఆరోపణల నేపథ్యంలో సర్వీస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ప్రొబేషనరీ ఐపీఎస్ కేవీ మహేశ్వర్‌రెడ్డి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. మంగళవారం విచారణ చేపట్టిన క్యాట్ మెంబర్ బీవీ సుధాకర్.. ఎందుకు సస్పెండ్ చేశారో వివరాలు తెలియజేయాలని కేంద్ర హోంశాఖను ఆదేశించారు. మహేశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకుని.. ప్రొబేషనరీ వచ్చిన తర్వాత సస్పెండ్ చేసే నిబంధనలేవీ 'ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1969'లో లేవని తెలిపారు.

# 8న కృష్ణా బోర్డు సమావేశం

- విజయవాడలో నిర్వహణకు నిర్ణయం
- రెండు రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండుసార్లు వాయిదాపడిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశాన్ని వచ్చే నెల 8వ తేదీన నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. మంగళవారం రెండు రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం అందించింది. సమావేశాన్ని ఏపీలోని విజయవాడలో నిర్వహించనున్నది. హైదరాబాద్ నుంచి బోర్డు కార్యాలయ తరలింపు కసరత్తు వేగవంతమైన నేపథ్యంలో విజయవాడలో బోర్డు భేటీ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. రెండురాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీ, వినియోగానికి సంబంధించి తాజా నీటి సం వత్సర లెక్కలపై స్పష్టత కోసం గత నెల 27న సమావేశాన్ని నిర్వహించనున్నట్టు సమాచారమివ్వగా.. తమకు వీలు కాదని, డిసెంబర్ మొదటివారంలో నిర్వహించాలని ఏపీ ఈఎన్సీ కోరడంతో డిసెంబరు 3కు వాయిదా వేశారు. ఆ సమావేశాన్నీ వాయిదా వేయాలని రెండురాష్ట్రాల ఈఎన్సీలు కోరగా మూడోసారి భేటీ తేదీని ఖరారు చేశారు. గతంలో హైదరాబాద్‌లో సమావేశం ఉంటుందని తెలుపగా.. ఇప్పుడు మాత్రం విజయవాడకు మార్చారు. బోర్డు కార్యాలయ భవనం ఖరారుకాకపోవడంతో సమావేశాన్ని ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు తెలిసింది.

**నాలుగు అంశాలే ప్రధాన ఎజెండా**

ఈ సమావేశంలో నాలుగు అంశాలు ఎజెండాగా ఉండనున్నట్టు తెలిసింది. తాజా నీటి సంవత్సరానికి సంబంధించి రెండురాష్ట్రాల వాటా, ఇప్పటివరకు వినియోగంపై సుదీర్ఘంగా చర్చించే అవకాశమున్నది. ముఖ్యంగా ఏపీ వాటా కంటే అత్యధికంగా నీటిని వాడుకున్నందున ఆ లెక్కలను ఎలా సరిచేస్తారనేది ఆసక్తికరంగా మారింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు తాగునీటి అవసరాల పంపిణీ, టెలిమెట్రీల ఏర్పాటుపై చర్చించనున్నారు. బోర్డు కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి విజయవాడకు తరలించడంపైనా తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. తెలంగాణ తరపున సాంకేతిక సభ్యుడిగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, ఈఎన్సీ మురళీధర్‌రావు, ఇతర ఇంజినీర్లు సమావేశానికి హాజరుకానున్నారు.



సీఎం ప్రత్యేక నిధి నుంచి మూడు చింతలపల్లికి మంజూరైన ట్రాక్టర్‌పై మంత్రి మల్లారెడ్డి తదితరులు

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి
- సీఎం కేసీఆర్ దత్తత గ్రామాల్లో ట్రాక్టర్లు అందజేత

**మూడుచింతలపల్లి:** సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి చెప్పారు. సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.82 లక్షలతో కొనుగోలుచేసిన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను మంగళవారం మేడ్చల్ జిల్లాలోని సీఎం దత్తత గ్రామాలైన మూడుచింతలపల్లి, లింగాపూర్ తండా, లక్ష్మాపూర్, కేశవరం, నాగిశెట్టిపల్లి గ్రామ పంచాయతీలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మూడుచింతలపల్లి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే వివేకానందా, జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటేశ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు హరివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెట్టెంపాడ్ అప్రోచ్ కెనాల్ నీటి ప్రవాహం పరిశీలిస్తున్న కేఆర్‌ఎంబీ ఇంజనీర్లు

## ఆర్డీఎస్‌పై టెలిమెట్రీ ప్రదేశం పరిశీలన

- సింధనూరులో కేఆర్‌ఎంబీ ఇంజినీర్ల పర్యటన

**అయిజ:** కర్ణాటక నుంచి ఆర్డీఎస్ ప్రాజెక్టుకు కేటాయించిన నీటి వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటుచేసే ప్రదేశాన్ని మంగళవారం కృష్ణా నదీయాజమాన్యబోర్డు (కేఆర్ఎంబీ) ఇంజినీర్ల బృందం పరిశీలించింది. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలం సింధనూరు సమీపంలో పరిశీలించారు. టెలిమెట్రీని బిగించే ప్రదేశం పరికరం భద్రత, రక్షణ వంటి అంశాలపై ఇంజనీర్ల బృందం ఆరా తీసింది. అనంతరం ప్రియదర్శిని జూరాల, నెట్టెంపాడ్ ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీల పనితీరును పరిశీలించింది.

# కాళేశ్వరం ఇంజినీర్లకు ఆక్సిలరేటెడ్ పదోన్నతులు!

- ప్రతిపాదనలకు సీఎం కేసీఆర్ ఆమోదం
- నేడు అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల్లో ఉత్తమసేవలు అందించిన ఐదుగురు ఇంజినీర్లకు వేగవంతమైన (ఆక్సిలరేటెడ్) పదోన్నతులు లభించాయి. అతి తక్కువ సమయంలో ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన వీరికి వేగవంతమైన పదోన్నతులతో తెలంగాణ ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. నీటిపారుదలశాఖ పంపిన ప్రతిపాదనలకు సీఎం కేసీఆర్ మంగళవారం సాయంత్రం ఆమోదం తెలిపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. లక్ష్మిబరాజ్, పంపుహౌజ్‌ల పూర్తిలో కృషిచేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ రమణారెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం రాజు, నంది, గాయత్రీ పంపుహౌజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్, సరస్వతి బరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ యాదగిరి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ రవిచంద్రకు పదోన్నతులు కల్పించాలని ప్రతిపాదించారు. బుధవారం ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నట్టు నీటిపారుదల శాఖవర్గాలు తెలిపాయి.

# ఒకటి కాదు.. 9 హత్యలు!

మొదటిపేజీ తరువాయి...

ఘటనలోనూ మహిళలపై లైంగికదాడి, ఆ తర్వాత హత్య, అనంతరం మృతదేహాన్ని కాల్చేయడమే వీరి నేర ప్రక్రియ అని సమాచారం. నిందితులు వెల్లడించిన వివరాల ఆధారంగా సైబరాబాద్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు ఈ ప్రాంతాల్లో అలాంటి ఘటనలు మొత్తం 15 జరిగినట్లు గుర్తించారు. నిందితులు పాల్పడిన తొమ్మిది హత్యలు ఏమిటన్నవి తేల్చడానికి.. అధికారులు మొత్తం 15 హత్యలకు సంబంధించిన డీఎన్ఏ పరీక్షల నివేదికలను పరిశీలిస్తున్నారు. చాలా కేసుల్లో మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో డీఎన్ఏ పరీక్షల్లో పోలీసులకు దర్యాప్తులో సహకరించేవిధంగా ఫలితాలు రాలేదు. దీంతో పోలీసు అధికారులు శాస్త్రీయ పద్ధతుల్లో నిర్ధారించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. హైవేలకు అనుకొని ఉన్న ప్రాంతాల్లో జరిగిన 15 హత్య కేసుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ 15 కేసుల్లో మృతుల డీఎన్ఏలతో, ఆరిఫ్ అలీ, చెన్నకేశవులు, నవీన్, శివల డీఎన్ఏలను లోతుగా విశ్లేషించనున్నారు. వాటితో పోలితే సైబరాబాద్ పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా చార్జిషీట్‌లో నిందితులు పాల్పడిన హత్యలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో పొందుపరిచే అవకాశం ఉన్నది. పోలీసులు గుర్తించిన 15 మంది మహిళల హత్యకేసుల్లో ఎక్కువశాతం మిస్టరీ వీడలేదని సమాచారం.


తెలంగాణ ప్రభుత్వం

**ప్రాంతీయ అధికారి కార్యాలయం, పంచాయతీరాజ్ రీజియన్, నిజామాబాద్**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 534 to 536/2019-20 తేది: 13-12-2019

పనుల సంఖ్య (3) పని పేరు: దిగువ సంతకందారు పరిధిలోCRR-2019-20- నిజామాబాద్ రూరల్ ప్యాకేజ్ నం.I-(8) నం.లు BT రోడ్డు ఏర్పాటుచేయుట, CRR-2019-20-నిజామాబాద్ రూరల్ ప్యాకేజ్ నం.II- (3) నం.లు BT రోడ్డు ఏర్పాటు చేయుట; CRR-2019-20-నిజామాబాద్ రూరల్ ప్యాకేజ్ నం.III-(3) నం.ల BT రోడ్డు ఏర్పాటు చేయుట. మొత్తం ECV:రూ. 17.26 కోట్లు. టెండరు షెడ్యూళ్ళు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్‌లో 16-12-2019న ఉ. 10.30గం. నుండి అప్‌లోడ్ చేయబడతాయి. టెండర్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది: 23-12-2019న మ. 3.00గం.వరకు. ఇతర వివరాలు మరియు తదుపరి సవరణలను www.tender.telangana.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ నుండి పొందవచ్చును. ఫోన్ నం. 08462-239502.

సం/- ప్రాంతీయ అధికారి PR రీజియన్, నిజామాబాద్

DIPR RO. No. 1986-DP/CL/Advt/1/2019-20, Dt: 17/12/2019

తెలంగాణ ప్రభుత్వము

**SE (R&B) కార్యాలయం, హెడ్ క్వార్టర్స్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

CTN No.34/T5/TS/SEHQC/Sugamya Bharath/2019-20 తేది: 12-12-2019

యాక్సెసిబుల్ ఇండియా క్యాంపెయిన్ (సుగమ్య భారత్ అభియాన్) దిగువ సంతకందారు పరిధిలో ధార్మిక భవన్, యూత్ ట్రైనింగ్ సెంటర్, ఇందిరా క్రాంతిపథం మరియు ITI స్టడీ సెంటర్ & IAS స్టడీ సెంటర్‌లో వికలాంగుల కొరకు అడ్డంకులు లేని విధంగా సదుపాయాల ఏర్పాటు-4వ పిలుపు. మొత్తం ECV: రూ. 2.15 కోట్లు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ, సమయం: 24-12-2019, మ. 3.30 గం.వరకు. టెండర్లు తెరచు తేది: సాంకేతిక బిడ్ 24-12-2019, సా. 4.00 గం.కు. & ధర బిడ్: 28-12-2019న మ. 2.00 గం.కు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in నుండి 17-12-2019న మ. 3.00 గం.నుండి చూడవచ్చును. ఇ-మెయిల్ ఐడి: serb_hqr@yahoo.co.in ఫోన్ నెం. 040-23232762.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్

DIPR R.O.No. 1981 DP/CL/Advt/1/2019-20 తేది: 17-12-2019

**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (రిజిస్టర్డ్)**

DSS భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్-500028, ఫోన్ నం.లు 23391598 మరియు 23399706

టెండరు ప్రకటన

Rc.No. TSW/RDC/2129/2019 తేది: 12-12-2019

TSWR డిగ్రీ కళాశాలల (28)కు సైన్స్ రిఫరెన్స్ పుస్తకాలు (ఇంగ్లీష్ మీడియం) సరఫరా కోసం ప్రచురణ కర్తలు లేదా వారి అధీకృత పుస్తకాల విక్రయదార్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. పుస్తకాల యొక్క జాబితా వెబ్‌సైట్ www.tswreis.in నుండి పొందవచ్చును. నియమ నిబంధనలతోపాటు టెండరు షెడ్యూలును హైదరాబాద్ వద్ద చెల్లింపయ్యేల సెక్రటరీ, TSWREI సొసైటీ, హైదరాబాద్ పేరున A/c పేయీ DD రూపంలో **రూ. 500/- (ఐదు వందల రూపాయలు మాత్రమే)** చెల్లింపుపై సెక్రటరీ కార్యాలయం, TSWREI సొసైటీ, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్-500028 నుండి **18-12-2019 నుండి 24-12-2019** వరకు అన్ని పని రోజుల్లో ఉ. 10.30 గం. నుండి సా. 5.00గం. మధ్య పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు ఫారాల స్వీకరణకు ఆఖరి తేది: **27-12-2019న మ. 2.00గం.వరకు.** (పోస్టుద్వారా పంపిన వాటితో సహా)

సం/- Dr. R.S. ప్రవీణ్ కుమార్, కార్యదర్శి

DIPR RO. No. 544-PP/CL/Advt/1/2019-20, Dt: 17/12/2019

**ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (హౌసింగ్) కార్యాలయం**

**తెలంగాణ హౌసింగ్ బోర్డ్, వినాయక్‌నగర్, నిజామాబాద్ (TS)**

వేలం ప్రకటన

నోటిఫికేషన్ నం. 1138/EE-NZB/KNTR/EM/Auction/2019 తేది: 26-11-2019

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (Hg) కార్యాలయం, తెలంగాణ హౌసింగ్ బోర్డ్, వినాయక్‌నగర్, నిజామాబాద్ డివిజన్‌లో తేది: 30-12-2019న ఉ. 11.00గం.లకు ఏది ఎక్కడ ఎలా ఉందో ఆ విధంగా ప్రాతిపదికన న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ, కంఠేశ్వర్, నిజామాబాద్ వద్ద ఖాళీ ప్లాట్లు/ స్ట్రే పీసుల అమ్మకం కొరకు '' బహిరంగ వేలం'' నిర్వహించాలని తెలంగాణ హౌసింగ్ బోర్డ్ వారు ప్రతిపాదిస్తున్నారు. ఒకవేళ వేలం జరుగు తేది సెలవు రోజు అయినచో తదుపరి పనిరోజున వేలం నిర్వహించబడును.

| క్ర. సం. | ఖాళీ ప్లాట్/ స్ట్రే పీస్ నం. | చ.గ.ల్లో ప్లాట్ ఏరియా | ప్లాట్ యొక్క ప్రదేశం | సర్కారు ధర రూ. | బయానా మొత్తం రూ. | వేలం జరుగు ప్రదేశం తేది & సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | 70LIG/B | 116.67 | H.No.70 LIG సమీపాన | 10,000/- | 1,00,000/- | ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (Hg) కార్యాలయం, తెలంగాణ హౌసింగ్ బోర్డ్, వినాయక్‌నగర్, నిజామాబాద్ వద్ద. తేది: 30-12-2019న ఉ. 11.30గం.నుండి |
| 2 | 70LIG/C | 94.44 | OP No. 70 LIG/B సమీపాన | 10,000/- | 1,00,000/- | |
| 3 | 46 MIG-II/A | 48.58 | H.No.46 MIG-II సమీపాన | 10,000/- | 1,00,000/- | |
| 4 | 229 LIG/A | 85.65 | H.No. 229 LIG వెనుక వైపున | 10,000/- | 1,00,000/- | |
| 5 | 230 LIG/A | 62.50 | H.No. 230 LIG వెనుక వైపున | 10,000/- | 1,00,000/- | |
| 6 | 231 LIG/A | 39.35 | H.No. 231 LIG వెనుక వైపున | 10,000/- | 1,00,000/- | |
| 7 | 231 LIG/B | 112.77 | H.No. 231 LIG సమీపాన | 10,000/- | 1,00,000/- | |
| 8 | 102 MIG-I/A | 120.35 | H.No. 103 MIG-I వెనుక వైపున | 10,000/- | 1,00,000/- | |
| 9 | 95 HIG/A | 89.67 | OP.No. 95 HIG వెనుక వైపున | 10,000/- | 1,00,000/- | |
| 10 | 119 MIG-II/A | 30.00 | H.No. 119 MIG-II సమీపాన | 10,000/- | 1,00,000/- | |

పై వేలం నందు పాల్గొనవలనని భావిస్తున్న ఆసక్తిగల వ్యక్తులు ఏదేని జాతీయ బ్యాంక్‌పై "J.C. & అడిషనల్ డైరెక్టర్, ఇ-సేవ C/o. EE/THB/NZB" పేరున డిమాండ్ డ్రాఫ్ట్ (DD) రూపంలో **రూ. 1,00,000/-ల బయానాను** డిపాజిట్ చెయ్యాలి మరియు దానిని వేలం ప్రారంభమగు తేదీన ఉ. 11.00గం.లలోగా దాఖలు చెయ్యాలి. వేలం యొక్క తదుపరి వివరాలు, నియమనిబంధనల కొరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తెలంగాణ హౌసింగ్ బోర్డ్, నిజామాబాద్ వారిని ఏదేని పనిరోజున కార్యాలయపనివేళల్లో సంప్రదించగలరు మరియు ఫోన్ నం. **(Off) 08462-234844, E.E. (NZB): 9849906422, Dy.EE (NZB): 98499 08840, AEO (NZB): 98499 06435, PRO (Hyd): 98853 58610** మరియు సదరు వివరాలు తెలంగాణ హౌసింగ్ బోర్డ్ వెబ్‌సైట్: **www.aphb.gov.in** నందు కూడా లభిస్తాయి. బయానాను DDలు **వేలం తేదీన ఉ. 9.00 గం. నుండి 11.00గం.వరకు స్వీకరించబడతాయి.**

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (Hg), తెలంగాణ హౌసింగ్ బోర్డ్, నిజామాబాద్

DIPR RO. No. 545-PP/CL/Advt/1/2019-20, Dt: 17/12/2019


# ఏపీకి రాజధానులు మూడు!

మొదటిపేజీ తరువాయి...

వెల్లడించారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ పెడితే పెద్దగా ఖర్చుకాదని.. ఉద్యోగులు పనిచేయడానికి కావాల్సిన సదుపాయాలన్నీ అక్కడ ఉన్నాయని గుర్తుచేశారు. ఒక మెట్రో రైల్ వేస్తే సరిపోతుందని జగన్ చెప్పారు. ఇటువంటి ఆలోచనలకోసం నిపుణులతో వేసిన కమిటీ సుదీర్ఘమైన నివేదికను తయారుచేస్తున్నదని, వారంపదిరోజుల్లో నివేదిక రానున్నదని జగన్ తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్రానికి ఉన్న ఆర్థిక వనరులతో ఏవిధంగా చేయాలో ఆలోచించి నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. కాగా, దీనిపై ప్రతిపక్షనేత చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కావాలనే అమరావతి రాజధానిని చంపేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతిపై జగన్‌కు ఎందుకు కోపమని ప్రశ్నించారు. అమరావతిపై జగన్ మైండ్‌గేమ్ ఆడుతున్నారని ఆరోపించారు.

**రాజధానిపేరుతో దోచుకున్నారు: బొత్స**

రాష్ట్ర విభజన కంటే.. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన గత ఐదేండ్లలోనే ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని.. రాజధానిపేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. రాజధాని నిర్మాణంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ.. అమరావతిపై చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. సింగపూర్ ప్రతినిధులు తమతో సమావేశమయ్యారని, రాజధాని నిర్మిస్తామంటే తమకు అభ్యంతరం లేదని.. అయితే సంపద ఎలా సృష్టిస్తారో చెప్పాలని అడిగితే ప్రజెంటేషన్ ఇవ్వకుండా వెళ్లిపోయారని చెప్పారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీకి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపనచేస్తే తానే కట్టానని చంద్రబాబు గొప్పలు చెప్పుకొంటున్నారని ఎద్దేవాచేశారు. హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్ ఎవరు కట్టారో అందరికీ తెలుసన్నారు. స్విస్‌చాలెంజ్‌పై ప్రజెంటేషన్ ఇవ్వమంటే చంద్రబాబు ఇవ్వలేదని తెలిపారు.

**బాబు బినామీల ఇన్‌సైడర్ ట్రేడింగ్!**

అమరావతి రాజధాని ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నేతలు.. వారి బంధువులు 4070 ఎకరాలు కొన్నారని ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏపీ అసెంబ్లీలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. టీడీపీ నేతలు ఎవరెవరు ఎంతభూములు కొన్నారో చూడాలంటూ జాబితాను బయటపెట్టారు. కంతేరులో హెరిటేజ్ ఫుడ్స్ కం పెనీ 14.22 ఎకరాలు కొన్నదని చెప్పారు. మాజీ మంత్రి నారాయణ బంధువుల పేరు తో 55.27 ఎకరాలు, ప్రత్తిపాటి పుల్లారావు తన బంధువుల పేరుతో 38 ఎకరాలు, రావెల కిశోర్‌బాబు బంధువుల పేరుతో 40.85 ఎకరాలు, పయ్యావుల కేశవ్ తన బంధువుల పేరుతో 15.30 ఎకరాలు, రాయపాటి సాంబశివరావు 55.27 ఎకరా లు, కోడెల శివప్రసాదరావు బంధువుల పేరుతో 17.13 ఎకరాలు, సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ వియ్యంకుడికి చెందిన గీతం యూనివర్సిటీకి జగ్గయ్యపేటలో 499 ఎకరాలు, ధూళిపాళ్ల నరేంద్ర బంధువుల పేరుతో 19.50 ఎకరాలు, లింగమనేని రమేశ్ బంధువుల పేరుతో 351 ఎకరాలు కొన్నారని బుగ్గన తెలిపారు. వీరితోపాటు పరిటాల సునీత, కొమ్మలపాటి శ్రీధర్, జీవీఎస్ ఆంజనేయులు, పల్లె రఘునాథరెడ్డి, పుట్టా మహేశ్‌కు కూడా భూములున్నాయని పేర్కొన్నారు. 'చంద్రబాబు చేసింది కచ్చితంగా ఇన్‌సైడర్ ట్రేడింగే. రింగ్ రోడ్డు కూడా వారి భూములను ఆనుకొని పోయేటట్టు చేశారు. రైతులను బెదిరించి అసైన్డ్ భూములను లాక్కున్నారు. లేని లంక భూములను ఉన్నట్టు సృష్టించి దోపిడీచేశారు. రియల్ వ్యాపారంకోసమే చంద్రబాబు సింగపూర్ ప్రైవేట్ కంపెనీలను తీసుకొచ్చారు. రిజర్వు బ్యాంకుకైతే ఎకరాకు రూ.4 కోట్లా!.. తన అనుచరులకైతే ఎకరాకు రూ.20 లక్షలా.. ఐదేండ్లలో విజయవాడలో ఫ్లైఓవర్ కట్టలేకపోయారు. అప్పు లు తీసుకొచ్చి పండుగలు చేసుకున్నారు. భూములు అమ్మి సంపద సృష్టిస్తారట' అంటూ మంత్రి బుగ్గన తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాజధానిపై చర్చ సందర్భంగా పోడియంవద్దకు దూసుకెళ్లి నిరసన వ్యక్తంచేసిన 9మంది టీడీపీ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్‌చేశారు. చర్చ అనంతరం ఏపీ అసెంబ్లీ నిరవధికంగా వాయిదాపడింది.

## పీఆర్ ఇంజినీర్లకు విభాగాల కేటాయింపు

- ఉత్తర్వులు జారీచేసిన పంచాయతీరాజ్‌శాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్‌శాఖలో ఈఎన్సీ, సీఈలకు విభాగాలను కేటాయిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈఎన్సీ ఎం సత్యనారాయణరెడ్డికి అడ్మినిస్ట్రేటివ్, సీఆర్ఆర్, ఎమ్మార్ఆర్, ఎస్డీఎఫ్, ఎస్టీఎస్డీఎఫ్, రాష్ట్ర పరిధిలోని రోడ్లు, ప్రణాళిక విభాగం, క్లాస్-1, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించారు. సీఈ ఎం రవీంద్రకు విజిలెన్స్, నాణ్యత నియంత్రణ, పీఎంజీఎస్‌వై, గ్రామీణ ఉపాధి హామీ పథకం, క్లాస్-2 కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ల వ్యవహారాలను కేటాయించారు. సీఈ ఎం రాజశేఖర్‌రెడ్డికి సెంట్రల్ రోడ్స్ (సీఎస్ఎస్), రాష్ట్ర ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం, హరితహారం, రోడ్‌సేఫ్టీ విభాగాలు ఇచ్చారు. సీఈ మృత్యుంజయంకు నాబార్డ్, ఉపాధి హామీ సాంకేతిక విభాగం, సీఎస్టీ, రోడ్‌కటింగ్, ఎన్జీటీ, ఎంపీల్యాడ్స్, ఎస్సార్డీపీ విభాగాలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి కోనేరులో పుణ్యస్నానాలు చేసి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. స్వామి వారిని దాదాపు 40 వేల మంది భక్తులు దర్శించుకోగా, రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు. - మల్యాల

పారిశ్రామికవేత్త ఇంట్లో

# ఐటీ దాడులు

ఆదిలాబాద్, హైదరాబాద్‌లో
ఏకకాలంలో సోదాలు

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రఘునాథ్ మిత్తల్ ఇంటితోపాటు ఆయనకు చెందిన ఇండ్రస్ట్రీలో మంగళవారం ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆదిలాబాద్‌లో నాలుగు చోట్ల, హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏకకాలంలో దాడులు చేశారు. వ్యాపార లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు సోదాలు కొనసాగాయి. ఈ సోదాల్లో లెక్కతేలని సమారు రూ.200 కోట్ల ఆస్తులను అధికారులు గుర్తించినట్టు సమాచారం. కాగా, రఘునాథ్ మిత్తల్‌కు ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోనూ వ్యాపారాలు, ఆస్తులు ఉన్నట్టు తెలిసింది.



మహిళలపై లైంగిక దాడులను నిరసిస్తూ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రదర్శనగా వెళ్లి పాత బస్టాండు వద్ద భారీ మానవహారం నిర్మించి, లైంగిక దాడుల్లో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. లైంగికదాడి ఘటనల్లో నెల రోజుల్లోపే మరణ శిక్షలు అమలు చేసేలా కేంద్రం చట్టంలో మార్పులు చేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. - మెట్‌పల్లి టౌన్





భూపాలపల్లిలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే గండ్ర, జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం

- ప్రతిపక్షాల ప్రగల్భాలు చెల్లవు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అవుతున్నదని, నాడు విమర్శించిన ప్రతిపక్షాలు నేడు ముఖం చాటేసే విధంగా గోదావరి జలాలు గలగల పారుతున్నాయని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. స్వరాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ప్రజలకు ఏమి కావాలో గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని చెప్పారు. అసాధ్యమని ప్రతిపక్షాలు వాదించిన కాళేశ్వరం ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి ప్రజలకు దాని ఫలి తాలు అందేలా చేశారన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయాలతో వ్యవసాయాన్ని నమ్ముకున్న కార్మిక, కర్షకులకు గుర్తింపు, గౌరవం పెరిగిందన్నారు. పేదలు, వృద్ధులకు, అర్హులైన వారికి ఆసరా పెన్షన్లు అందించి ఆపద్బాంధవుడిగా నిలిచారని చెప్పారు. జనవరి 2 నుంచి 11 వరకు పల్లె ప్రగతి రెండో దశ కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి ఒక్కరూ సవాల్‌గా తీసుకొని విజయవంతం చేయాలన్నారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ప్రగతి సాధించిన గ్రామాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. అనంతరం గ్రామాలకు మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి, పెద్దపల్లి జెడ్పీ చైర్‌పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారార్ @ 23 టీఎంసీలు

- కొనసాగుతున్న ఎత్తిపోతలు
- లక్ష్మి పంప్‌హౌస్‌లో నడుస్తున్న మూడు మోటర్లు

**రామడుగు/బోయినపల్లి:**

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి జలాశయం నుంచి జంట సొరంగాల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌస్‌కు చేరుకుంటుండగా, ఇక్కడి 4, 5, 6వ మోటర్లు ఎత్తిపోస్తున్నాయి. అక్కడి నుంచి నంది రిజర్వాయర్‌కు జలాలు చేరుతుండగా, ఈ జలాశయం గేట్లు ఎత్తడంతో జంటసొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడి 1, 6, 7వ పంపు లు ఎత్తిపోస్తుండటంతో గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు కాళేశ్వర జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్‌లో పంపుల ద్వారా గ్రావిటీకాల్వలోకి వస్తున్న జలాలు

**దిగువకు 9,450 క్యూసెక్కుల నీరు**

శ్రీరాజరాజేశ్వర జలాశయం పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు 23.085 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. రివర్స్ స్లూయిస్ (తూముల) ద్వారా దిగువన గల ఎల్‌ఎండీకి 9,450 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. వరద కాల్వ ద్వారా కూడా 9,450 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు ఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. కాగా ఈనెల 5వ తేదీ నుంచి మంగళవారం రాత్రి వరకు 7.103 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్టు వెల్లడించారు.

**మూడు మోటర్ల ద్వారా తరలిన జలాలు**

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో మంగళవారం 5, 7, 11వ మోటర్లు నడిపించారు. ఇక్కడి నుంచి సరస్వతి బరాజ్‌కు 6,780 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఈ నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలివెళ్తున్నది. ప్రస్తుతం సరస్వతి బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## 9999 @ రూ.2.25 లక్షలు

ఫ్యాన్సీ నంబర్‌ను దక్కించుకున్న జగిత్యాలవాసి

**జగిత్యాల, నమస్తే తెలంగాణ:** జగిత్యాల రవాణాశాఖ కార్యాలయంలో టీఎస్ 21 ఈ 9999 నంబర్ కోసం మంగళవారం జరిగిన వేలంలో ఓ వ్యక్తి రూ.2.25 లక్షలకు దక్కించుకున్నారు. ఈ నంబర్ కోసం ఇద్దరు పోటీపడగా జిల్లా కేంద్రానికి చెందిన చెన్నమనేని రాంబాబు రూ. 2.25 లక్షలకు సొంతం చేసుకున్నారు.

## తండ్రిని కడతేర్చిన తనయుడు

**వీపనగండ్ల:** తండ్రినే కడతేర్చిన ఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్లలో సోమవారం రాత్రి జరిగిం ది. పుల్గర్‌చర్లకు చెందిన చిన్నకిష్టయ్య(86) పేరిట ఉన్న 20 గుంటల భూమిని తన పేరు మీదకు మార్చాలని కుమారుడు మద్దిలేటి తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో తండ్రిని ఈడ్చుకుంటూ వెళ్లి తలను రాయికి బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన చిన్నకిష్టయ్యను దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# కారు-బైక్ ఢీ: ఇద్దరు యువకుల దుర్మరణం

మృతులిద్దరూ కానిస్టేబుల్‌గా ఎంపికైన వారే..

**ఆత్మకూర్.ఎస్:** కారు-బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా మరో యువకుడు గాయపడిన ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. మృతులిద్దరూ కానిస్టేబుళ్లుగా ఎంపికవ్వగా వారం రోజుల్లో శిక్షణకు వెళ్లాల్సి ఉన్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం తాళ్లసింగారానికి చెందిన జటంగి వెంకన్న(23), పంతంగి నరేశ్(22), కుసుకుంట్ల జగదీశ్ బైక్‌పై తాళ్లసింగారం నుంచి సూర్యాపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నెమ్మికల్ శివారులో ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వెంకన్న, నరేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. జగదీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సూర్యాపేట దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన వెంకన్న, నరేశ్

**ఇద్దరూ కానిస్టేబుల్‌గా ఎంపికై..**

వెంకన్న, నరేశ్ ఇద్దరూ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాగా ఈ నెల 24న శిక్షణకు వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వెంకన్న రెండు నెలల క్రితమే రైల్వేలో ఉద్యోగంలో చేరగా కానిస్టేబుల్‌కు ఎంపిక కావడంతో దానికి రాజీనామా చేశాడు. ఇతను తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. కాగా నరేశ్‌కు ఏడాదిన్నర క్రితమే వివాహం కాగా నెలల వయస్సు గల కూతురు ఉన్నది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో రిటైర్డు ఉద్యోగిని సన్మానిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

## విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల

**హుజూరాబాద్, నమస్తేతెలంగాణ:** గత ప్రభుత్వాలు విస్మరించిన విద్యా, వైద్యానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జాతీయ పెన్షనర్స్ డే, జమ్మికుంటలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవంతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల కోసం ఏటా వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, రఘోత్తంరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, కుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా పెన్షనర్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

- మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** ప్రజాసేవ చేసేందుకు టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, అందుకోసం కార్యకర్తలు కష్టపడి పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో రూరల్ మండల కార్యకర్తలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశం గర్వించేలా తెలంగాణ అభివృద్ధి చెందుతున్నదన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సర్కార్ పలు సంక్షేమ పథకాలకు అంకుర్పారణ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పదవులను ఆశించి, ఫలితాలను ఆశించి పార్టీలో ఉండకూడదని, పార్టీ శ్రేయస్సు కోసం శ్రమించే ప్రతి కార్యకర్తకు తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని స్పష్టంచేశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు జరిగిన పెన్షనర్ల దినోత్సవంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. స్థానిక టీఎన్జీవోఎస్ భవన్‌లో ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు.

## విద్యార్థినిపై లైంగిక వేధింపులు

ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** ఇంటర్ విద్యార్థినిని ప్రిన్సిపాల్ లైంగికంగా వేధించిన ఘటనపై ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. మంగళవారం కళాశాలలో విచారించిన అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు మీడియాకు వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ విద్యార్థిని స్థానికంగా గల ఓ ఉర్దూ మీడియం కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నది. కళాశాల ప్రిన్సిపాల్ రఫీ కొంతకాలంగా విద్యార్థినిని వేధిస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక సదరు విద్యార్థిని కళాశాలకు వెళ్లడం మానేసింది. తల్లిదండ్రులు ఆరాతీయగా కళాశాల ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడని తెలిపింది. ఈ విషయమై విద్యార్థిని తండ్రి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రిన్సిపాల్ రఫీపై పోక్సో కేసు నమోదు చేశారు.



నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం చేసిన టీఆర్‌ఎస్ నాయకులు

## ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలి

- పసుపు రైతుల డిమాండ్
- ఆర్మూరు, మాక్లూర్‌లో అర్వింద్ దిష్టిబొమ్మల దహనం

**ఆర్మూర్, నమస్తేతెలంగాణ/మాక్లూర్:** పసుపు బోర్డు విషయంలో తమను మోసగించిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కూడా జిల్లాలో పసుపు రైతులు ఆందోళనకు దిగారు. ఆర్మూరులోని పెర్కిట్ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు, రైతులు ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల సమయంలో పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్, పసుపు పంట చేతికొచ్చే సమయానికి బోర్డు కంటే మెరుగైన పథకాలు తీసుకొస్తానని కల్లబొల్లి మాటలు చెబుతున్నారంటూ మండిపడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేదంటే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా మాక్లూర్‌లోని మండల కార్యాలయాల సముదాయం ఎదుట ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను టీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఎంపీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ భూనిర్వాసితులకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ మంగళ వారం కలెక్టరేట్‌లో చెక్కులను అందజేశారు. వెంకటాద్రి రిజర్వాయర్ పరిధిలోని తిమ్మాజిపేట మండలం జిగుట్టతండా, బిజినేపల్లి మండలం అంకన్‌పల్లి భూనిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ కింద మంజూరైన రూ.9.98 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. - నాగర్‌కర్నూల్ టౌన్





రంగారెడ్డి జిల్లా కడ్తాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

## సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

- రూ.40 కోట్లతో ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

**ఆమనగల్లు, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సరైన బోధన, వసతి సౌకర్యాలు కల్పించి ప్రపంచంతో పోటీపడేలా వారిని తీర్చిదిద్దుతున్నామని విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కేజీ నుంచి పీజీ వరకు ఆంగ్ల మాధ్యమాన్ని అందించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే సీఎం కేసీఆర్ సంకల్పమన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ముందుగా అన్మాస్‌పల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కడ్తాల మండల కేంద్రంలో మానవ వనరుల రిసోర్స్ కేంద్రం, ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్, అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టపరుస్తున్నామన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు, వారికి సైన్స్ పట్ల ఆసక్తిని కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.40 కోట్లతో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## భార్య కళ్లెదుటే ప్రాణాలు వదిలిన భర్త

కాపాడే ప్రయత్నం చేసినా దక్కని ప్రాణం

**కొడిమ్యాల :** భర్త ప్రాణాలు కళ్ల ముందే పోతున్నాయని తెలిసి ఆ భార్య కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలకొండకు చెందిన ఆలకుంట గంగరాజు (31) బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేశాడు. ఇతనికి భార్య అశ్విని, కొడుకు విరాజ్ ఉన్నాడు. లా ప్రాక్టీస్ చేసేందుకు డబ్బు లేక కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నాడు. కుటుంబంతో సహా జగిత్యాలకు మకాం మార్చి అక్కడ ప్రాక్టీస్ చేద్దామనుకుంటున్నట్టు సోమవారం సాయంత్రం భార్యతో చెప్పి బయటికి వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటి ముందు వరండాలో శబ్దం రావడంతో అశ్విని బయటికి వచ్చి చూసింది. భర్త తాడుతో ఉరి వేసుకొని విలవిల్లాడుతుండగా, అతడిని కాపాడే ప్రయత్నం చేసింది. బరువు ఎక్కువ ఉండడంతో ఆమెకు సాధ్యం కాలేదు. వెంటనే సాయం చేయాలని కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి చూసేసరికి గంగరాజు మృతి చెందాడు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో ఆమె రోదనలు మిన్నంటాయి. అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| వికారాబాద్ | 12.9 | 33.3 |
| మెదక్ | 13.9 | 32.4 |
| నిర్మల్ | 16.0 | 27.0 |
| రంగారెడ్డి | 16.0 | 29.0 |
| కామారెడ్డి | 16.0 | 29.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 16.0 | 30.0 |
| మంచిర్యాల | 16.1 | 31.9 |
| సంగారెడ్డి | 16.3 | 29.2 |
| నల్లగొండ | 16.4 | 29.4 |
| కరీంనగర్ | 16.4 | 32.2 |
| వనపర్తి | 16.7 | 32.2 |
| వరంగల్ రూరల్ | 17.0 | 28.0 |
| సిద్దిపేట | 17.0 | 29.0 |
| యాదాద్రి భువనగిరి | 17.0 | 29.0 |
| రాజన్న సిరిసిల్ల | 17.0 | 29.0 |
| ములుగు | 17.0 | 29.0 |
| జగిత్యాల | 17.0 | 30.0 |
| నాగర్‌కర్నూల్ | 17.0 | 30.0 |
| పెద్దపల్లి | 17.0 | 30.0 |
| జనగామ | 17.1 | 28.0 |
| ఆదిలాబాద్ | 17.7 | 28.3 |
| వరంగల్ అర్బన్ | 17.5 | 29.5 |
| జయశంకర్ భూపాలపల్లి | 18.0 | 29.0 |
| మహబూబాబాద్ | 18.0 | 30.0 |
| సూర్యాపేట | 18.0 | 30.0 |
| జోగులాంబ గద్వాల | 18.0 | 31.0 |
| నిజామాబాద్ | 18.4 | 30.9 |
| హైదరాబాద్ | 19.0 | 28.0 |
| మేడ్చల్ | 19.0 | 28.0 |
| మహబూబ్‌నగర్ | 19.0 | 28.9 |
| నారాయణపేట | 19.0 | 28.9 |
| ఖమ్మం | 19.0 | 31.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 19.0 | 32.0 |



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి ఆర్‌ఆండ్‌ఆర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట కలెక్టర్లు కృష్ణభాస్కర్, వెంకట్రామ్‌రెడ్డి

## అన్నపూర్ణ రిజర్వాయర్ పనులు పూర్తి

త్వరలో ఆవాసాలను ఖాళీ చేయాలి
రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట కలెక్టర్లు

**ఇల్లంతకుంట:** కాళేశ్వరం పదోప్యాకేజీలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో నిర్మిస్తున్న అన్నపూర్ణ (అనంతగిరి) రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయని, త్వరలో నీటి విడుదల చేయనున్నామని రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట కలెక్టర్లు కృష్ణభాస్కర్, వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. ముంపు బాధితులు త్వరగా తమ నివాసాలను ఖాళీ చేసి సహకరించాలని కోరారు. రిజర్వాయర్ ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పనులను మంగళవారం వారు పరిశీలించారు. మౌలిక వసతుల పనుల పర్యవేక్షణకు ఒక్కో డీఈని నియమించాలని సూచించారు.

## తెలంగాణ అన్నింట్లో ముందుండాలి: మంత్రి ఈటల

**మానకొండూర్ రూరల్:** జ్ఞాన సంపదలో ముందుండేలా విద్యార్థులు కష్టపడాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ (బాలికలు) పోటీల ప్రారంభోత్సవం కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, రఘోత్తమ్‌రెడ్డి, జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి జ్యోతిని వెలిగించి, క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో కొత్త రాష్ట్రమైన తెలంగాణ అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత దాదాపు 750 మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశామని, తొలి రోజు అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1000 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్లా జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు సిద్ధం వేణు, జడ్పీటీసీ శేఖర్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ అర్చన, జేడీ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.





## ప్రాక్టీస్‌లో బుమ్రా బిజీబిజీ

**విశాఖపట్నం:** టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ముందు వెన్ను నొప్పితో జట్టుకు దూరమైన బుమ్రా.. విశాఖ నెట్స్‌లో కట్టుదిట్టమైన బంతులతో ఆకట్టుకున్నాడు. కొంతకాలంగా ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టిన యార్కర్ కింగ్.. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ముందు విశాఖపట్నంలో జట్టు సభ్యులతో కలిసి నెట్స్‌లో సాధన చేశాడు. న్యూజిలాండ్ పర్యటనకు జట్టులోకి రానున్న బుమ్రా ప్రాక్టీస్ సందర్భంగా మనీశ్ పాండే, మయాంక్ అగర్వాల్, రిషబ్ పంత్‌ను తన బంతులతో ఇబ్బంది పెట్టాడు. ఐచ్ఛిక సాధన (ఆప్షనల్ ప్రాక్టీస్) కావడంతో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, లోకేశ్ రాహుల్ మంగళవారం మైదానానికి రాలేదు. మరోవైపు ఎనిమిది నెలల నిషేధం పూర్తిచేసుకున్న యువ ఓపెనర్ పృథ్వీ షా.. జట్టు ట్రైనర్ నిక్ వెబ్ పర్యవేక్షణలో సాధన చేశాడు. కొత్త పాలసీ ప్రకారం పునరాగమనం చేసే ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను ముందుగా నెట్స్‌లో పరీక్షిస్తున్నారు. ఇందులో బుమ్రా ఉత్తీర్ణత సాధించినట్లే అనిపిస్తున్నది. మంగళవారం టీమ్ ఇండియా హెడ్‌కోచ్ రవిశాస్త్రి, జాతీయ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఈ ఇద్దరి ఆటతీరును పరిశీలించారు. పృథ్వీ షా మాత్రం కోహ్లీ కోరుకుంటున్న ఫిట్‌నెస్ ప్రమాణాలకు కాస్త దూరంలోనే ఉన్నట్లు కనిపిస్తున్నది.

# విశాఖ ఎవరి వశమో!

## నేడు భారత్, వెస్టిండీస్ రెండో వన్డే

### సత్తాచాటాలని టీమ్‌ఇండియా.. సిరీస్ చేజిక్కించుకోవాలని కరీబియన్లు

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

**ఐపీఎల్ వేలానికి సరిగ్గా ఒక్క రోజు ముందు.. పరుగుల వరద పారే విశాఖపట్నంలో వెస్టిండీస్, భారత్ రెండో వన్డే బరిలో దిగనున్నాయి. సొంతగడ్డపై సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడ్డ టీమ్‌ఇండియా.. చెపాక్ విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న వెస్టిండీస్‌ను నిలువరించాలని కృతనిశ్చయంతో ఉంది. సాగర తీరంలో ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పరుగుల వరద పారడంతో ఈసారి కూడా అదే సీన్ రిపీట్ అయ్యే అవకాశాలున్నాయి. మరి అచ్చొచ్చిన స్టేడియంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇరగదీస్తారో.. లేక గత మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న షై హోప్, షిమ్రాన్ హెట్‌మైర్ చెలరేగుతారో వేచి చూడాలి.**


హోప్
పంత్

**విశాఖపట్నం:** తొలి వన్డేలో పరాజయం పాలైన టీమ్‌ఇండియా.. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి సిరీస్ సమం చేయాలని భావిస్తుంటే.. చేతికి చిక్కిన చక్కటి చాన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కరీబియన్లు కసిమీదున్నారు. గత పదిహేనేండ్లలో సొంతగడ్డపై వరుసగా రెండు వన్డే సిరీస్‌లు కోల్పోని భారత్.. ప్రస్తుతం ఆ ప్రమాదపు అంచున నిలిచింది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా చేతిలో సిరీస్ కోల్పోయిన విరాట్ సేన.. మరో మ్యాచ్ ఓడితే వరుసగా రెండు సిరీస్‌లు కోల్పోయినట్లవుతుంది. ఇలాంటి కీలక దశలో బుధవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ మైదానంలో విండీస్‌తో తలపడనున్న టీమ్‌ఇండియా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. తొలి వన్డేలో టాపార్డర్ వైఫల్యానికి తోడు బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో పరాజయం పాలైన కోహ్లీ అండ్ కో.. ఆ తప్పిదాలను సరిచేసుకొని విజృంభించేందుకు సిద్ధమైంది. చెపాక్‌లో స్పిన్ త్రయం ప్రత్యర్థిని తిప్పలు పెట్టలేకపోవడంతో.. ఈ సారి 'కుల్చా' జోడీని పరీక్షించాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తున్నది. మరోవైపు గాయం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన ఓపెనర్ లూయిస్ జట్టులో చేరే అవకాశాలుండటంతో వెస్టిండీస్ మరింత ఆత్మ విశ్వాసంతో కనిపిస్తున్నది. విశాఖలో ఆడిన ఐదు మ్యాచ్‌లో 139 సగటుతో 556 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ మరోసారి రెచ్చిపోవాలని భారత అభిమానులు ఆశిస్తుంటే.. గతేడాది ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో విశ్వరూపం ప్రదర్శించిన హోప్, హెట్‌మైర్ మరోసారి హిట్టవ్వాలని విండీస్ భావిస్తున్నది.

**ముగ్గురు మొనగాళ్లు మెరిస్తే..**

బ్యాటింగ్ పరంగా చూసుకుంటే భారత్‌కు పెద్దగా ఇబ్బందులు లేకపోయినా.. గత మ్యాచ్‌లో 'ముగ్గురు మొనగాళ్లు'ఎక్కువ సేపు నిలువలేకపోవడమే ఓటమిని తెచ్చిపెట్టింది. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీకి విశాఖలో చక్కటి రికార్డు ఉండటం సానుకూలాంశమైతే.. రోహిత్ శర్మకు కూడా సాగర తీరం హోమ్ గ్రౌండ్ లాంటిదే. చెన్నైలో ఆకట్టుకోలేకపోయిన ఈ ఇద్దరు ఎదురు నిలిస్తే.. ప్రత్యర్థికి తిప్పలు తప్పవు. క్లాసిక్ బ్యాట్స్‌మన్ లోకేశ్ రాహుల్ కూడా భారీ ఇన్నింగ్స్ ఆడితే భారత్‌కు తిరుగుండదు. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ కుదురుకోవడం టీమ్‌ఇండియాకు పెద్ద ఊరట. ఒత్తిడిలో చక్కటి ఇన్నింగ్స్‌తో అలరించిన పంత్.. అదే జోరు కొనసాగించాలని జట్టు యాజమాన్యం ఆశిస్తున్నది. చివర్లో శివం దూబే, కేదార్ జాదవ్ కూడా బ్యాట్‌లకు పనిచెప్పితే భారీ స్కోరు ఖాయమే.

**'కుల్చా'జోడీ ఖాయమే(నా)!**

చెపాక్‌లో మంచి స్కోరే చేసినా.. బౌలర్ల వైఫల్యం కారణంగానే మ్యాచ్ చేజారడంతో టీమ్ మేనేజ్‌మెంట్ దానిపై దృష్టి పెట్టింది. ప్రభావం చూపలేకపోయిన స్పిన్ త్రయానికి బదులు 'కుల్చా'జోడీని బరిలో దింపాలని యోచిస్తున్నది. ఇదే జరిగితే శివం దూబే, రవీంద్ర జడేజాల్లో ఒకరు బెంచ్‌కు పరిమితం కాక తప్పకపోవచ్చు. ఇక్కడ జరిగిన గత ఆరు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు కేవలం ఒక్క మ్యాచ్‌లోనే గెలిచిన నేపథ్యంలో టాస్ కూడా కీలక పాత్ర పోషించే అవకాశాలున్నాయి. దీపక్ చాహర్ ఫర్వాలేదనిపిస్తున్నా.. షమీ తెల్లబంతికి టర్న్ కావాల్సిన అవసరముంది. కుల్దీప్, జడేజా పరుగులు తక్కువే ఇచ్చినా.. వికెట్లు పడగొట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఒక అరంగేట్రం ఆటగాడు దూబే బ్యాటింగ్‌లో 9 పరుగులే చేసి బౌలింగ్‌లో దాదాపు 9 రన్‌రేట్‌తో పరుగులు సమర్పించుకోవడం కలవర పెడుతున్నది.

**ఐపీఎల్ ముఖ్యం కాదంటూనే..**

విశ్వ వ్యాప్తంగా లీగ్‌ల్లో దుమ్మురేపే కరీబియన్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలానికి ఒక్క రోజు ముందు జరుగనున్న మ్యాచ్‌లో అదరగొట్టాలని చూడటం యాదృచ్ఛికమే. మా లక్ష్యం అది కాదని షై హోప్ అంటున్నా.. కొందరు విండీస్ ఆటగాళ్లు వేలంపై ఓ కన్నేసి ఉన్నారనేది వాస్తవం. పొలార్డ్ నాయకత్వంలో కొత్తగా కనిపిస్తున్న వెస్టిండీస్ జట్టు తొలి మ్యాచ్ జోరును ఇక్కడ కూడా కొనసాగించాలని భావిస్తున్నది. పిచ్ బ్యాటింగ్‌కు సహకరించడం కూడా వారికి కలిసిరానుంది. చెన్నైలో సెంచరీలతో కదం తొక్కిన హెట్‌మైర్, హోప్‌లకు ఈ పిచ్‌పై చక్కటి రికార్డు ఉంది. ఇరుజట్ల మధ్య చివరగా ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో వీరిద్దరూ చెలరేగి ఆడిన విషయం తెలిసిందే.

**1** విశాఖలో జరిగిన గత ఆరు వన్డేల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు కేవలం ఒక్కసారి మాత్రమే గెలిచింది.

**556** ఈ వేదికపై విరాట్ చేసిన పరుగులు ఇందులో మూడు సెంచరీలు రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

### పిచ్, వాతవరణం

గత మ్యాచ్‌లను పరిశీలిస్తే విశాఖ వికెట్ బ్యాటింగ్‌కు స్వర్గధామమనే విషయం స్పష్టమవుతున్నది. ఈసారి కూడా అందుకు భిన్నంగా ఉండకపోవచ్చు. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఉంటుంది. మ్యాచ్‌కు వరుణుడి ముప్పులేదు.

### ఆ మ్యాచ్ గుర్తుందా..!

అక్టోబర్ 24, 2018. వైజాగ్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన రసవత్తర మ్యాచ్ అనేక మలుపులు తిరుగుతూ చివరకు 'టై'గా ముగిసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖలోని ఏసీఏ-వీడీసీఏలో జరిగిన రెండో వన్డేలో టాస్ గెలిచిన టీమ్‌ఇండియా మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లీ (129 బంతుల్లో 157 నాటౌట్; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ సెంచరీకి.. తెలుగు ఆటగాడు అంబటి తిరుపతి రాయుడు (80 బంతుల్లో 73; 8 ఫోర్లు) సహకారం తోడవడంతో నిర్ణీత ఓవర్లలో భారత్ 6 వికెట్ల నష్టానికి 321 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ మ్యాచ్‌లోనే కోహ్లీ వన్డేల్లో 10 వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. అనంతరం లక్ష్యఛేదనలో విండీస్ కూడా దీటుగా బదులిచ్చింది. షై హోప్ (134 బంతుల్లో 123 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీకి హెట్‌మైర్ (64 బంతుల్లో 94; 4 ఫోర్లు, 7 సిక్సర్లు) సునామీ ఇన్నింగ్స్ తోడవడంతో ఒక దశలో విండీస్ అలవోకగా గెలిచేలా కనిపించింది. అయితే వెస్టిండీస్ విజయానికి చివరి 18 బంతుల్లో 22 పరుగులు చేయాల్సిన దశలో మనవాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు. 48వ ఓవర్‌లో చాహల్ కేవలం 2 పరుగులే ఇచ్చి రనౌట్ రూపంలో ఓ వికెట్ తీస్తే.. 49వ ఓవర్‌లో షమీ 6 పరుగులు ఇచ్చుకున్నాడు. దీంతో సమీకరణం 6 బంతుల్లో 14కు చేరింది. చివరి ఓవర్ వేసిన ఉమేశ్ యాదవ్ ఓ వికెట్ తీసినా భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. చివరి బంతికి ఐదు పరుగులు చేయాల్సిన దశలో హోప్ పాయింట్ దిశలో ఫోర్ కొట్టి మ్యాచ్‌ను 'టై'చేశాడు.

### సాగర తీరంలో కోహ్లీ సూపర్

విశాఖలో ఆడిన ఐదు వన్డేల్లో విరాట్ కోహ్లీ వరుసగా 118, 117, 99, 65, 157 నాటౌట్ పరుగులు చేశాడు. ఇరుజట్ల మధ్య ఇక్కడ జరిగిన చివరి మ్యాచ్‌లోనే భారత కెప్టెన్ అంతర్జాతీయ వన్డేల్లో 10 వేల పరుగుల మైలురాయిని దాటాడు. దీంతో అతడికి ఈ స్టేడియంతో చక్కటి అనుబంధం ఏర్పడింది.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లీ (కెప్టెన్), రోహిత్, రాహుల్, అయ్యర్, పంత్, జాదవ్, దూబే, జడేజా/ చాహల్, దీపక్, కుల్దీప్, షమీ.
**వెస్టిండీస్:** పొలార్డ్ (కెప్టెన్), హోప్, లూయిస్/ ఆంబ్రిస్, హెట్‌మైర్, పూరన్, చేజ్, హోల్డర్, పాల్, వాల్ష్ జూనియర్, అల్జారి, కాట్రెల్.

## లక్ష్యసేన్ @32



**న్యూఢిల్లీ:** భారత యువ షట్లర్ లక్ష్యసేన్ బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్తున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ చాలెంజ్ నెగ్గిన లక్ష్యసేన్ 9 స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమ 32వ ర్యాంక్‌కు చేరాడు. 18 ఏండ్ల ఈ యువ సంచలనం ఈ ఏడాది బెల్జియం ఇంటర్నేషనల్, డచ్ ఓపెన్, సార్‌లార్‌లక్స్ ఓపెన్, స్కాటిష్ ఓపెన్, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టైటిళ్లు తన ఖాతాలో వేసుకున్నాడు. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సాయి ప్రణీత్, శ్రీకాంత్ వరుసగా 11, 12వ ర్యాంకుల్లో నిలిచారు. కశ్యప్ 23వ, ప్రణయ్ 26వ, సౌరభ్ వర్మ 28వ స్థానాల్లో ఉన్నారు. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్ పీవీ సింధు 6వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. సైనా నెహ్వాల్ 11వ ర్యాంక్‌లో ఉంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 12వ ర్యాంక్‌కు చేరింది.

## ఏబీ డివిలీయర్స్ రీఎంట్రీ!



**జోహన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్, మిస్టర్ 360 ఏబీ డివిలీయర్స్ త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేసే అవకాశాలున్నాయని సఫారీ కెప్టెన్ డుప్లెసిస్ అభిప్రాయపడ్డాడు. ఏబీ రీఎంట్రీ కోసం దారులను అన్వేషిస్తున్నాడని.. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ కంటే ముందే అతడు జట్టులో కొచ్చే చాన్స్ ఉందని డుప్లెసిస్ పేర్కొన్నాడు. 'డివిలీయర్స్ ఆటలో కొనసాగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అందులో నేనూ ఉన్నాను. ఈ అంశంపై చర్చలు సాగుతున్నాయి. ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో ఆలోచిస్తున్నాం. టీ20 క్రికెట్ భిన్నమైనది. ఈ ఫార్మాట్ కోసం ఎక్కువ రోజులు ఇం టికి దూరంగా ఉండాల్సిన పనిలేదు' అని డుప్లెసిస్ పేర్కొన్నాడు. పని భారం, కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోవడం వల్ల గతేడాది మార్చి లో డివిలీయర్స్ రిటైర్మెంట్ ప్రకటించాడు. 2019 వన్డే ప్రపంచకప్‌నకు ముందు కూడా ఏబీ రీఎంట్రీ ఇస్తాడని వార్తలు వచ్చినా.. అవి కార్యరూపం దాల్చలేదు. అయితే మార్క్‌బౌచర్ దక్షిణాఫ్రికా కోచ్‌గా ఎంపికైన అనంతరం రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్లను తిరిగి జట్టులోకి తెచ్చే పని వేగవంతమైంది.

## ఫైనల్లో భారత్

**ముంబై:** ముక్కోణపు ఫుట్‌బాల్ టోర్నీ చివరి మ్యాచ్‌లో గెలుపొందిన భారత బాలికల జట్టు ఫైనల్లో అడుగుపెట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత అండర్-17 జట్టు 1-0తో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసింది. దీంతో గురువారం స్వీడన్‌తో జరుగనున్న తుది పోరుకు అర్హత సాధించింది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ తరఫున కృతిన దేవి (90+1 నిమిషంలో) ఏకైక గోల్ చేసింది. ఆరంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా పోరాడినా ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. నిర్ణీత సమయం ముగియడానికి నాలుగు నిమిషాల ముందు.. భారత్‌ను అదృష్టం వరించింది.

## ప్రత్యక్ష ప్రసారం చేయాలి

### మేరీకోమ్‌తో బౌట్‌పై తెలంగాణ బాక్సర్ నిఖత్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక టోక్యో ఒలింపిక్స్ (2020) కోసం నిర్వహించనున్న సెలెక్షన్ ట్రయల్స్‌ను నిష్పక్షపాతంగా జరపాలని తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ కోరింది. ఈ బౌట్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయాలని భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ)కు విన్నవించింది. దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్, నిఖత్ జరీన్ ఇద్దరూ 51 కేజీల విభాగంలోనే పోటీపడుతుండటంతో.. విశ్వ క్రీడలకు మేరీకోమ్‌ను నేరుగా పంపించాలని ముందు సమాఖ్య నిర్ణయించింది. దీనిపై నిరసన వ్యక్తం చేసిన నిఖత్.. ఇద్దరి మధ్య బౌట్ నిర్వహించి.. విజేతను ఒలింపిక్స్‌కు పంపాలని పట్టుబట్టడంతో ఈ నెల చివర్లో ట్రయల్స్ జరపాలని బీఎఫ్ఐ నిర్ణయించింది. అయితే ఐబీఎల్‌లో భాగంగా మంగళవారం వీరిద్దరి మధ్య బౌట్ జరగాల్సి ఉన్నా.. ఫైట్‌కు ముందు మేరీ బరిలో నుంచి తప్పుకుంది. 'మేరీకోమ్‌తో తలపడేందుకు ఆత్రుతగా ఎదురు చూశా. కానీ చివరి నిమిషంలోనే ఆమె తప్పుకోవడంతో మంగళవారం అది సాధ్యపడలేదు. మేరీతో పోరాడటం దేశం మొత్తం చూడాలని అనుకుంటున్నా. ప్రజలకు నా సత్తా ఏంటో తెలియజెప్పాలనే ఈ లీగ్‌లో అడుగుపెట్టా. ట్రయల్స్‌ను కూడా ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరుకుంటున్నా. తలపులు బిగించి ఇద్దరి మధ్య బౌట్ నిర్వహించి విజేతను తేల్చడం కంటే యావత్ దేశం చూస్తుండగా ఎవరి ప్రదర్శన ఎలా ఉందో లెక్కకట్టడం మంచింది' అని నిఖత్ చెప్పింది.

## హైదరాబాద్ 242 ఆలౌట్

### పంజాబ్‌తో రంజీ మ్యాచ్

**పటియాలా:** దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ తమ పేలవ ఫామ్‌ను కొనసాగిస్తున్నారు. పంజాబ్‌తో మంగళవారం ప్రారంభమైన రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులకు ఆలౌటైంది. హిమాలయ్ అగర్వాల్ (68; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), సుమంత్ (79; 8 ఫోర్లు) హాఫ్ సెంచరీలు చేయగా.. మిగిలినవారు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (6), శశిధర్ రెడ్డి (0) సింగిల్ డిజిట్‌లకే పరిమితమైతే.. అక్షత్ రెడ్డి (24), సందీప్ (19), సీవీ మిలింద్ (15) రాణించలేకపోయారు. పంజాబ్ బౌలర్లలో గుర్‌కీరత్ సింగ్‌కు 4, మయాంక్ మార్కండేకు 3 వికెట్లు దక్కాయి. ఢిల్లీ, ఆంధ్ర మధ్య ఒంగోలు వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 215 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్‌కు 5 వికెట్లు దక్కాయి. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర 16/2తో నిలిచింది.

**అశ్విన్‌కు ఐదు వికెట్లు**

టీమ్‌ఇండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 5 వికెట్లతో విజృంభించడంతో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు చెలరేగిపోయింది. అశ్విన్‌తో పాటు సాయి కిషోర్ (3/22) రాణించడంతో హిమాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 158 పరుగులకు ఆలౌటైంది. ఇతర మ్యాచ్‌ల్లో ఉత్తర ప్రదేశ్ బ్యాట్స్‌మన్ ఆర్యాన్ జుయాల్ (109), విదర్భ కెప్టెన్ ఫైజ్ ఫజల్ (136) సెంచరీలతో చెలరేగారు.

## వన్డే జట్టులోకి లబుషేన్

### భారత్‌తో సిరీస్‌కు జట్టును ప్రకటించిన ఆసీస్



**మెల్‌బోర్న్:** టెస్టు క్రికెట్‌లో దుమ్మురేపుతున్న ఆస్ట్రేలియా ఆటగాడు మార్నస్ లబుషేన్‌కు వన్డే జట్టులో చోటు దక్కింది. వచ్చే నెలలో టీమ్‌ఇండియాతో జరుగనున్న వన్డే సిరీస్‌లో లబుషేన్ అరంగేట్రం చేయనున్నాడు. ఈ ఏడాది సంప్రదాయ ఫార్మాట్‌లో 58.05 సగటుతో 1103 పరుగులు చేసిన లబుషేన్.. ఆడిన చివరి మూడు టెస్టుల్లో హ్యాట్రిక్ సెంచరీలతో విజృంభించాడు. విండీస్‌తో సిరీస్ అనంతరం భారత్ సొంతగడ్డపై వరుసగా శ్రీలంక, ఆస్ట్రేలియా జట్లతో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జనవరి 14న (ముంబైలో), రెండో వన్డే 17న (రాజ్‌కోట్‌లో), మూడో వన్డే 19న (బెంగళూరులో) జరుగనున్నాయి. ఈ సిరీస్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మంగళవారం 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఆల్‌రౌండర్ సీన్ అబాట్‌కు ఐదేండ్ల తర్వాత జాతీయ జట్టు పిలుపు రాగా.. పేసర్ జోష్ హాజిల్‌వుడ్, స్పిన్నర్ ఆష్టన్ ఆగర్ చాన్నాళ్ల తర్వాత పరిమిత ఓవర్లకు ఎంపికయ్యారు.

**ఆస్ట్రేలియా జట్టు:** ఫించ్ (కెప్టెన్), స్మిత్, వార్నర్, అబాట్, ఆగర్, క్యారీ, కమిన్స్, హ్యాండ్స్‌కోంబ్, హాజిల్‌వుడ్, లబుషేన్, కేన్ రిచర్డ్‌సన్, స్టార్క్, టర్నర్, జంపా.

## పురుషులు న్యూజిలాండ్‌తో.. మహిళలు నెదర్లాండ్స్‌తో

### టోక్యో ఒలింపిక్స్ (2020)లో భారత హాకీ జట్ల మ్యాచ్‌లు



**టోక్యో:** వచ్చే ఏడాది టోక్యో వేదికగా జరుగనున్న ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్ల షెడ్యూల్ ఖరారైంది. తొలి మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు న్యూజిలాండ్‌తో, మహిళల జట్టు నెదర్లాండ్స్‌తో తలపడనున్నాయి. ఈ మేరకు మంగళవారం అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వివరాలు వెల్లడించింది. టోక్యో వేదికగా జూలై 25 నుంచి ఆగస్టు 9 వరకు జరుగనున్న మెగాటోర్నీలో భారత జట్లు తొలి రోజే బరిలో దిగనున్నాయి. గ్రూప్-ఏలో భాగంగా తొలి మ్యాచ్‌లో ఎనిమిదిసార్లు చాంపియన్ పురుషుల జట్టు న్యూజిలాండ్‌తో తలపడనుండగా, జూలై 26న ఆస్ట్రేలియాతో, 28న స్పెయిన్‌తో, 30న డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో, 31న జపాన్‌తో పోటీ పడనుంది. మహిళల విభాగంలో గ్రూప్-ఏలో ఉన్న భారత జట్టు జూలై 27న జర్మనీ, 29న గ్రేట్ బ్రిటన్, 31న ఐర్లాండ్, ఆగస్టు 1న దక్షిణాఫ్రికాతో ఆడనుంది.

## ఐసీసీ వన్డే, టీ20 జట్లలో స్మృతి



**దుబాయ్:** భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధనకు అరుదైన గౌరవం లభించింది. ఈ ఏడాది ఐసీసీ వన్డే, టీ20 జట్లలో మంధన చోటు దక్కించుకుంది. ఆమెతో పాటు వెటరన్ పేసర్ జులన్ గోస్వామి, పూనమ్ యాదవ్, శిఖా పాండే వన్డే జట్టుకు ఎంపిక కాగా.. ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు టీ20 జట్టులో చాన్స్ దక్కింది. 23 ఏండ్ల మంధన ఈ ఏడాది చక్కటి ఇన్నింగ్స్‌లతో అదరగొట్టింది. ఓవరాల్‌గా స్మృతి ఇప్పటి వరకు భారత్ తరఫున 51 వన్డేలు, 66 టీ20లు ఆడింది. ఆస్ట్రేలియా ప్లేయర్లు ఎలిస్ పెర్రీ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కించుకోగా.. అలీసా హిలీ 'టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా' నిలిచింది. ఆసీస్‌కే చెందిన మెగ్ లానింగ్ ఇరు జట్లకు కెప్టెన్‌గా ఎంపికైంది. పెర్రీ ఈ ఏడాది 73.50 సగటుతో 441 పరుగులు చేయడంతో పాటు 13.52 సగటుతో 21 వికెట్లు తీసింది. శ్రీలంకతో జరిగిన టీ20లో హిలీ 148 పరుగులు చేసి అదరగొట్టింది. థాయ్‌లాండ్ అమ్మాయి చానిద సుతిర్యాంగ్‌కు 'ఎమర్జింగ్ క్రికెటర్' పురస్కారం వరించింది.

## రాయుడిని పక్కకు పెట్టడం తప్పు: యువీ

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యానికి టీమ్ మేనేజ్‌మెంట్ ప్రధాన కారణమని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ విమర్శించాడు. లీగ్ దశలో ఓటమి ఎరుగకుండా టాప్‌లో నిలిచిన టీమ్ ఇండియా.. సెమీస్‌లో కివీస్ చేతిలో ఓడి మెగా టోర్నీ నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఒక ప్రైవేట్ టెలివిజన్ కార్యక్రమంలో హర్భజన్‌సింగ్‌తో కలిసి పాల్గొన్న యువీ పలు అంశాలపై మాట్లాడాడు. 'ప్రపంచకప్ కోసం అనుభవజ్ఞుడైన అంబటి రాయుడిని పక్కకు పెట్టి ఆల్‌రౌండర్ అన్న పేరుతో విజయ్ శంకర్‌ను జట్టులోకి ఎంపిక చేశారు. శంకర్ గాయపడ్డా రాయుడిని తీసుకోకుండా రిషబ్ పంత్ వైపు మొగ్గుచూపారు. శంకర్, పంత్ ప్రతిభను నేను తక్కువ చేయడం లేదు. సెమీఫైనల్ లాంటి కీలక మ్యాచ్‌ల్లో రాయుడు అనుభవం జట్టుకు పనికొచ్చేది. అప్పటివరకు ఆడని కార్తీక్‌ను కివీస్‌తో సెమీస్‌లో అనూహ్యంగా ఆడించారు. ధోనీని ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దింపి తప్పు చేశారు. రోహిత్, కోహ్లీ మంచి ఫామ్‌మీదున్నారు కావున ఈజీగా గెలుస్తామనుకున్నారు. కానీ ఫలితం వేరేలా వచ్చింది' అని యువీ అన్నాడు.

# ఐపీవోకి ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్

మూడేండ్లలో తెస్తామన్న చైర్మన్ రజనీశ్

**ముంబై, డిసెంబర్ 17:** బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అనుబంధ బీమా రంగ సంస్థ స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కాబోతున్నది. వచ్చే మూడేండ్లకాలంలో ఈ ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థను మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్లు బ్యాంక్ చైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడించారు. ముందుగా ఎస్బీఐ జనరల్‌ను, ఆ తర్వాత అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని ప్రవేశపెట్టాలనుకుంటున్నట్లు టైమ్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసిన ఇండియా ఎకనమిక్ కన్‌క్లేవ్ సమావేశాల్లో ఆయన వెల్లడించారు. గతేడాది ఎస్బీఐకి చెందిన జీవిత బీమా సంస్థ మార్కెట్లో లిస్ట్ అయిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా గ్రూపుతో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ విలువ ప్రస్తుతం రూ.50 వేల కోట్లకు పైగా ఉన్నది. ఎస్బీఐ జనరల్ కంటే ముందుగానే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో వాటాలను విక్రయించాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ రికార్డు స్థాయిలో దూసుకుపోవడంపై ఆయన స్పందిస్తూ..ప్రస్తుత త్రైమాసికంలో తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని, మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించడం ఇందుకు కలిసిరానున్నట్లు చెప్పారు. టెలికం రంగానికి ఇచ్చిన రుణాలపై ఆయన స్పందిస్తూ..గతంలో ఇచ్చిన రుణాలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని, కానీ, ప్రస్తుతం ఈ రంగం కోలుకుంటుండటంతో రుణాలు తిరిగి చెల్లింపులపై నమ్మకాన్ని కల్గిస్తున్నదన్నారు.

### యెస్ బ్యాంక్‌ను కొనుగోలు చేయడం లేదు..

ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న యెస్ బ్యాంక్‌ను ఎస్బీఐ కొనుగోలు చేస్తున్నట్లు వచ్చిన వార్తలను రజనీశ్ కుమార్ కొట్టిపారేశారు. అలాంటి ప్రతిపాదనేది బ్యాంక్ వద్ద లేదని, ఇప్పటికే ఐదు అనుబంధ బ్యాంకులతోపాటు భారతీయ మహిళా బ్యాంక్‌ను విలీనం చేసుకున్నట్లు చెప్పారు. కొత్తగా మరో బ్యాంక్‌ను కొనుగోలు చేయడం ద్వారా ఆర్థిక బలోపేతం అటుంచి...కష్ట నష్టాలు మరింత పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులను ఆశించడం లేదని, అవసరమైతే అంతర్గత వనరుల ద్వారా సేకరించనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# జిల్.. జిల్.. జిగేల్

**ముంబై, డిసెంబర్ 17:**

## దలాల్ స్ట్రీట్‌లో మెరుపులు

### రికార్డు స్థాయిలో దూసుకుపోయిన సూచీలు

### చారిత్రక గరిష్ఠ స్థాయి 41,352కి చేరిన సెన్సెక్స్

దలాల్‌స్ట్రీట్ లాభాల కాంతులతో వెలుగులు జిమ్మింది. రికార్డుల మీద రికార్డుల బద్దలు కొడుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు కొలిక్కిరావడం, దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడం మార్కెట్లకు జోష్‌నిచ్చింది. దీంతో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరుపడంతో ప్రారంభం నుంచి లాభాల బాట పట్టిన సూచీలు ఏ దశలోనూ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఇంట్రాడేలో 41,401.65 ఆల్‌టైం హైకి చేరుకున్న 30 షేర్ల బీఎస్‌ఈ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 41,352.17 వద్ద ముగిసింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే 413.45 పాయింట్లు లేదా 1.01 శాతం లాభపడినట్లు అయింది. ముగింపు కూడా ఒక చారిత్రకమే. ఇంట్రాడేలో 12,182.75 పాయింట్ల ఆల్‌టైం హైకి చేరుకున్న జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ చివరకు 12,165 వద్ద ముగిసింది. 111.05 పాయింట్లు ఎగబాకినట్లు అయింది.

### జోష్‌నిచ్చిన అమెరికా-చైనా డీల్

అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. వాణిజ్య యుద్ధంపై గతేడాదికాలంగా అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కివచ్చినట్లు యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతోపాటు పలు ఉత్పత్తులపై విధించిన పన్నును రద్దు చేస్తున్నట్లు చైనా కీలక నిర్ణయం తీసుకోవడం గ్లోబల్ మార్కెట్లకు జోష్‌నిచ్చింది. వీటికితోడు టెలికం, ఫైనాన్షియల్, ఐటీ రంగాలకు చెందిన షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటం కూడా లాభాలకు పరోక్షంగా దోహదం చేసింది. మార్కెట్లో టాటా స్టీల్ 4.38 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ 4.37 శాతం, వేదాంతా 3.50 శాతం, టాటా మోటర్స్ 3.03 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 2.46 శాతం, బజాజ్ ఫైనాన్స్ 2.39 శాతం, ఇన్ఫోసిస్ 2.14 శాతం అత్యధికంగా లాభపడ్డాయి. వీటితోపాటు టీసీఎస్, ఐటీసీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్ అండ్ టీ, హెచ్‌సీఎల్ టెక్, మారుతి, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐలు మదుపరులను ఆకట్టుకున్నాయి. కానీ, సన్‌ఫార్మా, బజాజ్ ఆటో, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యునిలీవర్, రిలయన్స్, హీరో మోటోకార్ప్, యాక్సిస్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంకులు నష్టపోయాయి. వర్ల్‌పూల్ షేర్లు కుదేలయ్యాయి. కంపెనీ ఎండీ సునీల్ డిసౌజా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో సంస్థ షేర్లు నాలుగు శాతానికి పైగా పతనం చెందింది. రంగాలవారీగా చూస్తే టెలికం, మెటల్, టెక్, బేసిక్ మెటిరియల్, ఐటీ, ఫైనాన్స్ రంగ షేర్లు మూడు శాతానికి పైగా లాభపడగా, కన్జ్యూమర్ డ్యూరబుల్, హెల్త్‌కేర్, రియల్టీ, ఇంధన రంగ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలు మార్కెట్లకు ఉత్తేజాన్ని ఇచ్చిందని, దేశ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సూచీలు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. బుధవారం సమావేశమవుతున్న జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాల కోసం దేశీయ మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించగా, విదేశీ పెట్టుబడిదారులు భారీగా కుమ్మరించారు. ఎఫ్‌పీఐలు రూ.డ 728.13 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, ఇదే సమయంలో దేశీయ పెట్టుబడిదారులు రూ.796.38 కోట్ల షేర్లును విక్రయించారు. ఫిబ్రవరిలో జరుగనున్న పరపతి సమీక్షలో మరోదఫా వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యలు కూడా మార్కెట్లో మరింత జోష్‌నిచ్చింది. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కోలుకోవడం, క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గడం కలిసొచ్చింది.




## వీఆర్‌ఎస్‌తో రూ.1,300 కోట్ల ఆదా

### బీఎస్‌ఎన్‌ఎల్ సీఎండీ పీకే పుర్వార్ వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన 78,569 మంది సిబ్బంది స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్‌ఎస్)కు దరఖాస్తు చేసుకోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి సంస్థకు రూ.1,300 కోట్ల వరకు ఆదాకానున్నది. జనవరి 31, 2020 నుంచి అమలులోకిరానున్న ఈ వీఆర్‌ఎస్ పథకంతో ఉద్యోగుల వేతన చెల్లింపులు రూ.1,300 కోట్లు తగ్గనున్నాయని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే పుర్వార్ తెలిపారు. మరోవైపు బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఎంటీఎన్‌ఎల్ విలీనానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయని, కామన్ ప్లాట్‌ఫాం కింద ఇప్పటికే పలుదఫాలుగా చర్చలు జరిపినట్లు వెల్లడించిన ఆయన..ఇరు సంస్థల నెట్‌వర్క్ అనుసంధానం చేయడం, వ్యాపారాల విలీనంపై చర్చలు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఈ వీఆర్‌ఎస్ వల్ల కేవలం రెండు నెలల్లోనే సంస్థకు రూ.1,300 కోట్ల ఆదా కావడం విశేషం.



హైదరాబాద్‌లో బౌన్స్ రెంటల్ స్కూటర్‌ను ప్రారంభిస్తున్న ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్

## రూపాయికి కిలోమీటర్

### హైదరాబాద్‌లో బౌన్స్ స్కూటర్ రెంటల్ సేవలు

**హైదరాబాద్, డిసెంబర్ 17:** ప్రముఖ రవాణా సదుపాయాల సంస్థ బౌన్స్.. హైదరాబాద్‌లో తన స్కూటర్ రెంటల్ సేవలు ఆరంభించింది. కంపెనీకి చెందిన యాప్ ద్వారా సులభంగా పికప్ చేసుకోవడంతోపాటు నగరంలో ఉన్న పార్కింగ్ జోన్‌లో ఈ వాహనాన్ని డ్రాప్ చేయాల్సి ఉంటుంది. ఒక్కో కిలోమీటర్‌కు రూపాయి చార్జీని వసూలు చేస్తున్నట్లు కంపెనీ ఫౌండర్, సీటీవో వరుణ్ అగ్ని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 2 వేల స్కూటర్లతో సేవలు ఆరంభించిన సంస్థ..వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ సంఖ్యను 8 వేలకు పెంచబోతున్నట్లు చెప్పారు. ఏడాది క్రితం బెంగళూరులో సేవలు ప్రారంభించిన సంస్థ..ప్రస్తుతం అక్కడ రోజుకు లక్ష రైడ్ల సేవలు అందిస్తున్నది. వచ్చే ఏడాదికాలంలో మరో పది నగరాలకు విస్తరించడంతోపాటు రోజుకు పది లక్షల రైడ్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సరికొత్త టెక్నాలజీ సొల్యూషన్‌తో తయారైన ఈ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారికి మాత్రమే ఈ స్కూటర్ తాళం తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ప్రయాణం పూర్తైన తర్వాత ఆటోమేటిక్‌గా తాళం పడనున్నది. ఈ స్కూటర్‌ను ఎవరు దొంగలించకుండా ఉండేందుకు దీనికి జీపీఎస్ ట్యాగింగ్, జియో-ఫెన్సింగ్, సెన్సార్, ఒకవేళ ప్రమాదం జరిగినప్పుడు వెంటనే అలర్ట్ రింగ్ మోగనున్నది. వ్యాపార విస్తరణకు గత జూలైలో 72 మిలియన్ డాలర్ల నిధులను సేకరించిన సంస్థ..మరో 100-150 మిలియన్ డాలర్ల నిధులను సేకరించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన చెప్పారు.

# రూ. 1.1 లక్షల కోట్లు లక్ష్యం

ఈ డిసెంబర్-మార్చికిగాను నెలసరి జీఎస్టీ వసూళ్లపై నిర్దేశించుకున్న కేంద్రం • నేడు జీఎస్టీ మండలి సమావేశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ఆర్థిక మందగమనం మధ్య పన్ను వసూళ్లు తగ్గుతాయేమోనన్న ఆందోళన కేంద్ర ప్రభుత్వంలో కనిపిస్తున్నది. అందుకే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో మిగిలిన ఈ నాలుగు నెలలకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల లక్ష్యాలను గట్టిగానే నిర్దేశించుకున్నది. డిసెంబర్-మార్చి మధ్య నెలకు రూ.1.10 లక్షల కోట్ల ఆదాయాన్ని సాధించాలని నిర్ణయించింది. కనీసం ఒక్క నెలైనా రూ.1.25 లక్షల కోట్ల వసూళ్లను సాధించాలని చూస్తున్నది. ఇందుకు తగ్గట్లుగా సంబంధిత అధికారులనూ కార్యోన్ముఖులను చేస్తున్నది. రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే.. పన్ను శాఖల్లోని ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగానే నూతన లక్ష్యాలను ప్రకటించారు. జీఎస్టీ, ఇతర పరోక్ష పన్నుల అధికారులతోపాటు ఆదాయం పన్ను (ఐటీ) శాఖ అధికారులకూ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.13.35 లక్షల కోట్లను చేరాలని కూడా స్పష్టం చేసినట్లు సమాచారం. తొలి ఏడు నెలల్లో (ఏప్రిల్-అక్టోబర్) దాదాపు రూ.6 లక్షల కోట్లు వసూలైయ్యాయి.




### నాలుగుసార్లే..

గత 8 నెలల్లో (ఏప్రిల్-నవంబర్) జీఎస్టీ వసూళ్లు నాలుగుసార్లు మాత్రమే రూ.లక్ష కోట్ల మార్కును దాటాయి. అందులో ఒక్క నెలే రూ.1.10 లక్షల కోట్లకుపైగా నమోదైయ్యాయి. అయితే ఆర్థిక మందగమన పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో మిగిలిన ఈ నాలుగు నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల ఆదాయం కష్టమేనన్న భావన సర్కారులో ఉన్నది. దీంతోనే అధికారులకు దిశా-నిర్దేశం చేసింది. ఈ 2019-20లో జీఎస్టీ వసూళ్లలో తమ వాటా రూ.6.63 లక్షల కోట్లుగా ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు అనుకూలంగా లేకపోవడం మోదీ సర్కారును ఇప్పుడు కలవరపెడుతున్నది. ఓ వైపు మందగమనం, ఖర్చులు.. మరోవైపు పన్నుల ఆదాయం పతనం కేంద్రాన్నిప్పుడు ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి. జీఎస్టీ కోసం 17 రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులను ఏకం చేసిన విషయం తెలిసిందే. ఆదాయంలో చేరి సగం అని ప్రకటించిన సంగతీ విదితమే. అయితే తొలి ఐదేండ్లు రాష్ట్రాలకు నష్టపరిహారం ఇస్తామన్న హామీ.. ఇప్పుడు కేంద్రానికి గుదిబండగా తయారైంది. జీఎస్టీ బకాయిల కోసం కేంద్రాన్ని రాష్ట్రాలు నిలదీస్తున్నది చూస్తూనే ఉన్నాం.

### ఆదాయం పన్ను దాడులకు అవకాశం

**కేంద్రం** తాజా లక్ష్యాలతో ఐటీ శాఖ దూకుడు పెంచనున్నది. జీఎస్టీతోపాటు ఆదాయం పన్ను వంటి ప్రత్యక్ష పన్ను లక్ష్యాలనూ సర్కారు నిర్దేశించడంతో దేశవ్యాప్తంగా ఐటీ దాడులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, పన్ను ఎగవేతలను అరికట్టాలని ఆదేశించినప్పుడు.. నిజాయితీగా పన్ను చెల్లించేవారిని వేధింపులకు గురిచేయకుండా అధికారులు లక్ష్యాలను సాధిస్తుండటంపై ఈ సందర్భంగా పాండే అభినందించారు. ఇక బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ మండలి సమావేశం జరుగనున్నది. పన్ను వసూళ్లు తగ్గిపోయిన నేపథ్యంలో జీఎస్టీ వర్తించని, మినహాయింపు పొందుతున్న వస్తు, సేవలపై పన్ను వేసే వీలుందన్న అంచనాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

## HETERO HEALTHCARE హెటిరో నుంచి హెచ్‌ఐవీ మందు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ప్రముఖ ఔషధ రంగ సంస్థ హెటిరో హెల్త్‌కేర్.. దేశీయ మార్కెట్లోకి హెచ్‌ఐవీ-1ని నియంత్రించే ఔషధాన్ని విడుదల చేసింది. 3-ఇన్-వన్ కలిగిన ఈ మందును 'టాఫిక్' బ్రాండ్‌తో ప్రవేశ పెట్టింది. గిలెడ్ బిక్తార్వేకు జనరిక్ వెర్షన్‌గా ప్రవేశపెట్టిన ఈ ఉత్పత్తికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) అనుమతినిచ్చింది. ఈ ఔషధాన్ని దేశీయ రిటైల్ మార్కెట్లో హెటిరో హెల్త్‌కేర్ విక్రయించడంతోపాటు డిస్ట్రిబ్యూట్ చేయనున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడానికి కంపెనీకి ఉన్న కమిట్‌మెంట్‌కు ఈ ఔషధం నిదర్శమని ఒక ప్రకటనలో వెల్లడించింది. బిక్టెగ్రావిర్(50ఎంజీ), ఎంట్రిసిటాబైన్(200 ఎంజీ), టెనోఫోవిర్ అలాఫేనమిడే(25ఎంజీ) అనే మూడు మందుల కాంబినేషన్‌తో తయారైన ఈ టాఫిక్ రోజుకు ఒక్కటి వేసుకుంటే సరిపోతున్నదని తెలిపింది. హెచ్‌ఐవీ-1 వ్యాధి సోకిన వారు ఈ ట్యాబ్లెట్‌తో నయం కానున్నది.



## మూడేండ్లలో అన్ని గ్రామాలకు ఇంటర్నెట్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** అన్ని గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. 2022 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించే ఉద్దేశంలో భాగంగా కేంద్రం..నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్‌ను మంగళవారం ప్రారంభించింది. వచ్చే కొన్నేండ్లలో ఈ మిషన్ కోసం రూ.7 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టే అవకాశం ఉన్నది. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడానికి ఈ ప్రత్యేక మిషన్‌ను ఆరంభించింది కేంద్రం. 2024 నాటికి 30 లక్షల కిలోమీటర్ల మేర అప్టికల్ ఫైబర్ కేబుల్‌ను వేయడంతోపాటు ప్రతి వెయ్యి మందికి ఒక టెలికం టవర్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఈ సందర్భంగా టెలికం మంత్రి రవి శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ..వినియోగదారులకు నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందించడానికి ఈ మిషన్ ఎంతో దోహదం చేయనున్నదన్నారు. దీంట్లోభాగంగా 2022 నాటికి అన్ని గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలతోపాటు ప్రస్తుతం దేశీయంగా ఉన్న 5.65 లక్షల టవర్లను 10 లక్షలకు పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు. విద్యా, ఆరోగ్యం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, అభివృద్ధిలో టెక్నాలజీకల్ మౌలిక రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ మిషన్ కీలకమన్నారు. అలాగే ఇంటర్నెట్ వేగాన్ని కూడా భవిష్యత్తులో 50 ఎంబీపీఎస్‌లకు పెంచే ప్రణాళిక కూడా ప్రభుత్వం వద్ద ఉన్నదన్నారు. ఈ బృహత్ ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి వీలు పడనున్నదన్నారు. డిజిటల్ కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాల రంగాన్ని మరింత వేగితరం చేయడానికి ఈ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ లక్ష్యమని, డిజిటల్ సాధికారిత, తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించాలన్నదే ఈ మిషన్ లక్ష్యం.

# ఖర్చు తగ్గకపోతే సంక్షోభమే

### ద్రవ్యలోటు లక్ష్యాలకు కట్టుబడాలి

### కేంద్రానికి ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి హెచ్చరికలు

**ముంబై, డిసెంబర్ 17:** ద్రవ్యలోటు లక్ష్యాలకు కట్టుబడి ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు. నిర్ణీత స్థాయిలోనే ద్రవ్యలోటును కట్టడి చేయాలని, లేకుంటే సంక్షోభం తప్పదని హెచ్చరించారు. మంగళవారం ఇక్కడ టైమ్స్ నెట్‌వర్క్స్ ఆధ్వర్యంలో జరిగిన భారత ఆర్థిక సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖర్చులు తగ్గకపోతే కష్టమేనన్నారు. 'మన ద్రవ్యలోటుపట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. లక్ష్యాలను సాధించాలి' అన్నారు. బడ్జెట్ లక్ష్యాలకు దూరంగా ద్రవ్యలోటు ఉందన్న ప్రభుత్వ వివరాల నేపథ్యంలో దువ్వూరి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అధిక ద్రవ్యలోటు.. ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తుందన్న ఆయన నిజానికి ఆర్బీఐ ఎప్పటికప్పుడు ద్రవ్యలోటుపై ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే ఉంటుందని గుర్తుచేశారు.



### జీడీపీ అంచనా తగ్గొచ్చు

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రధాన ఆర్థికవేత్త, భారత సంతతికి చెందిన గీతా గోపీనాథ్ సదస్సులో మాట్లాడుతూ జనవరిలో భారత జీడీపీ అంచనాల్ని గణనీయంగా తగ్గించే వీలుందన్నారు. పడిపోయిన వినియోగ సామర్థ్యం, ప్రైవేట్ పెట్టుబడుల కొరత, ఎగుమతుల క్షీణత.. జీడీపీ మందగమనానికి కారణమవుతున్నాయన్నారు. ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.5 శాతానికి దిగజారిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ మందగమన పరిస్థితులు ప్రభావితం చేస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అయినప్పటికీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సవాళ్లను ప్రభావవంతంగా ఎదుర్కొంటున్నారని కొనియాడారు.

### ఇంకా బ్రిటీష్ కాలం నాటిదే..

బ్రిటీష్ కాలం నాటి ఉద్యోగ వ్యవస్థే భారత్‌లో ఇంకా కొనసాగుతున్నదని, అది మారాలని హిందుజా గ్రూప్ కో-చైర్మన్ గోపిచంద్ హిందుజా ఈ సదస్సు సందర్భంగా సూచించారు. 2024 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం సాధ్యమైనదేనని అభిప్రాయపడ్డ ఆయన ఇందుకు వేగవంతమైన పాలనా వ్యవస్థ అవసరమన్నారు. తాము భారత్‌లో 20 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నామని, అయితే వ్యాపారానికి ఇంకా అనువైన పరిస్థితులు ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు దేశ ఆర్థిక వ్యవస్థ డార్విన్ సిద్ధాంతంలో నడుస్తున్నదని, బలమైన బ్యాంకులు మాత్రమే బతకగలుగుతున్నాయన్నారు.



## హైదరాబాద్‌లో వీవర్క్ కో-వర్కింగ్ ఆఫీస్

**హైదరాబాద్, డిసెంబర్ 17:** కో-వర్కింగ్ సేవలు అందిస్తున్న ప్రపంచంలో అతిపెద్ద సంస్థల్లో ఒకటైన వీవర్క్..హైదరాబాద్‌లో ఒకేసారి రెండు కార్యాలయాలను ప్రారంభించింది. ఏడు వేల మంది కూర్చోవడానికి వీలుండే ఈ రెండు కార్యాలయాల్లో ఒకదానిని రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో ర్యాన్ బెనెట్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో కో-వర్కింగ్ స్థలానికి ఇటీవల కాలంలో అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నదని, ముఖ్యంగా ఇక్కడ నైపుణ్యం కలిగిన సిబ్బంది లభిస్తుండటం, కార్పొరేట్ సంస్థలు ఇక్కడ తమ ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి మొగ్గుచూపడం ఇందుకు దోహదం చేస్తున్నదన్నారు. ఐటీ, ఫార్మా హబ్‌గా కొనసాగుతున్న భాగ్యనగరం కో-వర్కింగ్‌లోనూ దూసుకుపోతున్నదన్నారు. రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కో-వర్కింగ్‌లో ఒక్కో సీటుపై నెలకు రూ.7 వేల వరకు చార్జి విధిస్తున్నది. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ..వీవర్క్ ఒకేసారి రెండు కార్యాలయాలను ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని, వీటివల్ల చిన్న స్థాయి సంస్థలకు ఎంతో ప్రయోజనంచేకూరనున్నదని, ముఖ్యంగా ఖర్చులు మరింత తగ్గనున్నాయన్నారు.

# మరో ఏడాది ఐయూసీ

### వచ్చే ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగించిన ట్రాయ్

### ఇతర నెట్‌వర్క్ కాల్స్‌పై కొనసాగనున్న 6 పైసల చార్జీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ఇంటర్‌కనెక్ట్ యూసేజ్ చార్జీల (ఐయూసీ)ను టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) పొడిగించింది. వచ్చే ఏడాది డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటాయని మంగళవారం స్పష్టం చేసింది. నిజానికి ఈ నెల 31తో ఐయూసీ చార్జీలు రద్దవుతాయని ట్రాయ్ గతంలో ప్రకటించింది. అయితే ఈ నిర్ణయాన్ని తాజాగా ఏడాది కాలం వాయిదా వేసింది. ప్రస్తుతం రెండు వేర్వేరు నెట్‌వర్క్‌ల కస్టమర్ల మధ్య వాయిస్ కాల్స్‌కు నిమిషానికి 6 పైసలు వసూలు చేస్తున్నారు. ట్రాయ్ తాజా నిర్ణయంతో ఈ వసూళ్లు మరో ఏడాదిపాటు కొనసాగనున్నాయి. 'మెజారిటీ టెలికం సంస్థల అభిప్రాయాలు, ప్రస్తుతం పరిశ్రమలో నెలకొన్న ధరల యుద్ధం, ఇతరత్రా పరిణామాలపై మా విశ్లేషణలను అనుసరించి ఐయూసీ చార్జీలను 2020 డిసెంబర్ 31 వరకు పొడిగించాలని నిర్ణయించాం. 2021 జనవరి నుంచి ఈ చార్జీలు రద్దవుతాయి' అని ట్రాయ్ వెల్లడించింది. ఇంతకుముందు ఈ చార్జీలు నిమిషానికి 14 పైసలుగా ఉండగా, సెప్టెంబర్ 2017లో 6 పైసలకు తగ్గిస్తూ ట్రాయ్ నిర్ణయం తీసుకున్నది. డిసెంబర్ 31, 2019 వరకు ఈ చార్జీలు వర్తిస్తాయని, 2020 జనవరి నుంచి రద్దవుతాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్నే ఇప్పుడు ఏడాదిపాటు వాయిదా వేసింది.



### ఎయిర్‌టెల్, వొడా-ఐడియాలకు లాభం

ట్రాయ్ నిర్ణయం భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు లాభించనున్నది. ప్రస్తుతం రిలయన్స్ జియోతో పోల్చితే వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌లకే ఎక్కువ మంది కస్టమర్లున్నారు. దీంతో ఈ కస్టమర్లకు జియో కస్టమర్లు ఫోన్ చేసిన ప్రతీసారి నిమిషానికి 6 పైసల చొప్పున వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌లకు జియో చెల్లించాల్సి వస్తున్నది. ఇంతకుముందు ఈ భారాన్ని జియోనే మోసినప్పటికీ.. ఇప్పుడు కస్టమర్లపై వేసింది. నిర్ణీత ప్లాన్లపై అదనంగా టాప్‌అప్‌లను వేసుకోవాల్సి వస్తున్న విషయం తెలిసిందే. దాంతో సంస్థపై కొంత ప్రతికూల ప్రభావం పడుతుండగా, ఈ చార్జీలను మరో ఏడాదిపాటు ట్రాయ్ పొడిగించడం జియోకు మింగుడుపడని అంశమే. ఐయూసీ చార్జీలను రద్దు చేయాలని ఎప్పట్నుంచో ట్రాయ్‌ని జియో కోరుతున్నది. ఐయూసీ ద్వారా ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు అదనపు ఆదాయం సమకూరుతుండగా, జియో ఆదాయానికి మాత్రం గండి పడుతున్నది.

### ఉచిత కాల్స్, చౌక డేటాకు దెబ్బ

**ఉచిత కాల్స్,** చౌక డేటాకు కాలం చెల్లినట్లే కనిపిస్తున్నది. జియో రాకతో ఉచిత కాల్స్, చౌక డేటా.. మొబైల్ వినియోగదారులను ముంచెత్తగా, ఇటీవలికాలంలో కాస్త ఈ ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. ఈ నేపథ్యంలో మొబైల్ ఫోన్ కాల్స్, డేటా కోసం కనీస ధరల నిర్ణయానికి ట్రాయ్ సంప్రదింపులను ప్రారంభించింది. దీంతో టెలికం సంస్థలు మొబైల్ ఫోన్ కాల్స్, డేటా చార్జీలను ట్రాయ్ సూచనల ప్రకారం నిర్ణయించాల్సి రానుంది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలతో పోల్చితే జియో టారీఫ్‌లు తక్కువగా ఉండటంతో పెద్ద ఎత్తున కస్టమర్లు ఆ సంస్థకు మారిన సంగతి విదితమే. దీంతో ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కూడా చార్జీలను తగ్గించాల్సి వచ్చింది. అయితే నష్టాలు పెరుగడం, స్పెక్ట్రం బకాయిలు, లైసెన్సు ఫీజలపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో చార్జీలు పెంచక తప్పదని ప్రభుత్వంపై ఈ రెండు సంస్థలు ఒత్తిడి తెచ్చాయి. చివరకు జియో సైతం తలొగ్గాల్సి వచ్చింది. ఈ క్రమంలో కనీస ధరలపై ట్రాయ్ అభిప్రాయ సేకరణ చేపట్టగా, వచ్చే నెల 17 వరకు తమ విలువైన సలహాలు, సూచనల్ని ఇవ్వాల్సిందిగా పరిశ్రమ భాగస్వాములను కోరింది. దీంతో అన్ని సంస్థలు ఒకే ధరలను లేదంటే ట్రాయ్ పరిమితికి తగ్గకుండా ధరలను పాటించాల్సి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే ఉచిత కాల్స్, చౌక డేటాకు కాలం తీరినట్లేనని అంటున్నారు.



## ప్రియాంకా.. మజాకా

### పెండ్లికి రూ.3.30 కోట్ల ఖర్చు

**ముంబై, డిసెంబర్ 17:** బాలీవుడ్ అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రా వివాహ మహోత్సవం పుణ్యమాని మూడు నెలల ఆదాయం ఒక్కసారే దక్కిందని ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ సీఈవో, ఎండీ పునీత్ చట్వాల్ అన్నారు. అమెరికా గాయకుడు, గేయ రచయిత నికోలస్ జెర్రీ జోనాస్‌తో ప్రియాంక ప్రేమ వివాహం జరిగిన విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఈ పెండ్లికి నికోలస్-ప్రియాంక జంట ఏకంగా 4,61,000 డాలర్లకుపైగా (దాదాపు రూ.3.30 కోట్లు) ఖర్చు పెట్టినట్లు తెలుస్తున్నది. జోధ్‌పూర్‌లోని ఉమైద్ భవన్ ప్యాలెస్‌లో అంగరంగ వైభవంగా ఈ వివాహ వేడుక జరిగింది. వెడ్డింగ్ పార్టీ కోసం నాలుగు రోజులపాటు ఇక్కడి గదులన్నింటినీ బుక్ చేసుకున్నారని పునీత్ తెలిపారు. ఈ పెండ్లికి బాలీవుడ్ ప్రముఖులంతా తరలి వచ్చిన సంగతి విదితమే. హోటల్ పరిశ్రమకు ప్రముఖుల ఇండ్లలో జరిగే శుభకార్యాలు చాలా ముఖ్యమన్న పునీత్.. ఈ క్రమంలోనే ప్రియాంక-నికోలస్ వివాహ వేడుక తమకు మూడు నెలల ఆదాయాన్ని అందించిందన్నారు. ముకేశ్ అంబానీ ముద్దుల కూతురు ఇషా అంబానీ-ఆనంద్ పిరామల్ పెండ్లి వల్ల కూడా పరిశ్రమకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరిందని తెలిపారు.



మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తమ వివాహానికి ఆహ్వానించిన తెలంగాణ జాగృతి జర్మనీ విభాగం అధ్యక్షుడు స్వర్ణాకర్, జర్మనీకి చెందిన జూలియా

## లష్కర్ అబ్బాయి-జర్మనీ అమ్మాయి

స్వర్ణాకర్, జూలియా జంటను అభినందించిన మాజీ ఎంపీ కవిత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రేమకు కులం, మతం, ప్రాంతం, హద్దులు లేవని మరోసారి నిరూపితమైంది. దేశాలు దాటి ప్రేమను గెలిపించుకొని త్వరలో ఒకటి కానున్నారు తెలంగాణ జాగృతి జర్మనీ విభాగం అధ్యక్షుడు స్వర్ణాకర్, జర్మనీకి చెందిన జూలియా. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవితను కలిసి వివాహ ఆహ్వానపత్రికను అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన స్వర్ణాకర్ కొన్నేండ్ల క్రితం ఉద్యోగం నిమిత్తం జర్మనీ వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేస్తూనే తెలంగాణ జాగృతి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. స్వర్ణాకర్‌కు సహోద్యోగి జూలియాతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వారి ప్రేమను ఇరువైపు కుటుంబీకులు అంగీకరించి పెండ్లికి ఆమోదం తెలిపారు. ఈ నెల 22న బేగంపేటలో భారతీయ సంప్రదాయం ప్రకారం జూలియా, స్వర్ణాకర్ వివాహం జరగనున్నది. కాబోయే జంటను మాజీ ఎంపీ కవిత అభినందించారు.



మంగళవారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో మొక్కలు నాటుతున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సలీం

## మొక్కలునాటిన వక్ఫ్‌బోర్డ్ చైర్మన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంపీ సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సలీం స్వీకరించారు. మంగళవారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో మొక్కలు నాటారు. అనంతరం నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, ఏపీ డిప్యూటీ సీఎం అమ్జద్‌పాషా, యూసఫ్ అలీకి గ్రీన్‌చాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో రాఘవ, ఖాజా, ఖయ్యూం, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

### మిస్రిగంజ్ దర్గాహజ్‌కు రూ.50 లక్షలు మంజూరు

వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహ్మద్ సలీం.. హైదరాబాద్ మిస్రిగంజ్‌లోని దర్గాహజ్ నిర్మాణ మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరుచేశారు. మంగళవారం రూ.10 లక్షల చెక్కును ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్ బీ నారాయణకు అందజేశారు. ఇప్పటికే రూ.40 లక్షలు ఆర్కియాలజీ అధికారులకు ఇచ్చినట్టు సలీం తెలిపారు.





రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం రవీంద్రభారతిలోని తన కార్యాలయంలో 'మేలుకో వీర వనిత' లఘు చిత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ రేచల్, నాయకులు జగన్నాథం దామోదర్, చిత్ర నిర్మాత సోల్తి సారయ్యగౌడ్, దర్శకుడు డాక్టర్ దిలీప్‌కుమార్, ప్రధాన పాత్రధారి శైలజ తదితరులు పాల్గొన్నారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## హరితహారంపై పీఆర్ అధికారులకు శిక్షణ

- ప్రతి గ్రామంలో నర్సరీ
- నేటినుంచి దూలపల్లిలో శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హరితహారాన్ని మరింత జోరుగా నిర్వహించేందుకు ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటవుతున్నది. ఏడాదికి వంద కోట్ల మొక్కలు నాటాలనే సంకల్పంతో ప్రభుత్వం 12,244 నర్సరీలను ఏర్పాటుచేస్తున్నది. వీటి నిర్వహణ, మొక్కల సంరక్షణ, పంపిణీ తదితర విషయాలపై పంచాయతీరాజ్‌శాఖలోని అన్నిస్థాయిల అధికారులకు శిక్షణ ఇవ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. బుధవారం నుంచి మూడురోజులపాటు హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ షెడ్యూల్‌ను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ శోభ విడుదలచేశారు. 18న మహబూబ్‌నగర్, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, సూర్యాపేట, సంగారెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నారాయణ్‌పేట్ జిల్లాలు 19న మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, ములుగు జిల్లాలు.. 20న రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులు శిక్షణలో పాల్గొంటారు. శిక్షణ పొందిన అధికారులు ఈ నెల 23, 27 తేదీల్లో జిల్లాల్లోని మండల, గ్రామస్థాయి అధికారులకు శిక్షణనిస్తారు.

# బిల్డర్ల పాత్ర కీలకం

- ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుంది
- బంగారు తెలంగాణలో మీరే క్రియాశీలం
- మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు



బిల్డర్స్ డే సందర్భంగా మంగళవారం హైదరాబాద్ ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సావనీర్‌ను విడుదల చేస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, బీఏఐ అధ్యక్షుడు సచిన్‌చంద్ర,తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బంగారు తెలంగాణ నిర్మాణంలో బిల్డర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. బిల్డర్స్ డే సందర్భంగా మంగళవారం సాయంత్రం హైదరాబాద్ ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. ప్రతి వృత్తిలో మాదిరిగానే ఈ రంగంలోనూ సమస్యలున్నాయని, తెలంగాణలో కంట్రాక్టర్లకు గుర్తింపు లేదనే భావనను విడనాడాలని అన్నారు. సీఎం కేసీఆర్ గొప్ప దూరదృష్టితో పని చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేండ్లలో పూర్తికావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు కంట్రాక్టర్లు తోడ్పాటును అందిస్తున్నారని, ఇదే సహకారం ప్రభుత్వం నుంచి కూడా ఉంటుందని తెలిపారు. బిల్డర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు అభినందించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎంతో దార్శనికుడైన కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం తెలంగాణ అదృష్టమని, ఆయన ఆలోచన, దూరదృష్టి వల్లే ఎలాంటి ప్రాజెక్టు అయినా శరవేగంగా పూర్తవుతుందని తెలిపారు. జాతీయస్థాయిలో కాళేశ్వరం, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టులకు మంచిపేరుతోపాటు అవార్డులొచ్చినప్పటికీ కేంద్రం నిధులు విడుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అనేక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేయడంలో కాంట్రాక్టర్లు కీలక పాత్ర పోషించారని, గత పాలకుల హయంలో ఏ ప్రాజెక్టు అయినా పూర్తయ్యేందుకు 20-30 ఏండ్లు పడితే.. సీఎం కేసీఆర్ మూడేండ్లలోపే పూర్తిచేసి చూపారని కొనియాడారు.

### సావనీర్ విడుదల

ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) సావనీర్‌ను మంత్రులిద్దరూ విడుదలచేశారు. నాలుగు విభాగాల్లో విజేతలుగా నిలిచిన బిల్డర్లకు అవార్డులను అందజేశారు. నిర్మాణరంగంలో విశేషంగా కృషిచేసిన ఇద్దరు కాంట్రాక్టర్లను, మరో డాక్టరును సన్మానించారు. అనంతరం మంత్రులు జగదీశ్‌రెడ్డి, దయాకర్‌రావును బీఏఐ సభ్యులు సత్కరించి ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సచిన్‌చంద్ర, ఉపాధ్యక్షుడు కే శ్రీరాం, బీఏఐ రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్‌ఎన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు బి శీనయ్య, క్రెడాయ్ మాజీ జాతీయ అధ్యక్షుడు సీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సివిక్స్ పిటిషన్‌పై ప్రతివాదులకు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరాల్లో సబ్జెక్టుగా ఉన్న సివిక్స్‌ను పొలిటికల్ సైన్స్‌గా మార్చి.. సిలబస్‌లో మార్పులుచేయడంపై పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఉన్నత విద్యాశాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషనర్ తరఫు న్యాయవాది బూర రమేశ్ వాదనలు వినిపిస్తూ.. సివిక్స్‌ను పొలిటికల్ సైన్స్‌గా మారుస్తూ ఇంటర్ బోర్డు సెక్రటరీ ఈ ఏడాది జూలైలో ఉత్తర్వులు జారీచేశారని, ఇందుకు ఆయనకు అధికార పరిధి లేదని తెలిపారు. జస్టిస్ టీ వినోద్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. వివరాలు సమర్పించాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

## నూతన సభ్యత్వాలకు 'టీటా' ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశంలోని ముఖ్య నగరాలు, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో విస్తరించిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) నూతన సభ్యత్వాలను ఆహ్వానిస్తున్నది. టీటాకు చెందిన గ్లోబల్ కమిటీ కాలపరిమితి ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో సభ్యత్వాల నమోదు చేపడుతూ ఐటీ ఉద్యోగులు చేరవచ్చని టీటా గవర్నింగ్ కౌన్సిల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఔత్సాహికులు సభ్యులుగా చేరవచ్చని, నామినేషన్లు పంపేవారు telanganait<\@>gmail.com ఈ మెయిల్‌కు ప్రతిపాదించవచ్చని గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు.

## 94 వేలమంది టీచర్లకు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాణ్యమైన విద్యావిధానాన్ని తీసుకొచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న 94,547 మంది టీచర్లకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు మొదటిదశ, 27 నుంచి 31 వరకు రెండోదశ, జనవరి 2 నుంచి 6 వరకు మూడోదశ, జనవరి 17 నుంచి 21 వరకు నాలుగోదశ శిక్షణ ఇవ్వనున్నామని విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపా రు. టీచర్లు ఎప్పటికప్పుడు శిక్షణ పొందడం వల్ల బోధన నైపుణ్యాలు తెలుస్తాయని చెప్పా రు.

## మొక్కల పెంపకంలో తెలంగాణ ముందంజ

వ్యవసాయం, అటవీరంగాల్లో ఫ్లైయాష్ వినియోగం పెరుగాలి

ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ రాజు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మొక్కల పెంపకంలో తెలంగాణ రాష్ట్రం చాలా ముందంజలో ఉన్నదని ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ రాజు కితాబిచ్చారు. పర్యావరణ కాలుష్య నివారణలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయని, ఆ రంగంలో ఫ్లైయాష్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయం, అటవీ రంగాల్లో ఫ్లైయాష్ వినియోగం బాగా పెరుగాలని, ఇందుకు ప్రత్యేక టెక్నాలజీ మిషన్ అవసరమని చెప్పారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 'వ్యవసాయం, అటవీరంగాల్లో ఫ్లైయాష్ ఉపయోగం' అనే అంశంపై పీజేటీఎస్‌ఏయూ, సెంటర్ ఫర్ ఫ్లైయాష్ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన రెండ్రోజుల ఈ జాతీయ సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు కావాలనే లక్ష్యం నెరవేరాలంటే ఇలాంటి కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. దేశంలో ప్రతిఏటా 260 మిలియన్ టన్నుల ఫ్లైయాష్ ఉత్పత్తి అవుతున్నదని నారమ్ మాజీ డైరెక్టర్ డీ రామారావు చెప్పారు. 160 మిలియన్ టన్నులను మాత్రమే వాడుతున్నామని, అందులోనూ 99 శాతం సివిల్‌పనులకే వినియోగించుకుంటున్నామని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో ఫ్లైయాష్ బాగా ఉపయోగపడుతుందన్నారు. రైతులకు ఉపయోగపడే ఇలాంటి సదస్సులు వర్సిటీలో నిర్వహించడం చాలా సంతోషకరమని పీజేటీఎస్‌ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీ-ఫార్మ్ సెక్రటరీ జనరల్ డాక్టర్ విమల్‌కుమార్, సీపీడబ్లూడీ ఏడీజీ ఆర్కే కౌశల్, వర్సిటీ పరిశోధన సంచాలకుడు డాక్టర్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జోరందుకొన్న ఫాస్టాగ్

- తొలిరోజు 60,908 వాహనాలు అనుసంధానం.. రూ.1.48 కోట్ల వసూళ్లు
- రెండోరోజు 70,919 వాహనాల అనుసంధానంతో రూ.1.43 కోట్ల వసూళ్లు



మంగళవారం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ స్టిక్కర్లతో వెళ్తున్న వాహనాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టోల్‌ప్లాజాల వద్ద చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫాస్టాగ్ విధానం క్రమంగా జోరందుకొన్నది. తప్పనిసరిగా ఫాస్టాగ్‌తో అనుసంధానం చేసుకోవాల్సిరావడం, ఖాతా నుంచే చెల్లింపులు జరిగిపోతుండటంతోపాటు టోల్‌ప్లాజా నిర్వాహకులు నగదుచెల్లింపు కౌంటర్లను పెంచి మిగిలిన కౌంటర్ల సంఖ్యను తగ్గించడంతో వాహనదారులు ఫాస్టాగ్‌కు మళ్లుతున్నారు. రెండ్రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా (హైదరాబాద్ రీజియన్‌లో) లక్షకుపైగా వాహనాలు ఫాస్టాగ్‌తో అనుసంధానమయ్యాయి. హైదరాబాద్ రీజియన్‌లోని మొత్తం 18 టోల్‌గేట్ల వద్ద ఫాస్టాగ్ ద్వారా తొలిరోజు (ఈ నెల 15 అర్ధరాత్రి నుంచి 16 అర్ధరాత్రి వరకు) రూ.1.48 కోట్లు వసూలయ్యాయి. 60,908 వాహనాలు ఫాస్టాగ్‌తో అనుసంధానమయ్యాయి. రెండోరోజున రూ.1,43,15,065 వసూలయ్యాయి. 70,919 వాహనాలు ఫాస్టాగ్ తీసుకున్నాయి. రాష్ట్రంలోని 18 టోల్‌గేట్లలో జరిగిన మొత్తం వసూళ్లలో ఫాస్టాగ్ ద్వారా జరిగిన వసూళ్లు 53.59 శాతం, ఆన్‌లైన్ ద్వారా జరిగిన వసూళ్లు 0.98 శాతం ఉన్నాయి.

**పంతంగి టోల్‌ప్లాజా టాప్**

ఫాస్టాగ్ వసూళ్లల్లో పంతంగి టోల్‌ప్లాజా రూ.16.64 లక్షలతో అగ్రస్థానంలో నిలువగా.. సూర్యాపేట పరిధిలోని కొరల్‌పాడ్ టోల్‌ప్లాజా రూ.16.18 లక్షల వసూళ్లతో ద్వితీయస్థానంలో నిలిచింది. పుల్లూరు, రాయికల్, చిలకల్, శాకాపూర్ టోల్‌ప్లాజాల్లో రూ.10 లక్షల నుంచి రూ.14 లక్షల మేరకు వసూళ్లు జరిగాయి. అయితే నిర్మల్ సమీపంలోని దిలావర్‌పూర్ టోల్‌ప్లాజా పరిధిలో ఒక్క ఫాస్టాగ్ కూడా నమోదుకాలేదు.

**ఆన్‌లైన్‌లోనే ఎక్కువ చెల్లింపులు**

టోల్‌ప్లాజాల్లో వాహనదారులు ఎక్కువగా బ్యాంకు కార్డులు, పేటీఎంలాంటి ఖాతాల నుంచి ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు జరుపుతున్నారు. ఈ నెల 14 నుంచి మంగళవారం వరకు మొత్తం 64,392 మంది వాహనదారులు ఆన్‌లైన్‌లో ఫాస్టాగ్ తీసుకున్నారు. 14న అత్యధికంగా 58,321 మంది ఆన్‌లైన్‌తో అనుసంధానం చేసుకోగా.. ఆదివారం 2,587 మంది, సోమవారం 1,810 మంది, మంగళవారం 1,674 మంది వాహనదారులు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా ఫాస్టాగ్ తీసుకున్నారు.

## ఎస్సెస్సీ బోర్డులో రికార్డుల డిజిటలైజేషన్

పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఎస్సెస్సీ బోర్డులో పదో తరగతి విద్యార్థుల రికార్డులను భద్రపరిచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు మొదలుపెట్టింది. ఎస్సెస్సీ బోర్డు ఏర్పాటైననాటినుంచి ఇప్పటివరకు విద్యార్థులకు సంబంధించిన సమగ్ర వివరాలతో తయారుచేసిన రికార్డుల భద్రతలో లోపాలు తలెత్తుతున్నాయని, దీనివల్ల కొన్ని జిల్లాలకు చెందిన విద్యార్థుల వివరాల సేకరణలో ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఎస్సెస్సీ బోర్డులోని అన్నిరకాల రికార్డుల డిజిటలైజేషన్‌కు సన్నాహాలు చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఎస్సెస్సీ బోర్డులో పదో తరగతి సర్టిఫికెట్లను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చారు. గత ఐదేండ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ రికార్డులను పాతవిధానంలోనే నిర్వహిస్తున్నారు. వీటిని డిజిటలైజ్ చేయకపోతే భవిష్యత్తులో ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు పరిధిలో ఏటా దాదాపు 5.50 లక్షల మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. టెన్త్ పరీక్షలతోపాటు డీఈడీ, టీసీసీ, క్రాఫ్ట్, నేషనల్ మెరిట్ లాంటి పలురకాల పరీక్షలను ఎస్సెస్సీ బోర్డు నిర్వహిస్తున్నది. ఈ పరీక్షలకు సంబంధించిన రికార్డులను కూడా డిజిటలైజ్ చేయాలని అధికారులు భావిస్తున్నారు.

## జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శులకు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్తగా నియమితులైన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శులకు హైకోర్టు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ సభ్యకార్యదర్శి జీవీ సుబ్రమణ్యం శిక్షణను ప్రారంభించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్‌ను ప్రభావవంతంగా అమలుచేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. లోక్‌అదాలత్‌ల నిర్వహణ, జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ పథకాల అమలు, బాధితులకు పరిహారం, మీడియేషన్ వంటి అంశాలపై వారికి జీవీ సుబ్రమణ్యం శిక్షణ ఇచ్చారు.

## ఏపీలో ఉద్యమ కేసుల ఎత్తివేత

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో పలు ఉద్యమాల సందర్భంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఆ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి కేఆర్‌ఎం కిశోర్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని తుని పట్టణంలో కాపు రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనలో, విశాఖపట్నం జిల్లా బోగాపురం విమానాశ్రయ భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను ప్రభుత్వం ఎత్తివేసింది. గుంటూరు, అనంతపురంసహా వివిధ ప్రాంతాల్లో రిలయన్స్ ఆస్తుల ధ్వంసం చేసిన ఘటనల్లో నమోదైన కేసులను కూడాఎత్తివేశారు.

## దిశ చట్టంపై ఎస్పీలతో ఏపీ డీజీపీ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన దిశ చట్టం అమలుపై ఏపీ పోలీసులు రంగంలోకి దిగారు. మంగళవారం ఏపీ డీజీపీ గౌతంసవాంగ్ అమరావతిలోని తన కార్యాలయంలో ఏపీలోని అన్ని జిల్లాల ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. మహిళలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించడమే దిశ చట్టం ముఖ్య ఉద్దేశమని అన్నారు. వేగంగా కేసు దర్యాప్తు జరుపడంతోపాటు నిందతులను తక్షణమే అరెస్టు చేస్తామని డీజీపీ తెలిపారు. ఏపీలో అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు.

## 23లోపు వివేకా కేసు నివేదిక ఇవ్వండి

ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**అమరావతి:** మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో దర్యాప్తు నివేదికను ఈ నెల 23లోపు సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వివేకా హత్యకేసును సీబీఐకి అప్పగించాలని బీటెక్ రవి వేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. వివేకా హత్యకేసు వివరాలు ఇవ్వాలని హైకోర్టును కోరినట్టు బీటెక్ రవి తరఫు న్యాయవాది సల్మాన్ ఖుర్షిద్ చెప్పారు. 90 రోజుల దాటినా ఈ కేసులో ఇంకా చార్జిషీటు దాఖలు చేయలేదన్నారు. కాగా జనవరి 3 నాటికి వివేకా హత్యకేసులో కౌంటర్ అఫిడవిట్ వేయాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చేనెల 3కు వాయిదా వేసింది.

**కొనసాగుతున్న సిట్ విచారణ**

వివేకా హత్యకేసులో ఏపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ విచారణ కొనసాగుతున్నది. మంగళవారం కడప నగరంలోని సన్‌షైన్ దవాఖానలో రోగులకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. వివేకా హత్య జరిగిన రోజు ఈ కేసులో అనుమానితుడు పరమేశ్ సన్‌షైన్ దవాఖానలో చేరాడు. దీంతో సిట్ బృందం దవాఖానసిబ్బందిని పలు విషయాలపై ప్రశ్నించింది.

## కోట్ల పౌండ్లంటూ నిలువుదోపిడీ

- ఎయిర్‌పోర్టు కస్టమ్స్‌లో పట్టుకొన్నారంటూ నాటకం
- పెండ్లి పేరుతో ప్రభుత్వ ఉద్యోగికి రూ.2 లక్షలకు టోకరా
- అత్యాశను చీటర్లు సొమ్ము చేసుకొంటున్నా మారని జనం




**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** అపరిచితులను నమ్మి అత్యాశకు పోతుండటంతో సైబర్ చీటర్ల వలకు చిక్కి జనం ఇంకా మోసపోతూనే ఉన్నారు. అనామకుడు పెండ్లి పేరుతో ఆడిన నాటకాన్ని గుర్తించని సికింద్రాబాద్‌కు చెందిన ఓ యువతి.. పెద్దమొత్తంలో నగదును మోసపోయి సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగి అయిన మనీషా (పేరు మార్చాం) పెండ్లి సంబంధం కోసం తన ప్రొఫైల్‌ను ఓ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. దీన్ని గమనించిన ఓ చీటర్.. స్కాట్‌లాండ్‌లో భవన నిర్మాణ వ్యాపారినని లోకేశ్ జోషి పేరుతో గత నవంబర్‌లో యువతిని పరిచయం చేసుకొన్నాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇద్దరూ మొబైల్ నంబర్లు ఇచ్చిపుచ్చుకొని మాట్లాడుకొంటున్నారు. దుబాయ్ సైట్‌లో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడని, వైద్య ఖర్చుల కోసం యువతి నుంచి రూ.37 వేలు అకౌంట్‌లో పొందాడు. యంత్రాలు చెడిపోయి పనులు నిలిచిపోయాయని, మరమ్మతులకు అత్యవసరంగా రూ.3.5 లక్షలు కావాలన్నాడు. దాంతో తన వద్ద ఉన్న రూ.60 వేలు పంపించింది. ఆ ఈ నెల నాలుగున ముంబైకి వస్తున్నానని, ఖరీదైన పెద్దగిఫ్ట్‌తో సర్‌ప్రైజ్ చేస్తానని యువతిని నమ్మించాడు. ముంబైకి వచ్చేందుకు బుక్‌చేసిన విమాన టికెట్‌ను కూడా పంపాడు. కాగా, మరుసటిరోజు ముంబై ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ కార్యాలయం నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేసి జోషి అనే వ్యక్తి పెద్దమొత్తంలో బ్రిటన్ కరెన్సీ పౌండ్లు చట్టవ్యతిరేకంగా తీసుకొస్తూ పట్టుబడ్డాడని, కరెన్సీతో పాటు ఆయనను వదిలిపెట్టాలంటే రూ.9.5 లక్షల ట్యాక్స్ చెల్లించాలని సూచించారు. యువతితో మాట్లాడిన మోసగాడు కూడా త్వరగా చెల్లించి తనను విడిపించాలని ప్రాధేయపడ్డాడు. దాంతో మనీషా తన వద్ద రూ. లక్ష ఉన్నదని వారు సూచించిన అకౌంట్లో జమచేసింది. మిగతా డబ్బు కోసం వేధిస్తున్నారని, వెంటనే అకౌంట్లో వేయమని పలుసార్లు చెప్పడంతో.. మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 18 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

# 'స్పర్శ' పుస్తకాలు



**బ్రెయిలీ లిపి.. అంధులకు అక్షరాలు తెలుపుతుంది. కానీ బొమ్మలను తెలుసుకోవాలంటే కొంచెం కష్టమే. గణితం, సామాజిక శాస్త్రంలో అంధులకు ఉపయోగపడే పరికరాల కోసం కృషి జరుగుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఢిల్లీ ఐటీ విద్యార్థులు స్పర్శించే బుక్స్ రూపొందించారు.**

రెయిజ్డ్ లైన్స్ అనేది ఢిల్లీకి చెందిన స్వచ్ఛంద సంస్థ, ఐఐటీ విద్యార్థులు కలిసి అంధ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి ఈ సంస్థ ద్వారా కృషి చేస్తున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నాలుగేండ్ల పాటు పరిశోధన చేసి, నూతన విధానాన్ని ఆవిష్కరించారు. మరింత సులువుగా అంధులకు పాఠాలు చెప్పే విధానాన్ని కనుగొన్నారు. స్పర్శ ద్వారా త్రీడీ ప్రింటింగ్‌తో గణిత శాస్త్రం, రేఖా చిత్రాలు, భూగోళ శాస్త్రాలు చదువుకునేందుకు వీలుగా వినూత్న పద్ధతిని ప్రవేశ పెట్టారు. క్లిష్టమైన రేఖాగణితం, సైన్సు వంటి సబ్జెక్టులను బొమ్మల స్పర్శ ద్వారా కొత్తగా పాఠాలు నేర్పుతున్నారు. విజ్ఞాన శాస్త్ర సంబంధిత అంశాలను అర్థం చేసుకునేలా పాలి వినైల్ క్లోరైడ్(పివిసి) పేపర్ పై బొమ్మలను ముద్రిస్తారు. చేతులతో తడుముకుంటూ అంధ విద్యార్థులు వాటిని గుర్తిస్తారు. అంధులు బ్రెయిలీ లిపితో పుస్తకాల్లో ఉండే అక్షరాలను మాత్రమే గుర్తించగలుగుతున్నారు. బొమ్మలను గుర్తించే వీలు ఆ లిపిలో లేకపోవడం వల్ల దానికి ప్రత్యామ్నాయంగా మరొక పద్ధతిని ప్రవేశ పెట్టాల్సి వచ్చిందని పరిశోధకుల్లో ఒకరైన పుల్కిత్ సప్ర చెబుతున్నారు. దేశ చిత్ర పటాలు, సామాన్య శాస్త్రంలో ఉండే బొమ్మలు, గణితంలో గ్రాఫ్స్ వంటి వాటిని సులువుగా అర్థం చేసుకునేందుకు ఈ నూతన విధానం ఎంతో ఉపయోగపడుతున్నది. భవిష్యత్‌లో మరింతగా అంధ విద్యార్థులు పాఠాలు నేర్చుకునేందుకు మరిన్ని పుస్తకాలను రూపొందించి వారిలో విజ్ఞాన కాంతులు నింపే ప్రయత్నం చేస్తామని పరిశోధక బృందం అంటున్నది. ఈ త్రీడీ ప్రింటింగ్‌తో 6 నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను రూపొందించేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సంస్థ ముందుకు వచ్చింది.

# జున్నుతో ఎన్నో లాభాలు..



**సాధారణంగా జున్ను అనగానే నోరూరించే పదార్థం. ఇది నోటికి రుచి అందించడమే కాదు. శరీరానికి ఆరోగ్యాన్ని, మొహానికి అందాన్నీ ఇస్తుంది. అటువంటి జున్నులో విటమిన్లు పుష్కలంగా దొరుకుతాయి.**

- జున్నులో విటమిన్–డి పుష్కలంగా ఉంటుంది. శరీరంలో డి–విటమిన్ లోపంతో కలిగే ఆస్టియోపోరోసిస్ లోపాలను అధిగమించడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతో పాటు పుష్టిగా ఉంటారు.
- విరేచనాలు, మలబద్ధకానికి జున్ను విరుగుడులా పని చేస్తుంది. జున్నుతో శరీరంలో రోగనిరోధక శక్తికూడా పెరుగుతుంది.
- సన్నగా ఉన్న వారు క్రమం తప్పకుండా జున్ను తీసుకుంటే శరీరాకృతిలో మార్పులు గమనించవచ్చు. జున్నులోని ప్రోటీన్లు శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. దీంతోపాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది.
- అందమైన ముఖంకోసం జున్నును ఉపయోగించవచ్చు. ఒక స్పూన్ ఓట్స్‌లో, రెండు స్పూన్ల జున్ను వేసి పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు మందంగా పెట్టుకోవాలి. పది నిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
- వాతావరణ కాలుష్యం వల్ల ముఖం అలసిపోయి, నిర్జీవంగా మారుతుంది. అలాంటపుడు జున్నుతో మర్దన చేయాలి. యాంటీఏంజిల్ గుణాలు కలిగిన జున్ను ఈ సమస్యను పరిష్కరిస్తుంది.

## వంటింటి చిట్కాలు

- వెల్లుల్లిపాయలను చిదిమి గాజుసీసాలో వేసి అందులో ఒక కప్పు నూనెపోసి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచాలి. అవసరమైనప్పుడు పనిగట్టుకొని నూరకుండా ఈ నూనె ఒక స్పూన్ ఉపయోగిస్తే సరిపోతుంది.
- పుదీనా ఆకులను టేబుల్‌పై ఉంచినట్టయితే దాని నుంచి వచ్చే వాసనకు ఈగలు, దోమలు దగ్గరకు రాకుండా ఉంటాయి.
- బ్రెడ్ కొన్నిరోజులకే వాసన వస్తుంటే ముక్కల్లో నీరుపోసి అల్యూమినియం ఫాయిల్లో చుట్టి 10 నిమిషాలు ఓవెన్‌లో వేడిచేస్తే తాజాగా ఉండడంతోపాటు వాసన మటుమాయమవుతుంది.
- ఆపిల్ ముక్కలను 10 నిమిషాలపాటు ఉప్పు నీటిలో ఉంచి తీస్తే ముక్కలు నల్లబడకుండా ఉంటాయి.
- కుక్కర్ మూతకు ఉన్న ఆవిరి రంధ్రం మూసుకుపోకుండా ప్రతిరోజూ శుభ్రపరచాలి. ఆవిరి త్వరగా రావడానికి, పదర్థాలు ఉడికేందుకు పెద్ద మంట పెట్టాలి.

వారంతా డ్వాక్రా సంఘాల మహిళలు. ప్రతియేటా తమ ప్రాంతంలో ప్రకృతి ప్రసాదించిన ఫలాలను వృథాగా పోనివ్వకూడదని కలిసికట్టుగా నిర్ణయం తీసుకున్నారు. శీతాకాలం సీజన్‌లో విరివిగా దొరికే సీతాఫలాలతో ఓ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం పై అధికారులను కలిశారు. తమ ఆలోచన చెప్పి.. ఆర్థికంగా సాయమడిగారు. 'సెర్ప్' అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఓ యూనిట్‌ను నెలకొల్పారు. కమిటీలుగా, సంఘాలుగా ఏర్పడ్డ మహిళలు కష్టపడి లాభాల 'రుచి' చూశారు. వారిని చూసి మరికొంతమంది ముందుకొచ్చారు. మరో రెండు యూనిట్లు ఏర్పడ్డాయి. ఈ సీజన్‌లో వారి లాభం ఎంతో తెలుసా? అక్షరాల 23 లక్షల రూపాయలు. సీతాఫలాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా లాభాలు ఆర్జిస్తూ.. వందల మంది మహిళలకు ఉపాధి చూపిస్తున్న నారాయణపేట జిల్లా మహిళా సంఘాల విజయపథంపై 'జిందగీ' అందిస్తున్న కథనం.



# రాత మార్చిన సీతాఫలం



బంగారం, చేనేత వస్త్రాలతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన నారాయణపేట జిల్లా ఇప్పుడు ఒక ప్రత్యేక గుర్తింపును పొందింది. కారణం సీతాఫలాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు. నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్ మండలాల్లో ఏటా నాలుగు వందల టన్నులకు పైగా సీతాఫలాలు ఉత్పత్తి అవుతాయి. అవికూడా అడవుల్లో, కొండల్లో దొరికేవే. వాటిని స్థానిక మహిళలు పట్టణాలకు తీసుకొచ్చి అమ్మేవారు. అయినా విస్తారంగా ఉన్న సీతాఫల చెట్లతో చాలా పండ్లు వృథాగా పొయ్యేవి. ఈ క్రమంలో దామరగిద్దకు చెందిన డ్వాక్రా మహిళలు ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించారు. జిల్లా సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) అధికారులను కలిసి దామరగిద్దెలో 'ఫుడ్ ప్రాసెసింగ్' యూనిట్‌ను నెలకొల్పాలని కోరారు. దీంతో వారు ఇలాంటి యూనిట్ల ఏర్పాటులో అనుభవం ఉన్న 'శ్రీజన్' ఎన్జీఓను యంత్ర, సాంకేతిక సహాయం అందించాలని కోరారు. శ్రీజన్ సభ్యులు సుముఖత వ్యక్తం చేసి.. స్థానిక మహిళా సంఘాలను వారు రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ విజయవంతంగా కొనసాగుతున్న యూనిట్లను, పని విధానాన్ని చూపించారు.

**దామరగిద్దలో మొదటి కేంద్రం..**
జిల్లాలో సీతాఫలాలు ఎక్కువగా ఉత్పత్తి ఆయ్యే దామరగిద్దలో మొదట ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పారు. అందుకు కావల్సిన ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించింది. దాంతో యంత్రాలు, సాంకేతిక సామగ్రిని కొనుగోలు చేసి సీజన్‌ప్రారంభం నాటికి అన్నీ సిద్ధం చేశారు. ఒకే సీజన్‌లో దాదాపు రూ.5 లక్షలకు పైగా లాభాలు వచ్చాయి. దీంతో నారాయణపేట, మద్దూర్ మండలాల్లో కూడా ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకు మళ్లీ ప్రభుత్వం రుణం మంజూరు చేయడంతో మరో రెండు మండలాల్లో ఈ సీజన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. సీతాఫలాలు ఎక్కువగా లభించే 25 గ్రామాలను గుర్తించి, వాటిల్లో గ్రామస్థాయి సేకరణ కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేశారు.

**అడవుల నుంచి యూనిట్‌కు..**
నారాయణపేట, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని అడవుల్లో లభించే సీతాఫలాలను గ్రామస్థాయి కమిటీ గ్రేడ్‌ల వారీగా కొనుగోలు చేస్తుంది. ఇందులో ముగ్గురు మహిళలు ఉంటారు. 'ఏ' కాయలు కిలోకు రూ.12, 'బీ' గ్రేడ్‌కు రూ.10, 'సీ' గ్రేడ్ పండ్లకు కిలోకు రూ.8 చొప్పున ధరను చెల్లిస్తున్నారు. ఈ ముడు మండలాలకు చెందిన మహిళలు, పురుషులే కాకుండా ఇతర మండలాలకు చెందిన వారు సైతం సీతాఫలాలను తీసుకొచ్చి కేంద్రాల వద్ద లాభాలకు విక్రయిస్తున్నారు. ఒక వ్యక్తి రోజుకు రూ.600 వరకు లాభాలను ఆర్జిస్తున్నారు. గతంలో జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి అమ్మేవారు. చాలామంది దళారులను ఆశ్రయించి మోసపోయేవారు. ఇప్పుడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మంచి లాభలను ఆర్జిస్తున్నారు.

**మంచి అవకాశాలు**

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, శ్రీజన్ ఎన్‌జీవో సంయుక్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఈ కేంద్రాల ఏర్పాటుకు మొదట ఆశించిన స్థాయిలో డబ్బులు రాలేదు. అంతా దళారులే దోచుకున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. గుజ్జు తయారీ కేంద్రాల ద్వారా మహిళలే లబ్ధి పొందుతున్నారు. ఇందుకు మా వంతు సహకారం అందించాం.

**- వెంకట్రావు,** కలెక్టర్, నారాయణపేట జిల్లా

**మహిళలే షేర్ హోల్డర్లు..**
ఈ యూనిట్లను ఏర్పాటు చేసేటప్పుడే ఒక్కో మహిళా రూ.500లతో షేర్ హోల్డర్‌గా మారింది. మూడు మండలాల్లోని యూనిట్లలో కలిపి 445 మంది షేర్ హోల్డర్లు ఉన్నారు. మూడు యూనిట్ల నుంచి ఈ సీజన్‌లో వచ్చిన లాభం రూ.23 లక్షల రూపాయలు. వీటిల్లో యంత్ర సామగ్రి ఖర్చులు పోనూ ఒక్కొక్కరు రూ.5వేల వరకు సంపాదించారు. వచ్చే సీజన్‌లో వీరి లాభం దాదాపు రూ.50వేలకు దగ్గర్లో ఉండొచ్చు.

**సమైక్యంగా పనులు..**
మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను కలిపి 'ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ'గా ఏర్పడ్డారు. ఈ కంపెనీకి చైర్‌పర్సన్, డైరెక్టర్లుగా మహిళలే ఉంటారు. ఈసారి చైర్‌పర్సన్‌గా మద్దూర్ మండలం మొమినాపూర్ గ్రామానికి చెందిన సోలా రేణుక ఎంపికయ్యారు. ఈమె రెండేండ్లు పదవిలో కొనసాగుతారు. ఆయా గ్రామాలకు చెందిన పది మంది మహిళలు బోర్డు మెంబర్లుగా ఉన్నారు. వీరు గ్రామస్థాయిలో పండ్లను కొనుగోలు చేసే కమిటీల నుంచి మండలస్థాయిలో ఏర్పాటైన 29 'ఫార్మర్స్ ప్రొడ్యూసర్ గ్రూప్'లను పర్యవేక్షిస్తుంటారు. ఒక్కో మండలానికి ఒక వాహనం ఉంటుంది. గ్రామస్థాయిలో కొనుగోలు చేసిన పండ్లను వాహనం ద్వారా యూనిట్ సెంటర్లకు తరలించి గుజ్జు తీసే ప్రక్రియ వరకూ వీరి బాధ్యత ఉంటుంది.

**మెరుగైన ఫలితాలు**

రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తరహాలో మన వాళ్లు కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీజన్ తరఫున భాగమైనందుకు సంతోషంగా ఉంది. పండ్ల సేకరణ నుంచి గుజ్జు తీసి, అమ్మేవరకూ మేమూ వారికి సహాయం చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని ఇందులో భాగస్వాములను చేయడం ఆనందంగా ఉంది. మంచి లాభాలు గడించేందుకు అనువైన పరిస్థితులున్నాయి.

**- నవీన్,** శ్రీజన్ సంస్థ ప్రతినిధి

**వందల మందికి ఉపాధి**
సీతాఫలాల సేకరణ నుంచి.. ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లలో రోజు వారీ కూలీలుగా వరకూ వందల సంఖ్యలో మహిళలు లబ్ధి పొందుతున్నారు. యూనిట్ సెంటర్లలో కూలీకి వచ్చే వారు కూడా డ్వాక్రా సంఘాల మహిళలే. ఇక్కడ పనిచేసే వారికి రోజుకు రూ.200 కూలి లభిస్తుంది. ఒక్కో యూనిట్‌లో రోజుకు 150 మంది మహిళలకు పని దొరుకుతుంది. ఈ యూనిట్లలో గుజ్జును రెండు రకాలుగా సేకరిస్తారు. చేత్తో తీసిన కిలోగుజ్జుకు మార్కెట్‌లో రూ.225 ధర ఉంటుంది. మిషన్ తీసే గుజ్జుకు ధర కాస్తా తక్కువగా ఉంటుంది. ఈ యూనిట్లలో ఒక మహిళ గంటకు 8 కిలోల గుజ్జుతీస్తే.. ఒక యంత్రం గంటకు 80 కేజీల గుజ్జు తీస్తుంది. అంతటి అడ్వాన్స్ ఉన్న యంత్రాలు అందుబాటులో తీసుకొచ్చారు. ఒక కేజీ గుజ్జుకు 50 గ్రాముల విత్తనాలు వస్తుండడంతో వాటిని కూడా మార్కెటింగ్ చేసే యోచనలో ఉన్నారు.

**ఐస్‌క్రీం కంపెనీలకు గుజ్జు అమ్మకం**
సీతాఫలాల నుంచి తీసిన గుజ్జును పెద్ద ఐస్‌క్రీం కంపెణీలు కొనుగోలు చేస్తున్నాయి. వీటిల్లో ప్రముఖంగా స్కూప్స్ కంపెనీ ఎక్కువ మొత్తం గుజ్జును కొనుగోలు చేస్తున్నది. కేజీ గుజ్జు రూ.225 నుంచి 250 వరకు ధర పలుకుతున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని శాలీమార్, డార్క్ స్టోన్ వంటి కంపెనీలకు కూడా కేజీ రూ.196 నుంచి రూ.225 విక్రయిస్తున్నారు. ఇలా ఈ సీజన్‌లో రూ. 23 లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది మొత్తం 100 టన్నుల సీతాఫలాలను సేకరించి, 12 టన్నుల గుజ్జు తీశారు.

**రోజు కూలీ దొరికింది!**

మాకు తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వస్తుంది. గతంలో మేము కాయలు తెంపి పండ్లుగా మార్చి అమ్ముకునేందుకు చాలా సమయం పట్టేది. ఇప్పుడు చెట్లనుంచి తెంపి నేరుగా ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలిస్తున్నాం. మంచి పరిశుభ్రమైన వాతావరణంలో పనులన్నీ జరుగుతున్నాయి. ఎంత కష్టపడితే అంత లాభం.

**-రేణుక,** ఎఫ్‌పీసీ చైర్‌పర్సన్







... చేకూరి నర్సింహులు
నమస్తే తెలంగాణ ప్రతినిధి, నారాయణపేట

## సిరిముగ్గు

16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు






**ఎ. రాజేశ్వరి,**
కేసముద్రం మండలం,
మహబూబాబాద్

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

# 'మా గొంతును ఎవరూ నొక్కలేరు'

**డిసెంబర్ 12, సాయంత్రం**
పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ జామియా యూనివర్సిటీ విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీ కేవలం మహిళలు నిర్వహించిందే. పాత బాలికల హాస్టల్ నుంచి కొత్త హాస్టల్ వరకూ సాగిందా ర్యాలీ. కేరళకు చెందిన 22 ఏండ్ల లదీదా ఫర్జానా నాయకత్వం వహించింది. ఆమెతో పాటు అదే కేరళకు చెందిన ఆయేషా రెన్నా, యూపీకి చెందిన చందా యాదవ్ ఉన్నారు. ఆయేషా హిస్టరీలో మాస్టర్స్ విద్యారిన్థి. యాదవ్ డిగ్రీ. వీళ్ల నాయకత్వంలో ర్యాలీ విజయవంతం కావడంతో పోలీసులు వీళ్లమీద నిఘా ఉంచారు. రెండ్రోజుల్లోనే అనేక అభియోగాలు మోపారు.

**డిసెంబర్ 15, ఆదివారం..**
జామియా యూనివర్సిటీలో పోలీసుల దమనకాండ మొదలైంది. లోపలికి చొరబడి విద్యార్థులను చావబాదారు. అదే సమయంలో యూనివర్సిటీకి దగ్గర్లోని న్యూఫ్రెండ్స్ కాలనీ, మాతామందిర్ సమీపంలో విద్యార్థినులు కొందరు ఓ ఇంట్లో ఉన్నారు. అందులో ఫర్జానా, ఆయేషా, చందా యాదవ్‌తో పాటు మరో ఐదుగురు విద్యార్థినులు, ఓ విద్యార్థి ఉన్నారు. వీళ్లను గమనించిన ఓ అరడజను పోలీసులు ఇంట్లో నుంచి బయటకు రావాలన్నారు. పోలీసుల తీరును గమనించిన 'ఆయేషా' ధైర్యం చేసింది. 'ఢిల్లీ పోలీస్ గో బ్యాక్' అంటూ అరిచింది. 'పోలీసుల గుంపులో మహిళా పోలీసులు లేకపోవడంతో వాళ్లు వెనక్కి అడుగులేశారు. కానీ ఆ యువతుల స్నేహితుల్లో ఒకర్ని పోలీసులు బయటకు ఈడ్చుకొచ్చారు. 'అరె ఇస్కో ఖీన్చ్ కే మారో' (అతన్ని బయటకు లాగి కొట్టండి) అని పోలీసులు అన్నారు. వెంటనే బయటకు లాగి లాఠీలతో చావబాదారు. అతని పేరు షహీన్ అబ్దుల్లా. యూనివర్సిటీలో మాస్ కమ్యూనికేషన్ స్టూడెంట్. అదేరోజు అతను ప్రెస్ కార్డ్ కూడా తీసుకున్నాడు. దాన్ని పోలీసులకు చూపించినా వారు పట్టించుకోలేదు. 'అతన్ని కొట్టొద్దు' అని ఆయేషా ఎదిరించింది. 'గో బ్యాక్' అని నినాదాలు చేసింది. మరి కొంత మంది యువతులు అతని చుట్టూ రక్షణగా నిలుచున్నారు. 'మాకు ఎలాంటి ఆశ్రయం ఇవ్వొద్దు అని పోలీసులు స్థానికులకు చెప్పారు. ఒకవేళ ఇస్తే వాళ్లను కూడా కొడతాం అని చెప్పినట్టు' విద్యార్థునుల్లో ఒకరైన అన్సారీ చెప్పింది. 'ఇది కేవలం హిందువుల దేశం కాదు. అందరూ సమానమే. పౌరసత్వ చట్టం తప్పు' అని ఆయేషా చెప్పింది. 'మహిళలు మాట్లాడొద్దు, ఇంట్లోనే ఉండాలని అంటారు. కానీ మనం మాట్లాడాలి. మన గొంతును ఎవరూ నొక్కలేరు' అంటున్నారు ఈ విద్యార్థినులు.



అబ్బుల్‌కు రక్షణగా స్నేహితులు, పోలీసులు వెనక్కి వెళ్లాలంటున్న అయేషా రెన్నా



యూనివర్సిటీ ర్యాలీలో చందా యాదవ్, ఫర్జానా, ఆయేషా రెన్నా

నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 18 డిసెంబర్ 2019

### వాట్సప్ మెసేజ్

జీవితంలో కొన్ని సందర్భాల్లో క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. బతుకు భారంగా అనిపిస్తుంది. ఏం చేయాలో తోచదు. అప్పుడు మనం వెతకాల్సింది సాయం చేసే చేతుల కోసం కాదు. మనలో ఉన్న శక్తి కోసం. ఆ శక్తి పేరే ఆత్మ విశ్వాసం. ఎప్పుడైతే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతావో.. అప్పుడు జీవితాన్ని కోల్పోయినట్లే.

### ఏం డైలాగ్ గురూ..



మన అమ్మలు, మన అక్కలు, మన చెల్లెండ్లు, మన కూతుళ్లు బయటికెళ్తే ఇంటికొచ్చేంత వరకు ఎందుకుసార్ భయం భయంగా ఉంటున్నాం. వాళ్లేమైనా అడవుల్లోకి, ఎడారుల్లోకి, బాంబుల మధ్యలోకి వెళ్లిపోతున్నారా? మనలాంటి మనుషుల మధ్యకేగా వెళ్లేది? బయటికెళ్తే చాలు కామంతో చూస్తున్న కొన్ని వేల కళ్ల మధ్యలో నడవాలి సార్ స్త్రీ.

సినిమా: రాఖీ

### నవ్వుకోండాం

ఓ యువకుడు ఇంటర్వ్యూకెళ్లాడు.

అధికారి: ఎలక్ట్రిక్ మోటార్ ఎలా స్టార్ట్ అవుతుందో చెప్పగలవా?

యువకుడు: ఆ చెప్పగలను.. డుర్ర్.. డుర్ర్.. ర్.. ర్.. ర్

అధికారి: స్టాప్.. స్టాప్

యువకుడు: డుర్ర్.. ర్.. ర్.. రు.. రు.. టుప్. టుప్.

### మంచిమాట



మోసం విశ్వవ్యాపితం అయినప్పుడు నిజం చెప్పడం ఒక విప్లవాత్మకమైన చర్య.

- జార్జ్ ఆర్వెల్

---

## టెక్నాలెడ్జీ

# ఒప్పో ఏ8

**ఒప్పో కంపెనీ త్వరలోనే 'ఏ8' పేరుతో ఫోన్‌ను విడుదల చేయనున్నది. డిజైనింగ్, ఫీచర్లతో ఇది ఆకట్టుకునేలా ఉందని టెక్ రిపోర్టులు అంచనా వేస్తున్నాయి.**

**ఫీచర్లు**

| | |
|---|---|
| డిస్‌ప్లే | :6.50 అంగుళాలు |
| రిజల్యూషన్ | :720x1600 పిక్సెల్స్ |
| ప్రాసెసర్ | :2.3 జీహెచ్‌ఎస్ ఆక్టాకోర్ ప్రాసెసర్ |
| ఓఎస్ | :ఆండ్రాయిడ్ 9 పీ |
| ర్యామ్ | :2, 4 జీబీ వేరియెంట్ |
| స్టోరేజీ | :124 జీబీ |
| ప్రైమరీ కెమెరా | :12+8+2 ఎంపీ |
| సెల్ఫీ కెమెరా | : 8 ఎంపీ |
| బ్యాటరీ | :4230 ఎంఏహెచ్ |



## గూగుల్ అసిస్టెంట్‌లో కొత్త ఫీచర్



గూగుల్‌తో భాషా అనువాదం ఇంక మరింత సులభం అవనుంది. 'దుబాసీ' పేరుతో ఈ ఫీచర్ గూగుల్ అసిస్టెంట్‌లోకి రానుంది. ఈ ట్రాన్సిలేషన్ ఫీచర్‌తో 44 ప్రపంచ భాషలను తెలుసుకొనే వీలుంది. మన దేశంలోని బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మారాఠా, తమిళ్, తెలుగు, ఉర్దూ భాషలు ఈ ఫీచర్‌లో పని చేస్తాయి. మనకు తెలిసిన భాషలో మాట్లాడి, కావాల్సిన భాషలలోకి ట్రాన్సిలేషన్ చేయాలి అని గూగుల్ అసిస్టెంట్‌కు చెప్పడమే మన పని. అది వెంటనే ఆ భాషలోకి ట్రాన్సిలేట్ చేసి ఇస్తుంది. వివిధ ప్రాంతాలకు వెళ్లిన వాళ్లకు అక్కడి భాష తెలియక పోతే ఈ ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు.

గూగుల్ ట్రాన్సిలేటర్ ఓపెన్ చేసి 'be my Tamil translator", "Hey Google, help me English From Telugu అని కమాండ్ ఇస్తే చాలు. మీకు వచ్చిన భాషలో మాట్లాడితే మీకు కావాల్సిన భాషలో అనువదించి ఇస్తుంది. కొత్త భాషలు నేర్చుకోవాలనుకొనే వారికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది.

# స్వచ్ఛమైన గాలికి..

**చూడడానికి చిన్నగానే కనిపిస్తాయి. కానీ చాలా మేలు చేస్తాయి. అసలే కాలుష్య సమస్య పెరుగుతున్న ఈ రోజులు వీటి అవసరం ఎంతో ఉంది. అర చేతిలో ఇమిడిపోయి మనకెంతో ఉపయోగపడుతున్నాయి 'ఎయిర్ ప్యూరీఫయర్లు'. ఆయా రకాల కంపెనీలు వీటిని సాధారణ బడ్జెట్ ధరలోనే అందిస్తున్నాయి..**



**డైసన్ :** ఎక్కువ కాలుష్య పరిధిలో నివసించే వారికి డైసన్ ప్యూర్ కూల్ ఎయిర్ ప్యూరిఫయర్ మంచి గ్యాడ్జెట్. స్మార్ట్ ఫీచర్లను కలిగిన ఇది గదిలోని గాలిని శుభ్రపరచడంలో కీలకంగా పని చేస్తుంది. హెపా ఫిల్టర్ టెక్నాలజీని కలిగి ఉంది, వైఫైతో స్మార్ట్ ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. గాలిలోని హానికర సూక్ష్మ జీవులను నాశనం చేస్తుంది.

**'ఎయిర్‌బాక్స్ :** అత్యాధునిక ఎయిర్ ఫిల్టర్. బాత్రూముల్లోని సూక్ష్మజీవులు మొదలుకొని రసాయనిక రంగుల్లోని హానికారక కాలుష్యాల వరకూ అన్నింటినీ ఇట్టే పీల్చేసుకుని స్వచ్ఛమైన గాలిని అందిస్తుంది. అప్పుడప్పుడూ ఇందులోని ఫిల్టర్‌ను బయటకు తీసి శుభ్రం చేసుకోవడం ఒక్కటే మనం చేయాల్సిన పని. యూవీ ఎల్‌ఈడీ లైటు సాయంతో ఓ నానో రియాక్టర్ హానికారక రసాయన కణాలను ధ్వంసం చేస్తుంది.





**పిలిప్స్ :** కలుషితమైన గాలిని స్వీకరించి స్వచ్ఛమైన గాలిని విడుదల చేస్తుంది పిలిప్స్ ఎయిర్ ప్యూరిఫయర్. ఆస్థమా వంటి శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడే వారు దీన్ని ఉపయోగించడం ద్వారా కాస్త ఉపశమనం పొందవచ్చని కంపెనీ చెబుతున్నది. గాలిలోని హానికర కణాలను 99 శాతం తొలగిస్తుంది ఈ ప్యూరిఫయర్. నైట్ మోడ్, డే మోడ్, దీని పరిధిలోని గాలి ఎంత స్వచ్ఛంగా ఉందనేది కూడా చూపించే ఫీచర్లను కలిగి ఉంది.

**ఇలాంటి ఎన్నో రకాల ఎయిర్ ప్యూరీఫయర్లు అమెజాన్, ఫ్లిప్‌కార్టు వంటి ఆన్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి.**

---

'చాలు చాలు ఈ హరియే మాకును సకల క్రియలకు నాయకుడు. నాలుక తుదనే గీతడుండగా నలుగడ ఎవ్వనీ వెదకేవు' అని అన్నమయ్య కీర్తనలు ఆలపించాలన్నా. 'అల్లాహూ అక్బర్ అల్లా' అంటూ రాగ యుక్తంగా పాడాలన్నా. 'నీవుంటే నాకు చాలు యేసయ్యా. నీవెంటే నేనుంటానేసయ్యా. నీ మాట చాలయ్యా నీ చూపు చాలయ్యా. నీ తోడు చాలయ్యా. నీ నీడ చాలయ్యా.' అంటూ దైవారాధన చేయాలన్నా ఆ ఒక్కడికే సాధ్యం. అతడు సంగీత విద్వాంసుల కుటుంబంలో జన్మించలేదు. ఆ నేపథ్యంలో పెరగలేదు కూడా. కానీ భావయుక్తంగా పాడగలడు. ఏ రాగమైనా ఆలపించగలడు. అంతకు మించి చెప్పాలంటే.. అతడో ముస్లిం యువకుడు. పేరు షేక్ ఖాజా ఇమ్‌దాద్. కర్ణాటక సంగీతాన్ని ఔపోసన పడుతూ భావితరాలకు కళను పరిచయం చేస్తున్న వారధి. కర్ణాటక శాస్త్రీయ సంగీతాన్ని కంఠంలో భద్రపర్చుకున్న ఆయనను 'యువ' పలుకరించింది.

# ఈ గాత్రం.. దేవుడికే అర్పితం!



కర్ణాటక సంగీతంలో త్రిమూర్తులైన త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రులు వారి ఇష్ట దేవీ, దేవతలపై రచనలు చేసి జీవితాన్ని తరింపజేసుకున్నారు. వారితో పాటు క్షేత్రయ్య, భద్రాచల రామదాసు, అన్నమయ్య, మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, కేరళ వాగ్గేయ కారులు స్వాతితిరుణాల్ మహారాజు, కేశవ పిళ్లై కన్నడలో రచించిన శ్రీ పురందరదాసు, కనకదాసు, తమిళ వాగ్గేయకారులు గోపాలకృష్ణ భారతి, పాపనాశం శివన్, వెంకట సుబ్బయ్య, ఉత్తర భారతదేశ వాగ్గేయకారులు మీరాబాయి, తులసీదాస్, కబీర్‌దాస్, సూర్‌దాస్ వీరంతా తమదైన శైలిలో భగవంతుడిని స్తుతించారు. తరించారు. వీరందరి కీర్తనల్ని ఆలపిస్తూ తరిస్తున్నాడు షేక్ ఇమ్‌దాద్. ఓవైపు రోజూ నమాజ్ చేస్తూనే మరోవైపు గాత్రాలాపన చేస్తున్నాడు.

**ఆసక్తి**

సినిమాలు సమాజంపై ప్రభావం చూపుతాయా? కచ్చితంగా.. పాజిటివ్‌గా చూస్తే జీవితాన్ని నిలబెట్టే అంత. నెగెటివ్ కోణంలో 'జీవితాన్ని పడగొట్టే అంత'. అతడు చూసిన ఆ సినిమాలు కూడా అతడి జీవితాన్ని మార్చేశాయి. ఆంక్షలు, అవమానాలు, బెదిరింపులు అన్నింటినీ అతడి ఆత్మవిశ్వాసం జయించింది. షేక్ ఇమ్‌దాద్ ఓ సారి టీవీలో చూసిన 'శంకరాభరణం', 'స్వాతికిరణం', సినిమాలు అతనిని కొన్నాళ్లు నిద్రపోనివ్వలేదు. 'సినిమాలో మాదిరిగా నేనెందుకు పాడకూడదు? అనుకున్నాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు స్కూల్లో పాటల పోటీ నిర్వహించారు. అప్పుడు కొందరు ఆలపించిన భక్తి పాటలు అతడిని ఆకర్షించాయి. ఆ పాటల్లోని మాధుర్యం షేక్ ఇమ్‌దాద్‌ను పాటల వైపు లాక్కెళ్లాయి. షేక్ ఇమ్దాద్ అందరిలాగే రోజూ స్కూలుకెళ్లేవాడు. వచ్చేవాడు. దారిలో ఉండే గుడి. ఆ మైక్‌లోంచి వచ్చే పాటలు ఎంతో వినసొంపుగా అనిపించేవి. రోజూ స్కూలుకు వెళ్తున్నప్పుడూ, వస్తున్నప్పుడు పాటలు వింటూ ఉండేవాడు.

**అభ్యాసం**

కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలంటే తెలుగు తప్పనిసరి. కానీ షేక్ ఇమ్దాద్‌కు తెలుగే సరిగ్గా మాట్లాడవచ్చేది కాదు. ఇంట్లోవాళ్లు, చుట్టుపక్కల వాళ్లు మాట్లాడేది హిందీ. చదివేదేమో ఇంగ్లీష్ మీడియం. దీంతో స్కూల్లో తెలుగు మాట్లాడే వారితో స్నేహం పెంచుకున్నాడు. వారితో మాట్లాడి, సినిమాలు చూసి స్పష్టంగా తెలుగు మాట్లాడడం నేర్చుకున్నాడు. పదో తరగతి పూర్తయ్యాక బాలభవన్‌లో సంగీతం నేర్పిస్తున్నారని తెలుసుకున్నాడు. తనకూ సంగీతం నేర్పించాలని బాలభవన్‌కు వెళ్లాడు. 'ఇతర మతస్తులకు శాస్త్రీయ సంగీతం నేర్పించం' అని తిప్పి పంపించారు. కానీ పట్టు వదలకుండా వరుసగా 15 రోజులు రోజూ బాలభవన్‌కు వెళ్లడం.. అక్కడి గురువులను సంగీతం నేర్పించమని ప్రాధేయపడడం చేశాడు. అతడిలో ఉన్న ఆసక్తిని గమనించి ఒక్క అవకాశం ఇచ్చారు నిర్వాహకులు. విజయలక్ష్మీ టీచర్ షేక్ ఇమ్‌దాద్‌తో అక్షరాలు దిద్దించారు. అలా ఇంటర్ చదువుతూనే సంగీతంలో పాఠాలు నేర్చుకున్నాడు. బాలభవన్‌లో నేర్చుకున్న పాఠాల్ని సాధన చేసేందుకు ఇంట్లో కుటుంబీకులు అంగీకరించేవారు కాదు. ఇతర మతాలకు చెందిన పాటల్ని ఎలా పాడతావని తిట్టేవారు. స్నేహితుల బిల్డింగ్‌లపైనా, గుళ్లల్లో, ఊరి చివరన ఇలా ఎక్కడ దొరికితే అక్కడ సాధన చేసేవాడు. అనంతరం ప్రభుత్వ శారద సంగీత కళాశాలలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు చేశాడు. రోజూ సాయంత్రం పూట క్లాస్‌లకు వెళ్తుండేవాడు. అనంతపురంలో టీచర్స్ ట్రైనింగ్ కోర్సులో డిప్లొమా పూర్తి చేశాడు. శారద సంగీత కళాశాలలో మళ్లీ రెండేళ్ల డిప్లొమా కోర్సు చేశాడు. సర్టిఫికెట్ కోర్సు అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి సంగీత గాత్ర విభాగంలో ఎంఏ చేశాడు. దూరవిద్యలో ఎంఏ ఇంగ్లీష్ కూడా చదివాడు.

**ఆలాపన**

'సంగీతం బువ్వ పెట్టదిరా అంటే వినలేదు. ఇప్పటికైనా ఏదైనా ఉద్యోగంలో చేరు. నీ తోటి వాళ్లు ఇంత సంపాదిస్తున్నారు.' అని ఇంటివాళ్ల మందలింపు. తప్పని పరిస్థితుల్లో తిరుపతిలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు అభిరుచిని కొనసాగించాడు. అన్నమయ్య కీర్తనలు పాడుతూ ఏడుకొండలు సైతం ఎక్కాడు. గుడికి చేరుకోగానే 'ఎంత మాత్రమున' అన్నమాచార్య కీర్తన ఎత్తుకున్నాడు. స్వామి వారి ఎదుట నిలబెట్టి మొత్తం పాట పాడించి అక్కడి అర్చకులు ఇమ్‌దాద్‌కు అద్భుత అవకాశాన్నిచ్చారు. తిరుపతిలో ఉద్యోగం చేస్తున్నన్నాళ్లు ఇతర రాష్ట్రాల కళాకారులు ఎందరో పరిచయమయ్యారు. వారి దగ్గర్నుంచి తమిళం, కన్నడం, మలయాళం ఇలా 12 భాషల్లో కీర్తనలు నేర్చుకున్నాడు. వారందరికీ తెలుగులో కీర్తనలు నేర్పించాడు కూడా.

**అధ్యాపకుడిగా..**

నిల్చున్నా సంగీతమే. కూర్చున్నా సంగీతమే. అలా సంగీతం ఓ పట్టాన నిద్రపోనివ్వలేదు షేక్ ఇమ్‌దాద్‌ను. ఉద్యోగాన్ని వదిలి సినిమాల్లో పాటలు పాడేందుకు ప్రయత్నాలు మొదలెట్టాడు. రెండు మూడు చోట్ల పాటలు పాడించి డబ్బులు ఎగ్గొట్టారు. మరికొన్ని చోట్ల 'మా సినిమాలో పాటలు పాడడానికి నీకో అవకాశం ఇస్తాం ఎంతిస్తావ్!' అని ప్రశ్నించారు. విసుగెత్తి సినిమా ప్రయత్నాలు విరమించాడు. ఆలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో కీర్తనలు ఆలపిస్తున్నాడు. పిల్లలకు కర్ణాటక శాస్త్రీయ సంగీతం హోం ట్యూషన్స్ చెబుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

### పిల్లలు కళల వారధులవ్వాలి

సంగీతంతో క్రమశిక్షణ అలవడుతుంది. మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. శాస్త్రీయ సంగీత బోధకులకు అవకాశాలు ఇవ్వాలి. పాఠశాలల్లో పిల్లలు నేర్చుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా కర్ణాటక శాస్త్రీయ సంగీతాన్ని ఆదరించాలి. పిల్లలు నేర్చుకొని కళల్ని ముందు తరాలకు అందించాలి. నేను గతంలో కోమాండూరి శేషాద్రి, ఎస్వీ రమణమూర్తి, ఎస్‌ఎల్‌ఎన్ శాస్త్రీ, దగ్గర సంగీతంలో మెళకువలు నేర్చుకున్నా. ప్రస్తుతం రాఘవాచారి, డాక్టర్ శేషులత, వైద్యనాథన్ బాలసుబ్రహ్మణ్యం దగ్గర మరింత లోతుగా సంగీత పాఠాలు నేర్చుకుంటున్నా. గురువులందరికీ నా పాదాభివందనాలు.

–షేక్ ఖాజా ఇమ్‌దాద్

### అనారోగ్యం వెంటాడినా ఆగని పాట



మతాలకు అతీతంగా పాటలు పాడుతూ షేక్ ఇమ్‌దాద్ మతసామరస్యాన్ని చాటుతున్నాడు. ఏడాది క్రితం ఇమ్‌దాద్ గుండెకు జబ్బు చేసింది. అనంతరం స్టంట్ వేయించుకున్నాడు. ప్రస్తుతం మరిన్ని వైద్య చికిత్సల కోసం రూ.3 లక్షలు అవసరం ఉంది. వైద్యం చేయించుకునే స్థితిలో లేని ఇమ్‌దాద్ అవకాశాల కోసం వెతుకుతున్నాడు. పెండ్లిళ్లు, ఫంక్షన్లు నగర సంకీర్తనలు, క్రిస్మస్ వేడుకలు ఇలా ఎక్కడ అవకాశం దొరికినా భక్తి పాటలు పాడడానికి రెడీగా ఉన్నాడు. గుండెకు స్టంట్ వేసినప్పటికీ అనర్గళంగా ఊపిరి బిగబడుతూ మాధుర్యంతో పాడుతూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఇమ్‌దాద్ చికిత్సకు సాయం అందించాలన్నా, హోం ట్యూషన్స్ కోసమైనా 98493 26770 నంబర్‌లో సంప్రదించవచ్చు.



...పడమటింటి రవికుమార్
కోనేటి వెంకట్

---

## బాలీవుడ్ కోసం ఫొటోషూట్





2019 మిస్ ఇండియా సెకండ్ రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ అమ్మాయి 'సంజనా విజ్' చూడముచ్చటైన అందాలతో కట్టిపడేస్తున్నది. సమయం దొరికినప్పుడల్లా హొయలు ఒలకబోస్తూ, నీలి కళ్లతో ఆకట్టుకుంటున్నది. బాలీవుడ్‌లో సినిమా ఆఫర్ల కోసం ప్రయత్నిస్తున్న సంజనా.. ఇటీవల మలేషియాలో ఓ ఫొటోషూట్ చేసింది. చుట్టూ పచ్చటి ప్రకృతి, మంచు కురుస్తున్న వేళ చేసిన ఆ ఫొటోషూట్ అందరికీ తెగ నచ్చేసింది. ఈ ఫొటోషూట్ కోసం ఎంతో టాలెంట్ ఉన్న టీమ్ పనిచేసిందని సంజనా ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపింది. మలేషియాలోని అందమైన లొకేషన్లు, అక్కడి వాతావరణాన్ని ఎంజాయ్ చేసిందట ఈ ముద్దుగుమ్మ. 'మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఫుడ్ కూడా రుచికరంగా ఉంది. ఇలాంటి మరచిపోలేని అనుభవాన్ని నాకు కలిగించిన ప్రతి ఒక్కరికీ థాంక్స్' అంటూ పోస్ట్ పెట్టింది సంజన విజ్. డాన్సింగ్, యాక్టింగ్ అంటే ఇష్టపడే సంజన బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నిస్తున్నది. 2019కి ఆమె మిస్ ఇండియా తెలంగాణ కాబట్టి.. ప్రస్తుతం ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ప్రస్తుతం ఆమెకు భారీ సినిమా ఆఫర్లేవీ లేవు. ఐశ్వర్యరాయ్‌లా నీలి కళ్లు ఉండడం ఆమెకు ప్లస్ పాయింట్. అందువల్ల ఫ్యాషన్ షోలు, స్పెషల్ ఈవెంట్ ప్రోగ్రామ్స్‌తో క్రేజ్ తెచ్చుకునే అవకాశాలున్నాయి.

## ఆఫీసులో ఇలా ఉండండి!

**అన్ని బంధాలకన్నా స్నేహ బంధం గొప్పదంటారు. ఎంత మంచి ఫ్రెండ్ అయినా కొన్ని విషయాలు పర్సనల్‌గా ఉంచుకోవాలి. లేదంటే అందరిలో చులకన అవ్వడంతో పాటు గాసిప్స్‌కు దారితీస్తుంది. సహోద్యోగులతో ఎలా మసలుకోవాలో తెలుసుకోండి.**



- చాలామంది ఉద్యోగినులు తమకు సంబంధించిన చాలా విషయాలు సహోద్యోగులతో పంచుకుంటే భారం తగ్గుతుందనుకుంటారు. అదేవిధంగా మనసులోని విషయాలను పంచుకుంటారు.
- అవి కొన్నిరోజులకు గాసిప్పులకు దారితీస్తాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. అలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉండాలంటే సహోద్యోగులతో సన్నిహితంగా ఉంటున్నా ఓ సరిహద్దు గీసుకోవడం మంచిది.
- ఉద్యోగం చేసేవారికి నిద్రలేమి కూడా ఎదురవుతుంటుంది. రోజుకు కనీసం ఆరు గంటలు కూడా నిద్రపోని వాళ్లుంటారు. అలాంటివారు ఆఫీసులో పది నిమిషాల సమయం దొరికినా కునుకు తీసేందుకు ప్రయత్నించండి. అలా నిద్రపోవడాన్ని పవర్‌న్యాప్ అంటారు. ఇలా చేయడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి.
- నిద్రతోపాటు సరైన ఆహారం తీసుకోకపోయినా ఆరోగ్యం దెబ్బతింటుంది. అందుకే శాండ్‌విచ్, రెండు పండ్లు తీసుకెళ్తే బెటర్. కుదిరితే గ్లాస్ పాలు తాగితా మేలు. శరీరానికి కొంత శక్తి అందుతుంది.
- ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలంటే ప్రణాళిక వేసుకోవాలి. ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల జోలికి వెళ్లకూడదు. అంటే వారంలో ఒకరోజును నో టెక్నాలజీ డేగా పాటించాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

---

# నిపుణ

**కోల్ ఇండియా లిమిటెడ్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

# — విద్య ఉద్యోగ సమాచారం —

## సీపెట్‌లో బ్యాక్‌లాగ్ పోస్టులు

**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ (సీపెట్)లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 34
- **పోస్టులవారీగా ఖాళీలు:** సీనియర్ టెక్నికల్ ఆఫీసర్–3, టెక్నికల్ ఆఫీసర్–3, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్–4, సీనియర్ ఆఫీసర్ (ఎఫ్&ఏ)–1, ఆఫీసర్ (పీ&ఏ)–1, అసిస్టెంట్ ఆఫీసర్ (పీ&ఏ)–4, టెక్నికల్ అసిస్టెంట్–11, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–2, అకౌంట్స్ అసిస్టెంట్–3 ఉన్నాయి.
- ఈ పోస్టులు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మాత్రమే. (బ్యాక్‌లాగ్ ఖాళీలు)
- అర్హతలు, అనుభవం, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (డిసెంబర్ 14–20)లో ప్రచురితమైన 15 రోజుల్లోగా పంపాలి.
- **వెబ్‌సైట్:** www.cipet.gov.in

## కోల్ ఇండియాలో 1326 పోస్టులు



- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఎంటీ)
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 1326
- **విభాగాలవారీగా ఖాళీలు:** మైనింగ్–288, ఎలక్ట్రికల్–218, మెకానికల్–258, సివిల్–68, కోల్ ప్రిపరేషన్–28, సిస్టమ్స్–46, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్–28, ఫైనాన్స్&అకౌంట్స్–254, పర్సనల్&హెచ్‌ఆర్–89, మార్కెటింగ్&సేల్స్–23, కమ్యూనిటీ డెవలప్‌మెంట్–26 ఉన్నాయి.
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన కోర్సు, సీఏ, ఎంబీఏ, ఐసీడబ్ల్యూఏ, పీజీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2020, ఏప్రిల్ 1 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో డిసెంబర్ 21 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** 2020, జనవరి 19
- **పరీక్ష తేదీ:** 2020, ఫిబ్రవరి 27, 28
- **వెబ్‌సైట్:** https://www.coalindia.in

## డీడీఎస్‌లో

**హైదరాబాద్‌లోని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు–ఖాళీలు:** సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్–1, ఎస్‌ఎంఎస్ (యానిమల్ సైన్స్–1, హార్టికల్చర్–1, అగ్రికల్చర్–1) ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (డిసెంబర్ 14–20)లో ప్రచురితమైన 15 రోజుల్లోగా పంపాలి.
- **వెబ్‌సైట్:** www.ddsindia.com

## 'గురుకుల' డిగ్రీ ప్రవేశాలు

**తెలంగాణ సాంఘిక సంక్షేమ/ గిరిజన సంక్షేమ గురుకులం 2020-21 విద్యా సంవత్సరానికి డిగ్రీ ఫస్ట్ ఇయర్ (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశాల కోసం నిర్వహించే యూజీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పరీక్ష పేరు:** తెలంగాణ గురుకులం అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీయూజీసెట్)–2020
- **కోర్సులు:** బీబీఏ, బీఎస్సీ, బీఏ, బీకాం.
- **అర్హతలు:** ఇంటర్ లేదా వొకేషనల్ కోర్సులు లేదా తత్సమానకోర్సు ఉత్తీర్ణులు లేదా 2020, మార్చిలో పరీక్ష రాయనున్న విద్యార్థులు.
- విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాలలో అయితే రూ. 1,50,000/– , పట్టణాల్లో రూ. రెండులక్షలు మించరాదు.
- **కాలేజీలు:** బాలికలకు 41 కాలేజీలు, బాలురకు 7 కాలేజీలు ఉన్నాయి.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా
- ప్రవేశ పరీక్ష: 2020, జనవరి 19
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** 2020, జనవరి 5
- **వెబ్‌సైట్:** https://www.tswreis.in

## 21న ఫ్లైట్ క్యాడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్

- హాజరుకానున్న ఎయిర్ చీఫ్ మార్షల్ బదౌరియా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తొలిదశ శిక్షణను పూర్తిచేసిన ఫ్లైట్ క్యాడెట్ల కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ ఈ నెల 21న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరుగనున్నది. ప్రి కమిషనింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న మొత్తం 136 మంది గ్రాడ్యుయేట్లు పరేడ్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్కేఎస్ బదౌరియా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అనంతరం క్యాడెట్లతో ప్రమాణం చేయించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్యాడెట్లకు పతకాలను ప్రదానం చేస్తారు.

## బ్రహ్మోస్ క్షిపణి ప్రయోగం విజయవంతం

**బాలాసోర్, డిసెంబర్ 17:** సూపర్‌సోనిక్ క్షిపణి బ్రహ్మోస్‌ను విజయవంతంగా ప్రయోగించా రు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఒడిశాలోని చాందీపూర్ నుంచి ఈ ప్రయోగం జరిగినట్టు రక్షణవర్గాలు తెలిపాయి. భూఉపరితలంపై నుంచి దాడులు చేసే ఈ క్షిపణిని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) కాంప్లెక్స్ 3 నుంచి మొబైల్ అటానమస్ లాంచర్ ద్వారా ప్రయోగించినట్టు వెల్లడించాయి. బ్రహ్మోస్ క్షిపణి ప్రయోగం విజయవంతమైనదని, ఇది అన్ని ప్రమాణాలు అందుకున్నదని డీఆర్డీవోవర్గాలు తెలిపాయి. బ్రహ్మోస్ క్షిపణిని సబ్‌మెరైన్‌లు, యుద్ధ విమానాలు, జెట్ యుద్ధవిమానాలు లేదా భూ ఉపరితలంపైనుంచి కూడా పరీక్షించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నాయి. 450 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని చేరుకొనేందుకు రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణిని 2017 మార్చి 11న, భూ ఉపరితలంపై తక్కువ దూరంలోని లక్ష్యాలపై దాడులు చేసే బ్రహ్మోస్ క్షిపణిని ఈ ఏడాది సెప్టెంబర్ 30న విజయవంతంగా ప్రయోగించామని రక్షణవర్గాలు తెలిపాయి. బ్రహ్మోస్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వెళ్లే సూపర్‌సోనిక్ క్రూయిస్ క్షిపణిగా పేరుగాంచిందని చెప్పాయి. బ్రహ్మోస్ క్షిపణిని రష్యాకు చెందిన ఎన్‌పీవోఎం, భారత్‌కు చెందిన డీఆర్డీవో కలిసి రూపొందిస్తున్నాయి.



## 26న తిరుమల, శ్రీశైలం ఆలయాల మూసివేత

**తిరుమల/శ్రీశైలం:** సూర్యగ్రహణం కారణంగా ఈ నెల 26న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన ఆలయాలను మూసివేయనున్నారు. 26న ఉదయం 8.08 గంటల నుంచి 11.16 గంటల వరకు సూర్యగ్రహణం ఏర్పడనున్నది. ఈ నేపథ్యంలో 25వ తేదీ రాత్రి 11 గంటలకు తిరుమలలోని శ్రీవారి ఆలయమహాద్వారం తలుపులు మూసివేసి, ఆలయశుద్ధి అనంతరం 26న మధ్యాహ్నం 2 గంటల నుంచి దర్శనానికి అనుమతించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీశైలంలోని ఉభయదేవాలయాల ద్వారాలను 25వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 26 తేదీ ఉదయం 11.30 గంటల వరకు మూసివేయనున్నారు. 26న మధ్యాహ్నం ఒంటిగంట నుంచి దర్శనాలకు అవకాశం కల్పిస్తారు.



## పశువాంఛకు మరో యువతి బలి

- లైంగికదాడిని ప్రతిఘటించిందని కిరోసిన్ పోసి నిప్పు
- చికిత్సపొందుతూ వారం తర్వాత మృతి.. బీహార్‌లో ఘటన



**పాట్నా:** పశువాంఛకు మరో యువతి బలైంది. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో లైంగికదాడిని ప్రతిఘటించిందని కిరోసిన్ పోసి నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడ్డ 23 ఏండ్ల యువతి పాట్నాలోని దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలింది. సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో యువతి ఆరోగ్యం మరింత క్షీణించి మృతిచెందిందని దవాఖానవర్గాలు తెలిపాయి. ఈ నెల 7వ తేదీన రాత్రి ఇంట్లో ఉన్న యువతిపై రాజా రాయ్, ముకేశ్‌కుమార్ లైంగికదాడికి యత్నించారు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో ఆగ్రహంతో కిరోసిన్ పోసి నిప్పంటించారు. 95 శాతం కాలిన గాయాలతో ఉన్న యువతిని ముజఫర్‌పూర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఆ తర్వాత వేరే దవాఖానకు తరలించి మెరుగైన చికిత్స అందించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. రాయ్‌ని వెంటనే అరెస్టు చేయగా, ముకేశ్‌ను వారం తర్వాత అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ వచ్చి న్యాయంచేస్తామని హామీ ఇచ్చేవరకు కుమార్తె మృతదేహానికి అంత్యక్రియలు జరుపబోమని బాధితురాలి తల్లిదండ్రులు స్పష్టంచేశారు. తమ కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు.

# అయ్యో.. అతివ!

- లింగభేద సూచీలో 112వ స్థానంలో భారత్
- గత ఏడాది కంటే నాలుగు స్థానాలు దిగజారిన వైనం
- మహిళల ఆరోగ్య, ఆర్థిక అంశాల్లో దిగువ నుంచి 5వ ర్యాంకు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** ప్రపంచ వ్యాప్తంగా లింగభేద సూచీలో భారత్ 112వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 108వ స్థానంలో ఉండగా ఈ ఏడాది నాలుగు స్థానాలకు దిగజారింది. మరోవైపు మహిళల ఆరోగ్య, ఆర్థిక అంశాల్లో దిగువ నుంచి 5వ ర్యాంకులో ఉన్నది. జెనీవా కేంద్రంగా పని చేసే అంతర్జాతీయ సంస్థ అయిన ప్రపంచ ఆర్థిక ఫోరం(డబ్ల్యూఈఎఫ్) మంగళవారం ఈ సర్వే నివేదికను విడుదల చేసింది. పురుషులతో పోల్చితే మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలతోపాటు వారి ఆరోగ్య, ఆర్థిక సంబంధ అంశాల అంతరంపై ఈ సంస్థ ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనం చేసి నివేదిక విడుదల చేస్తుంది. ఈ ఏడాది లింగభేదం దాదాపుగా లేని దేశంగా ఐస్‌లాండ్ తొలి స్థానంలో నిలిచింది. నార్వే, ఫిన్‌లాండ్, స్వీడన్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. నికారాగువా, న్యూజిలాండ్, ఐర్లాండ్, స్పెయిన్, రువాండా, జర్మనీ దేశాలు టాప్ పది ర్యాంకుల్లో చోటు దక్కించుకున్నాయి. మరోవైపు యెమన్ అత్యంత దిగువన 153వ స్థానంలో ఉండగా, దిగువ నుంచి తర్వాత స్థానాల్లో ఇరాక్ (152), పాకిస్థాన్ (151), భారత్ (112), చైనా (106), శ్రీలంక (102), నేపాల్ (101), బ్రెజిల్ (92), ఇండోనేషియా (85), బంగ్లాదేశ్ (50) ఉన్నాయి. ఈ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాపంగా లింగభేద అంతరం లేని ప్రపంచం సాకారం కావడానికి 99.5 ఏండ్ల సమయం పడుతుందని డబ్ల్యూఈఎఫ్ అంచనా వేసింది. గత ఏడాది ఈ వ్యవధి 108 ఏండ్లుగా ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాల్లో మహిళల సంఖ్య కాస్త మెరుగుపడటం దీనికి కారణమని డబ్ల్యూఈఎఫ్ పేర్కొంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 25.2 శాతం మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యారని, 21.2 శాతం మంత్రి పదవుల్లో ఉన్నారని తెలిపింది. గత ఏడాది ఇవి 24.1, 19 శాతం మేర ఉండగా ఈసారి కాస్త పురోగతి కనిపించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో రాజకీయపరంగా పురుషులు, మహిళల మధ్య లింగబేధ అంతరం పోవడానికి 95 ఏండ్లు పడుతుందని అంచనా వేసింది. గత ఏడాది ఇది 107 ఏండ్లుగా ఉన్నది. మరోవైపు ఆర్థికపరమైన అవకాశాలలో పురుషులతో పోల్చితే మహిళల పరిస్థితి దారుణంగా ఉన్నదని వెల్లడించింది. ఈ అంతరం సమసిపోవడానికి గత ఏడాది 202 ఏండ్లుగా అంచనా వేయగా ఈ ఏడాది అది 257 ఏండ్లకు దిగజారినట్లు తెలిపింది.

### పడిపోతున్న భారత్ స్థానం

పురుషులు, మహిళల మధ్య లింగబేధ సూచీలో భారత్ స్థానం రానురాను పడిపోతున్నది. డబ్ల్యూఈఎఫ్ 2006లో తొలిసారి విడుదల చేసిన నివేదికలో భారత్ 98వ స్థానంలో ఉండగా నాటి నుంచి ప్రతి ఏటా ర్యాంకు మరింత దిగజారుతూ వస్తున్నది. అయితే మహిళల రాజకీయ సాధికారతలో మన దేశం 18వ స్థానంలో ఉన్నది. మరోవైపు ఆరోగ్య, ఆర్థిక, విద్యా పరమైన అంశాల్లో 150, 149, 112 స్థానాలకు పడిపోయింది. భారత్‌లో మహిళలకు ఆర్థిక అవకాశాలు 35.4 శాతం మాత్రమే ఉన్నట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. కంపెనీ బోర్డుల్లో భారత మహిళల ప్రాతినిధ్యం కేవలం 13.8 శాతం ఉండగా చైనాలో అది 9.7 శాతం మాత్రమేనని పేర్కొంది. భారత్, పాకిస్థాన్, చైనా, వియత్నాం వంటి దేశాల్లో పురుషులతో పోల్చితే లక్షలాది మహిళలకు కనీస ఆరోగ్య సదుపాయాలు అందడం లేదని తెలిపింది. భారత్‌లో లింగ నిష్పత్తి కూడా అసాధారణంగా (వంద బాలురకు 91 మంది బాలికలు) ఉన్నదని పేర్కొంది. ఆర్థికపరంగా లింగభేద సూచిలో చాలా అంతరం కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. 82 శాతం మంది పురుషులతో పోల్చితే నాలుగోవంతు మహిళలకు మాత్రమే ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయని (145వ ర్యాంకు), పురుషుల కంటే ఐదవ వంతు మాత్రమే ఆదాయం సంపాదించగలుగుతున్నారని, ప్రపంచ దేశాల్లో పోల్చితే 144వ స్థానంలో ఉన్నట్లు తెలిపింది. నాయకత్వ పరంగా 14 శాతం (136వ స్థానం), సాంకేతిక, ప్రొఫెనల్స్‌గా 30 శాతం ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు భారత్‌లో మహిళలపై హింస, బలవంతపు పెండ్లిండ్లు, ఆరోగ్య సేవల్లో వివక్ష వంటి అంశాల్లో ఎలాంటి పురోగతి లేదని పేర్కొంది.

## నిర్భయ కేసులో.. దోషి రివ్యూ పిటిషన్‌పై నేడు విచారణ

- విచారణ నుంచి తప్పుకొన్న సీజేఐ బోబ్డే



**న్యూఢిల్లీ, డిసెంబర్ 17:** నిర్భయ కేసులో కోర్టు తనకు విధించిన మరణశిక్షను సమీక్షించాలని కోరుతూ దోషి అక్షయ్‌కు మార్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగనుంది. అయితే ఈ పిటిషన్‌పై జరుగనున్న విచారణ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే తప్పుకొన్నారు. 2017లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దోషి దాఖలు చేసిన పిటిషన్‌పై మరో సమాంతర ధర్మాసనం విచారణ జరుపుతుందని సీజేఐ, న్యాయమూర్తులు ఆర్ భానుమతి, అశోక్ భూషణ్‌తో కూడిన ప్రత్యేక ధర్మాసనం మంగళవారం పేర్కొంది. తన బంధువులలో ఒకరు ఇదివరకు ఈ కేసులో నిర్భయ తల్లి పక్షాన వాదనలు వినిపించారని, అందువల్ల ఈ పిటిషన్‌పై విచారణ నుంచి తాను తప్పుకుంటున్నానని సీజేఐ తెలిపారు. దోషి పిటిషన్‌పై బుధవారం ఉదయం10.30 గంటలకు మరో ధర్మాసనం విచారణ జరుపుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలో పెరుగుతున్న వాయు, జల కాలుష్యం వల్ల పౌరుల ఆయుష్షు ఎలాగూ తగ్గిపోతున్నది గనుక.. తనకు ఉరిశిక్ష అమలుచేసి ప్రాణం తీయాల్సిన అవసరంలేదని, క్షమాభిక్షను ప్రసాదించాలని అక్షయ్‌కుమార్ కోర్టును వేడుకున్నాడు. ఈ కేసులో దోషులుగా ఖరారై మరణశిక్ష పడిన మరో ముగ్గురు దోషులు ముఖేశ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ దాఖలు చేసుకున్న రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు గత ఏడాది జూలై 9న తోసిపుచ్చింది.

## శశిసింగ్‌ను నిర్దోషిగా ఎందుకు ప్రకటించారు?

- ఉన్నావ్ బాధితురాలి తల్లి అసంతృప్తి
- సెంగార్‌కు మరణశిక్ష విధించాలని డిమాండ్

**ఉన్నావ్ (యూపీ), డిసెంబర్ 17:** ఉన్నావ్ లైంగికదాడి కేసులో సహనిందితురాలిగా ఉన్న శశిసింగ్‌ను ఢిల్లీ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై బాధితురాలి తల్లి అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉద్యోగమిస్తామని నమ్మబలికి తన కుమార్తెను బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్ వద్దకు తీసుకెళ్లినవారిలో శశిసింగ్ కూడా ఉన్నదని, ఆమెను ఎందుకు నిర్దోషిగా ప్రకటించారని ప్రశ్నించారు. తన మరిది (బాధితురాలి చిన్నాన్న) ఇప్పటికీ జైలులోనే ఉన్నారని, ఆయన బయటికి వచ్చేవరకు తమకు న్యాయం జరుగదని వాపోయారు. 'మీడియా సహకారంతో నేను న్యాయపోరాటంలో విజయం సాధించగలిగా. కానీ నాకు ఇప్పటికీ భయంగానే ఉన్నది. రాయ్‌బరేలీలో జరిగిన కారు 'ప్రమాదం' లాంటి ముప్పు ఇప్పటికీ పొంచి ఉన్నది. జైలులో ఉన్నప్పటికీ ప్రమాదాన్ని చేయించగలిగిన ఆయన (సెంగార్) ఏదైనా చేయగలడు' అని ఆమె పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో జరిగిన ప్రమాదం వెనుక సెంగార్ హస్తమున్నదని ఇంతకుముందు తన కుమార్తె చేసిన ఆరోపణను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సెంగార్‌కు మరణశిక్ష విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదిలా వుంటే.. శశిసింగ్‌ను నిర్దోషిగా ప్రకటించడం పట్ల ఆమె కుమారుడు నవీన్‌సింగ్ సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

**సెంగార్‌కు శిక్షపై విచారణ 20కి వాయిదా**

మరోవైపు ఈ కేసులో సెంగార్‌కు విధించే శిక్షను ఖరారు చేయడంపై విచారణను ఢిల్లీ కోర్టు ఈ నెల 20కి వాయిదా వేసింది. ఆయనకు గరిష్ఠస్థాయిలో శిక్ష విధించాలని, బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని సీబీఐ కోరింది. ఇది న్యాయం కోసం ఓ వ్యక్తి వ్యవస్థపై సాగిస్తున్న పోరాటమని సీబీఐ పేర్కొన్నది.



మంగళవారం హైదరాబాద్‌లో మాజీ సైనికులతో సమావేశమైన డీజీపీ మహేందర్‌రెడ్డి

## మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం

- సంక్షేమబోర్డు సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాజీ సైనికుల సమస్యలను పరిష్కరిస్తామని, వారి సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాలుగో సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ.. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిస్తామని చెప్పారు. అందుకు ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమిస్తానని తెలిపారు. మాజీ సైనికులకు ఉద్యోగాల కల్పన, ఐటీ శిక్షణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల తరపున సైనిక సంక్షేమబోర్డు డైరెక్టర్, కల్నల్ రమేశ్‌కుమార్ డీజీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాంతిభద్రతల అదనపు డీజీ జితేందర్, అదనపు కార్యదర్శి చంపాలాల్, కెప్టెన్లు శ్రీనివాస్, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో మరమ్మతుల తర్వాత పట్టాలను పరిశీలిస్తున్న అధికారులు

## విరిగిన రైలుపట్టా.. తప్పిన ముప్పు

- సకాలంలో గుర్తించిన మహిళా గ్యాంగ్‌మెన్
- వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన

**ఖిలావరంగల్:** వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టా విరిగింది. సకాలంలో మహిళా గ్యాంగ్‌మెన్ గుర్తించడంతో పెనుప్రమాదం తప్పింది. రైల్వే అధికారుల కథనం ప్రకారం... వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మధ్య 376/21/31 కిలోమీటర్ మైలు రాయి సమీపంలోని స్విచ్ ఎక్స్‌టెన్షన్ జాయింట్ వద్ద మంగళవారం మధ్యాహ్నం రైలు పట్టా విరిగింది. విధుల్లో భాగంగా మహిళా గ్యాంగ్‌మెన్ రాజేశ్వరి రైలు పట్టా విరిగిన విషయాన్ని గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం చేరవేసింది. అధికారులు, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. సెక్షన్ ఇంజినీర్ రవికుమార్ పర్యవేక్షణలో విరిగిన రైలు పట్టాకు మరమ్మతులు చేపట్టారు. నెక్కొండ నుంచి స్విచ్ ఎక్స్‌టెన్షన్ జాయింట్ ప్లేట్లను తీసుకొచ్చి అమర్చారు. మరమ్మతులు పూర్తి చేయడంతో యథావిధిగా రైళ్లు నడిచాయి. రైలు పట్టా విరిగిన విషయాన్ని సకాలంలో గుర్తించడంతో పెనుప్రమాదం తప్పిందని రైల్వేవర్గాలు పేరొన్నాయి.

# దహేగాంలో రెవెన్యూ దగా

- లంచాలు ఇస్తేనే పాస్‌పుస్తకం
- లేకుంటే ఇతరుల మీదకు పేర్లు మార్పు
- పదిహేనేండ్లుగా అమలుకాని కోర్టు తీర్పు
- ధర్మగంటను ఆశ్రయించిన కుమ్రంభీం ఆసిఫాబాద్ రైతులు

ధర్మగంట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం రెవెన్యూ అధికారులు నిరుపేద, నిరక్ష్యరాస్యులైన రైతులను జలగల్లా పీల్చి పిప్పిచేస్తున్నారు. లక్షల రూపాయల లంచాలు డిమాండ్ చేస్తూ.. అవి ఇవ్వని రైతుల భూములను ఇతరుల పేరిట రాసేస్తున్నారు. డిజిటల్ సంతకాలను పెండింగ్‌లో పెడుతూ మోకాపైకి మరొకరిని ఉసిగొల్పుతున్నారు. పదిహేనేండ్ల క్రితం కోర్టు ఇచ్చిన ఆదేశాలనూ బేఖాతర్ చేస్తున్నారు. ఇదేమని అడిగితే 'కోర్టు తీర్పు ఇస్తే.. మేమెందుకు అమలు చేయాలి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని మండలంలోని రెండు గ్రామాలకు చెందిన రైతులు హైదరాబాద్‌లోని 'నమస్తే తెలంగాణ' ప్రధాన కార్యాలయానికి వచ్చి ధర్మగంటను ఆశ్రయించారు. ఐదుగురు రైతుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కోగాథ..

### 2004లో కోర్టు తీర్పు ఇచ్చినా..



మాది దహేగాం మండలంలోని గిరివెల్లి గ్రామం. మాకు చెందిన దాదాపు ఆరెకరాల భూమిని అల్లూరి చిన్నాయిన, అల్లూరి ఇస్తారి, అల్లూరి శివరామ్ కబ్జాచేశారు. ఆ భూమి తమదేనంటూ అందుకనుగుణంగా ఆదేశాలివ్వాలంటూ తిరిగి వారే కోర్టును ఆశ్రయించారు. అయితే రికార్డులను పరిశీలించిన న్యాయస్థానం 2004 మార్చి 10న అల్లూరి చిన్నాయిన తదితరులు వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆ భూమి మాకే చెందుతుందంటూ డిక్రీ ఇచ్చింది. న్యాయస్థానం తీర్పుఇచ్చి 15 ఏండ్లు అవుతున్నా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు దానిని అమలుచేయలేదు. తమ భూమికి రికార్డులలో అనుభవదారులుగా ఉన్న కబ్జాదారుల పేర్లు తొలగించి, తమకు పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరితే మా గ్రామ వీఆర్వో రామ్‌టెంకి సురేశ్ రూ.3 లక్షల లంచం అడిగాడు. లంచం ఇచ్చుకోలేకపోవడంతో మా భూమిని అల్లూరి చిన్నాయిన పేరును అనుభవదారుకాలంలో అలాగే ఉంచారు. అల్లూరి చిన్నాయిన, అతని సంబంధించిన వ్యక్తులు ఆ భూమి వద్దకువస్తే కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారు. కోర్టు ఆదేశాల కాపీని అధికారులకు చూపిస్తే కోర్టులు మస్తుగా ఇస్తాయి అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. మా భూమిని మాపేరిట రికార్డుల్లో ఎక్కించి, కబ్జాచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**- అల్లూరి శంకర్, రాజక్క దంపతులు, గిరివెల్లి**

### లావుణి పట్టాభూమికి రూ.లక్ష లంచం



గిరివెల్లి గ్రామంలోని 387/40 సర్వేనంబర్‌లో నాకు 2.08 ఎకరాల భూమి ఉన్నది. సేద్యం చేసుకొని బతకడానికి లావుణి పట్టాభూమిని ప్రభుత్వం ఇచ్చింది. ఈ భూమికి నా పేరుమీద కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకం కోసం అల్లూరి శంకర్, అల్లూరి రాజక్క లక్ష రూపాయలు అడిగాడు. చాకలి వృత్తిచేసి బతికేవాడిని నా దగ్గర లక్ష రూపాయలు లేవని చెప్పినందుకు పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టాడు. పైగా ఆ భూమిని పరికిల దుర్గమ్మను దున్నుకోమని ఎగవేశాడు. ప్రభుత్వం ఏనాడో ఇచ్చిన ఈ భూమే నా కుటుంబానికి ఆధారం. ఇప్పుడు దానిని దుర్గమ్మకు రాయాలని వీఆర్వో చూస్తున్నాడు.. ఎలాగైనా నా భూమిని నాకు ఇప్పించండి.

**- నేతల నాగయ్య (చాకలి నాగయ్య)**

### రూ.50 వేలు ఇవ్వలేదని..



గిరివెల్లిలో 387/11 సర్వేనంబర్‌లో నాకు 1.84 ఎకరాలు ఉన్నది. ఈ భూమిని నాపేరున రాయడానికి వీఆర్వో రూ.50 వేలు లంచం అడిగాడు. ఇవ్వకపోవడతో రికార్డులో ఎక్కించకపోగా.. దుర్గబాబు అనే అతడ్ని ఆ భూమిని సాగు చేసుకోమని అప్పగించాడు. నేను దున్నుకోవడానికి వెళితే గొడ్డలితో నరకడానికి వస్తున్నారు. నాకు సర్వేనంబర్లు 45,66,141లో ఉన్న పదెకరాల భూమిని కూడా నా పేరిట రాస్తానని రాయడం లేదు. అధికారులే నా భూమిని నాకు దక్కకుండా చేస్తున్నారు.

**- శివార్ల మల్లయ్య, గిరివెల్లి**

### ఇతరులకు రాశారు



నాది దహేగాం మండలం కల్వాడ గ్రామం. మా కుటుంబానికి కుంచెపల్లిలో సర్వేనంబర్ 314/1ఏలో ఐదెకరాల భూమి వారసత్వంగా వచ్చింది. నా తండ్రి పెద్దల సన్యాసి పట్టాదారుగా ఉన్నారు. ఆయన మరణించాక ముగ్గురు అన్నదమ్ముల పేరిట విరాసత్ చేయాలని దరఖాస్తు చేసుకున్నాం. కానీ, విరాసత్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. మా ఇంటి పేరుమీద ఉన్నవాళ్లు కుంచెపల్లిలో ఉండడంతో కావాలని కొంతమంది ప్రమేయంతో ఆపారు. ఇదేఅదనుగా ఆ గ్రామానికి చెందినవారు భూకబ్జాకు యత్నిస్తున్నారు. వారసత్వంగా వచ్చిన ఈ భూమి విరాసత్ చేసి ఇప్పించండి.

**- పెద్దల శంకర్, కల్వాడ, దహేగాం మండలం**

### పరిశీలించి న్యాయంచేస్తా

బాధిత రైతులు వచ్చి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి న్యాయంచేస్తా. వీఆర్వో లంచం అడిగినట్టు చేసిన ఫిర్యాదుపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు రిపోర్టు పంపిస్తా.

**- సాయన్న, తాసిల్దార్, దహేగాం మండలం**

### ఎవరినీ లంచం అడగలేదు

నేను రైతులను ఎలాంటి లంచాలు అడుగలేదు. రికార్డుల ప్రకారమే పనిచేస్తున్నాను. నేనురాక ముందునుంచీ అల్లూరి శంకర్‌కు చెందిన పట్టా భూమికి అనుభవదారు కాలంలో అల్లూరి చిన్నాయిన పేరు ఉన్నది. కోర్టు ఆదేశాలను అంతా మా సార్లు చూస్తున్నారు. నాకు సంబంధం లేదు. రికార్డులన్నీ తాసిల్దార్‌కు, ఆర్డీవోకు అప్పగించాను.

**- రామ్‌టెంకి సురేశ్, వీఆర్వో, గిరివెల్లి గ్రామం**

## 12 కిలోల గంజాయి స్వాధీనం

- వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరి అరెస్ట్



గంజాయి రవాణా నిందితుల వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు వినయ్‌కుమార్, రవిబాబు

**ఖిలావరంగల్:** వరంగల్ రైల్వేస్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం రైల్వే పోలీసులు అరెస్టుచేశారు. వరంగల్ రైల్వే ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం... వరంగల్ రైల్వేస్టేషన్‌లో సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆర్పీఎఫ్ ఎస్సై కే రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా విఠల్‌వాడికి చెందిన సంజయ్‌వినాయక కొంపల్‌వార్ (38), యోగేష్ దివాకర్ అగ్నిహోత్రి (38) అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని పరిశీలించగా ఒక్కొక్కరు ఆరుకిలోల చొప్పున గంజాయి (మొత్తం 12 కిలోలు)సంచులను సిక్స్‌ప్యాక్ బాడీ మాదిరిగా నడుము నుంచి ఛాతివరకు చుట్టుకొని కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని వరంగల్ రైల్వేపోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు, ఎస్సైలు రాజేంద్రప్రసాద్, సీహెచ్ పరశురాములు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## అక్రమ లేఅవుట్లు నిలిపేయాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కీసర దళితుల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొందరు తమ భూములు ఆక్రమించుకొని వేసిన అక్రమ లేఅవుట్లను నిలిపేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కీసర గ్రామ దళితులు కోరారు. మంగళవారం కమిషన్ కార్యాలయానికి వచ్చిన దళితులు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ భూమి వివాదం కోర్టులో ఉన్నదని, కేసు ముగిసేవరకు భూమిలో ఎలాంటి పనులు జరుపొద్దని కోర్టు ఉత్తర్వులున్నా.. అధికారులు ఇతరులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని ఆరోపించారు. భూవివాదంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎర్రోళ్ల శ్రీనివాస్ వారికి హామీఇచ్చారు.

## అదుపుతప్పి పొలాల్లోకి కాలేజీ బస్సు

- ఇద్దరికి స్వల్ప గాయాలు

**కారేపల్లి రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు కళాశాల బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మంగళవారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా సమీపంలో చోటుచేసుకున్నది. ఇల్లెందులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన బస్సు కారేపల్లి మండల పరిధిలోని భాగ్యనగర్‌తండా ప్రాంతం నుంచి విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తుండగా మార్గంమధ్యలో బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో 15 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. బస్సుడ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపులోకి తేవడంతో పెనుప్రమాదం తప్పింది.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 18 డిసెంబర్ 2019


వెంకటేష్, పాయల్ రాజ్‌పుత్, నాగచైతన్య, రాశీఖన్నా, బాబీ, తమన్

# ఇండస్ట్రీలో ప్రతికూల ఆలోచనలు వద్దు!

'అందరూ బాగుండాలని నేనెప్పుడూ కోరుకుంటాను. నెగెటివిటీని తీసేస్తే ఇండస్ట్రీ బాగుంటుంది' అని అన్నారు వెంకటేష్. నాగచైతన్యతో కలిసి ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'వెంకీమామ'. బాబీ దర్శకుడు. సురేష్ బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. రాశీఖన్నా, పాయల్‌రాజ్‌పుత్ కథానాయికలు. మంగళవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ 'ఫైనల్‌గా పెద్ద సక్సెస్ ఇచ్చావు. థ్యాంక్స్ దేవుడా. మంచి సినిమా తీయాలని ప్రతి ఒక్కరం కష్టపడ్డాం. సినిమాను ప్రేక్షకులంతా ప్రేమిస్తూ బ్లాక్‌బస్టర్ హిట్ చేశారు. చిరంజీవి, మహేష్‌బాబు ఈ సినిమాను ప్రశంసించడం ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరూ పాజిటివ్‌గా ఆలోచిస్తూ ఒకరికొకరు సహకరించుకోవాలి' అని తెలిపారు. నాగచైతన్య మాట్లాడుతూ 'ఇద్దరూ మామలు కలిసి నాకో పెద్ద విజయాన్ని ఇచ్చారు. తాత కల ఈ సినిమా. బాబీ ఈ సినిమాతో హీరోగా నాకో కొత్తదారిని చూపించారు' అని పేర్కొన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఈ సినిమా చూశానని, మామఅల్లుళ్ల కాంబినేషన్‌ను అమ్మనాన్నలు ఎంజాయ్ చేశారని రాశీఖన్నా చెప్పింది. తన కెరీర్‌లో తొలి కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇదని పాయల్ రాజ్‌పుత్ అన్నారు. దర్శకుడు వంశీపైడిపల్లి మాట్లాడుతూ 'రెండు వారాల ముందు రిలీజ్ డేట్ ప్రకటించి హిట్ కొట్టి చూపించారు. సినిమాలో వెంకటేష్, నాగచైతన్య నటించిన అనుభూతి ఎక్కడా కలగలేదు. వారి మధ్య ఉన్న బంధం మాత్రమే కనబడింది. వాణిజ్య హంగులు, ఎమోషన్స్‌ను మేళవిస్తూ బాబీ అద్భుతంగా సినిమాను రూపొందించారు' అని అన్నారు. 'నా జీవితంలో చాలా ప్రత్యేకమైన సినిమా ఇది. మామ అల్లుళ్ల బంధాన్ని నిజాయితీగా సినిమాలో చూపించాం. తన మావయ్యలను, కథను నమ్మి చైతన్య ఈ సినిమా చేశాడు. చిరంజీవి ఈ సినిమా చూసి అభినందించడం ఆనందంగా ఉంది' అని బాబీ తెలిపారు.

# చందమామ మైనపుబొమ్మ



వివిధ రంగాల్లోని ప్రముఖుల మైనపుబొమ్మలతో కొలువుదీరి ఉండే మేడమ్ టుసాడ్స్ మ్యూజియంకు ప్రపంచవ్యాప్తంగా గొప్ప గుర్తింపు ఉంది. బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌కు చెందిన పలువురు సెలబ్రిటీల మైనపుబొమ్మలు ఈ మ్యూజియంలో చోటు దక్కించుకున్నాయి. తాజాగా ఈ వరుసలో వెండితెర అందాల చందమామ కాజల్ అగర్వాల్ చేరబోతున్నది. ఈ విషయాన్ని ఆమె సోషల్‌మీడియా ద్వారా వెల్లడించింది. 'సింగపూర్‌లోని మేడమ్ టుసాడ్స్ మ్యూజియంలో నా మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. నా జీవితంలో అత్యంత సంతోషదాయకమైన క్షణాలివి. చిన్నప్పుడు సింగపూర్ వెళ్లి అక్కడి మేడమ్ టుసాడ్స్ మ్యూజియంలో విగ్రహాల్ని తదేకంగా చూస్తూ ఉండిపోయిన రోజులు ఇంకా గుర్తున్నాయి. ఇప్పుడు ప్రముఖుల సరసన నా విగ్రహం చోటు సంపాదించుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇన్నేళ్ల నా కష్టానికి, శ్రమకు లభిస్తున్న గుర్తింపు ఇది' అని కాజల్ ఆనందం వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 5న కాజల్ అగర్వాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు సంబంధించి మ్యూజియం ప్రతినిధులు కాజల్ అగర్వాల్ కళ్లు, జుట్టు, ముఖం తాలూకూ కొలతల్ని తీసుకున్నారు. ఈ ఫొటోల్ని కాజల్‌అగర్వాల్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది.

కాజల్ అగర్వాల్

# అమ్మ వల్ల సినిమా నిర్మించా!

''శతమానంభవతి'తో ఈ సినిమాకు ఎలాంటి పోలికలు ఉండవు. నేపథ్యాలు ఒకటే అయినా కథలు వేరుగా ఉంటాయి' అని అన్నారు బన్నీవాస్. ఆయన నిర్మిస్తున్న తాజా చిత్రం 'ప్రతి రోజూ పండగే'. సాయితేజ్, రాశీఖన్నా జంటగా నటించారు. మారుతి దర్శకుడు. ఈ నెల 20న విడుదలకానుంది. మంగళ వారం హైదరాబాద్‌లో బన్నీ వాస్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...


బన్నీ వాస్

మారుతితో మా సంస్థలో సినిమా చేయాలని ఓ కథతో ఏడెనిమిది నెలలు ప్రయాణించాం. ఓ రోజు హఠాత్తుగా మరో పాయింట్ తనలో ఉత్సుకతను రేకెత్తించిందని మారుతి 'ప్రతిరోజూ పండగే' కథ వినిపించారు. ఈ రోజుల్లో ఇలాంటి క్యారెక్టర్స్ ఉంటాయా? అసహజంగా కథ ఉంటుందేమోననే ఆలోచనతో తొలుత సినిమా చేయడానికి సంశయించాను. మా అమ్మ వల్ల ఈ సినిమాను నిర్మించాను. 'నీతో ఫోన్ మాట్లాడటానికి ఐదు రోజుల నుంచి ప్రయత్నిస్తున్నాను కానీ కుదరడం లేదు' అని అమ్మ ఓ రోజు చెప్పింది. ఫోన్‌లో చూస్తే అమ్మ నుంచి వచ్చిన మిస్డ్‌కాల్స్ చాలా ఉన్నాయి. తెలియకుండానే బిజీలైఫ్‌లో పడి తల్లిదండ్రులను కొంత నిర్లక్ష్యం చేస్తుంటామని మారుతి చెప్పిన కథ గుర్తొచ్చింది. వెంటనే నిరాదరణకు గురైన తల్లిదండ్రుల కథనాల్ని పత్రికల్లో చదివాను. అవన్నీ చూడగానే సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. తల్లిదండ్రులు పంచిన ప్రేమ తిరిగి వారిపై చూపించడంలో విఫలమవుతున్నామనే సందేశాన్ని చాటిచెప్పే సినిమా ఇది. మరణాన్ని చాలా మంది బాధాకరంగా భావిస్తుంటారు. చావును ఓ పండగలా సెలబ్రేట్ చేసుకోవాలనే అంశాన్ని సీరియస్ కోణంతో పాటు వినోదాత్మకంగా మారుతి సినిమాలో ఆవిష్కరించారు. అంతిమ ఘడియల్ని సంతోషంగా గడపగలిగేలా చేయడం కూడా పండగగానే భావించాలనే ఇతివృత్తమిది.

**హిందీ 'జెర్సీ' రీమేక్..**

ఇగోలను పక్కనపెట్టి తప్పొప్పుల్ని ఒకరికొకరం సరిదిద్దుకుంటూ జీఏ2 నిర్మాణసంస్థలోని భాగస్వాములమంతా పనిచేస్తుంటాం. అల్లు అరవింద్, యూవీ నిర్మాతలు, నేను, కొత్త దర్శకసాంకేతిక నిపుణులు ఇలా మూడు తరాల కలయికలో జీఏ2 సంస్థ పనిచేస్తున్నది. ప్రస్తుతం హిందీలో 'జెర్సీ' రీమేక్‌ను నిర్మిస్తున్నాం. అఖిల్–బొమ్మరిల్లు భాస్కర్, నిఖిల్– సూర్యప్రతాప్ సినిమాతో పాటు కార్తికేయతో హీరోగా మరో సినిమా నిర్మిస్తున్నాం. ఈ సినిమాతో కౌశిక్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. గీతా ఆర్ట్స్‌లో మహేష్ బాబుతో సినిమా తప్పకుండా ఉంటుంది.

# రహస్యాన్ని దాచుకోను



'కాలేజీ రోజుల్లో ప్రేమ ప్రతిపాదనలు చాలానే వచ్చాయి. ఆ వయసులో ఏదో తెలియని ఆకర్షణ సహజం. అందుకే వాటిని కేవలం అపరిపక్వమైన పనులుగానే భావించాను. ఎవరినీ ప్రేమించలేదు' అని చెప్పింది కియారా అద్వాణీ. 'భరత్ అనే నేను' 'వినయ విధేయ రామ' చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైంది ఢిల్లీ సోయగం. ప్రస్తుతం ఆమె హిందీలో డేటింగ్ యాప్స్ నేపథ్యంలో 'ఇందూ కీ జవానీ' అనే చిత్రంలో నటిస్తున్నది. ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ ద్వారా నచ్చిన భాగస్వామిని ఎంచుకునే అమ్మాయి పాత్రలో కనిపించనుంది. ఈ సందర్భంగా డేటింగ్ యాప్స్ గురించి తన అభిప్రాయాల్ని వెల్లడించింది కియారా అద్వాణీ. 'ఆన్‌లైన్ డేటింగ్ సంస్కృతిని నేను విశ్వసించను. వీటి ద్వారా అవతలి వ్యక్తి గురించి పూర్తిగా తెలుసుకునే అవకాశం దొరకదు. వాళ్లు ఎంతవరకు నిజాయితీపరులో అర్థం కాదు. కలిసి ప్రయాణం చేస్తేనే వారి అభిరుచులు, మనస్తత్వం పూర్తిగా అవగతం అవుతాయి. సినిమాల్లో బిజీగా ఉండటం వల్ల మనసైన వ్యక్తి గురించి ఆలోచించే తీరిక లేకుండా పోయింది. ప్రస్తుతం నా దృష్టంతా సినిమాల మీదనే ఉంది. ఇప్పుడు నేను సింగిల్‌గానే ఉన్నాను. నచ్చిన వ్యక్తి తారసపడితే అందరికి ఆ విషయాన్ని వెల్లడిస్తాను. ఆ రహస్యాన్ని దాచిపెట్టుకోను' అని చెప్పింది కియారా అద్వాణీ.

కియారా అద్వాణీ

# రూమర్స్ చూసి నవ్వుకుంటాను



'బాలకృష్ణతో సినిమా అనగానే కథ వినకుండానే సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. ఆయనతో ఎన్ని సినిమాలైనా చేయడానికి సిద్ధమే' అని అని తెలిపింది సోనాల్‌చౌహాన్. ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'రూలర్'. బాలకృష్ణ హీరోగా నటించిన ఈ చిత్రానికి కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. ఈ నెల 20న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో సోనాల్‌చౌహాన్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ ''లెజెండ్'లో నటించడానికి అంగీకరించిన తర్వాత తొలిసారి బాలకృష్ణను కలవడానికి చాలా భయపడ్డాను. ఆయన్ని కలిసిన రెండు క్షణాల్లోనే ఆ భయమంతా పోయింది. స్నేహభావం, సెన్సాఫ్‌హ్యూమర్ ఉన్న చక్కటి వ్యక్తిత్వం ఆయనది. లెజెండ్, డిక్టేటర్ తర్వాత బాలకృష్ణతో కలిసి నేను నటించిన మూడో చిత్రమిది. ఇందులో హారిక అనే యువతిగా నేను కనిపిస్తాను. తాను అనుకున్నది సాధించాలనే పట్టుదల కలిగి ఉంటుంది. నటిగా నాలోని వైవిధ్యతను ఆవిష్కరించుకునే పాత్రల కోసం ఎదురుచూస్తున్నాను. ఓ పాత్ర గుర్తింపును తెచ్చిపెడితే సినీ పరిశ్రమలో అందరూ అలాంటి పాత్రలే ఇస్తుంటారు. నా విషయంలో అదే జరిగింది. ఎక్కువగా గ్లామర్ క్యారెక్టర్స్ నన్ను వరిస్తున్నాయి. డీ గ్లామర్ పాత్రలతో నా ప్రతిభను నిరూపించుకోవాలనుంది. నాపై వచ్చే రూమర్స్ చూసి నవ్వుకుంటాను. సంబంధంలేని వ్యక్తులతో ముడిపెట్టి వార్తలు రాస్తుంటారు. అవన్నీ నేను పట్టించుకోను' అని తెలిపింది.

సోనాల్ చౌహాన్

# 'ఊల్లాల ఊల్లాల' గీతాలు


గురురాజ్, ఆర్.కె.గౌడ్, రామ్‌గోపాల్‌వర్మ, కల్యాణ్, నూరిన్, నటరాజ్, సత్యప్రకాష్

నటరాజ్, నూరిన్, అంకిత నాయకానాయికలుగా సత్యప్రకాష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. గురురాజ్ నిర్మాత. ఈ చిత్ర ఆడియోను సోమవారం దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్, ట్రైలర్ చాలా బాగున్నాయి. మేకింగ్ వీడియో చూస్తుంటే సత్యప్రకాష్‌లో ఇంతటి ప్రతిభ ఉందా అనిపించింది. సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. 'జనవరి 1న చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం. ఈ సినిమా ద్వారా మా అబ్బాయిని కథానాయకుడిగా పరిచయం చేస్తున్నా. కథానుగుణంగా మంచి టైటిల్ కుదిరింది. నిర్మాత గురురాజ్, నేను ప్రతి సన్నివేశాన్ని చర్చించుకొని సినిమాను తెరకెక్కించాం. టైటిల్‌కు మంచి స్పందన వస్తున్నది. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను అలరించే అంశాలున్న చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు. సినిమాలోని ప్రతి సన్నివేశాన్ని అద్భుతంగా మలిచారని తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ తెలిపారు. ఈ వేడుకకు రామ్‌గోపాల్‌వర్మ రావడం మంచి ఎనర్జీనిచ్చిందని సీనియర్ నిర్మాత సి.కల్యాణ్ పేర్కొన్నారు. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో భాగం కావడం ఆనందంగా ఉందని నాయకనాయికలు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.





